


# ముగ్గురు మిత్రులు

Blank Page

# ముగ్గురు మిత్రులు

మాక్సిమ్ గోర్కీ

అనువాదం

బెల్లంకొండ రామదాసు

★

దేశికవితామండలి; విజయవాడ-

దేశీ ప్రచురణ
ప్రథమ ముద్రణ
నవంబరు 1962
రెండు రూపాయలు

★

ఇవిసా సభ్యులకు
సరస సాహిత్యమాల

★

దేశీ ప్రెస్,
విజయవాడ - 2

# ముగ్గురు మిత్రులు

కెర్జెనెట్జ్ అరణ్యంలో అక్కడక్కడ చెదురుచెదురుగా అనేక సమాధులు కనిపిస్తూ ఉంటాయి. ఈ సమాధుల్లో శయనించిన వారంతా పాతకాలపు మహాత్ములు. ఇప్పుడు మనం వినబోతున్నది, ఈ మహాత్ములలో ఒకడైన అంతిపా అనే వాని కథ. అంతిపాను గురించి కెర్జెనెట్జ్ ప్రాంతానికి చెందిన గ్రామీణులు చెప్పుకునే కథ ఇది:

అతని పూర్తిపేరు అంతిపా లుక్యాన్. అంతిపా లుక్యాన్ పెద్ద భూస్వామి. మంచి ఘటికుడైన వ్యవహర్త కూడా. యాభయ్యోపడిలో పడేవరకూ ఇహ సుఖాలన్నీ నిండుగా అనుభవించాడు. హఠాత్తుగా అతనికి ఎందుచేతనో విరక్తి కలిగింది. ఇహ సుఖాలపై మనస్సు విరిగింది. కొన్నాళ్ళపాటు ఏదో పరధ్యానంగా ఉండేవాడు. ఏదో చెప్పరాని దిగులుతో మథనపడుతున్నట్టుగా కనిపించేవాడు. ఆ తరువాత అంతిపా సంసారాన్ని పూర్తిగా త్యజించి అడవులకు వెళ్ళాడు. అక్కడ ఒక పర్వత ప్రాంతంలో ఒక చిన్న కుటీరం నిర్మించుకుని ఎనిమిది సంవత్సరాలపాటు దైవ ధ్యానం చేస్తూ ఆ కుటీరంలో నివసించాడు. ఆ కుటీరం కూడా తాను స్వయంగా కొమ్మలు కొట్టుకుని ఆకులు తెచ్చుకుని నిర్మించుకున్నాడు. ఈ ఎనిమిది సంవత్సరాలలోను, ఒక్క మనిషి పురుగునుకూడా తనవద్దకు రానిచ్చేవాడు కాదు, అతను ప్రాణ స్నేహితుడే కావచ్చు, ఆత్మబంధువే కావచ్చు. అప్పుడప్పుడూ అడవులగుండా

ప్రయాణం చేస్తున్న బాటసారులకుమటుకు అంతిపా కనిపించే వాడు. కుటీర ద్వారంలో మోకాళ్ళూని తదేకంగా దైవ ధ్యానంలో నిమగ్నుడై ఉండడం బాటసారులు చూచేవారు. అతన్ని ఆ పరిస్థితిలో చూస్తే ఎవరికైనా భయం కలుగుతుంది. అన్నం ముట్టకుండా అహర్నిశలూ తపోధ్యానంలో ఉండడం వల్ల మనిషి పూర్తిగా ఎండిపోయి కట్టెలాగా తయారైనాడు. ఎలుగు బంటిలా ఒంటినిండా జుట్టు పెరిగిపోయింది. తపో నిమగ్నుడై ఉన్న అంతిపా, మధ్యలో ఎప్పుడైనా కళ్ళు తెరిచి నప్పుడు దారివెంట వెడుతున్న బాటసారి కనిపించడం సంభ విస్తే మోకాళ్ళపైనుంచి లేచి ఒకమాటు ఆ బాటసారికి నమస్కరించేవాడు. దోవ చూపమని అడిగితే మారు మాటాడకుండా దోవ చూపేవాడు, అంతే. వెంటనే కుటీరం లోనికి వెళ్ళి కళ్ళు మూసుకుని ధ్యానంలో నిమగ్ను డయ్యేవాడు. ఈ ఎనిమిది సంవత్సరాలలోను అతన్ని ఎంత మందో చూచి ఉంటారు. కాని ఎవరితోనూ పల్లెత్తిమాటాడే వాడు కాదు. ఒకసారి అతని భార్యాబిడ్డలూ కూడా వెళ్ళి అతన్ని చూచి వచ్చారు. వారితో కూడా అతను పెదవివిప్పి ఒక్క మాటనయినా మాట్లాడలేదు. వారు తనకోసం తెచ్చిన పండ్లూ, ఫలహారాలూ బట్టలూ, పుచ్చుకుని వారిని సాగ నంపాడు.

అరణ్యంలోని మున్యాశ్రమాలన్నీ ధ్వంసం కావించ బడిన సంవత్సరంలోనే అంతిపా చనిపోయాడు. అతను చని పోయిన తీరు ఈ క్రింద వివరించిన రీతిగా ఉంది :

ఒక పోలీసు ఉద్యోగి తన కుటుంబంతో సహా ఒకసారి అరణ్యానికి వచ్చాడు. కుటీరంలో కూర్చుని ధ్యాన నిమగ్నుడై ఉన్న అంతిపాను చూచాడు.

"ఏయ్ ! నిన్నే బైటికిరా...! నీ కుటీరాన్ని కూల్చి వేయాలి !" అని పోలీసు ఉద్యోగి హుంకరించాడు. కాని అంతిపాకు మటుకు ఈ హుంకరింపు వినిపించలేదు.

పోలీసు ఉద్యోగి ఎన్ని పర్యాయాలు హుంకరించినా ధ్యానంలో విలీనుడై ఉన్న అంతిపా జవాబు చెప్పలేదు.

పోలీసు ఉద్యోగి భగ్గుమన్నాడు. అంతిపాను వెలుపలికి లాక్కురమ్మని తనభటులను ఆజ్ఞాపించాడు. తీవ్రధ్యానంలో నిమగ్నుడై ఉన్న అంతిపాను చూచి ఆ భటులు భయపడి పోయారు. అతన్ని బైటికి లాగితే అతని ఆధ్యాత్మికశక్తి తమను దహించి వేస్తుందేమోనని జంకి తమ ఉద్యోగి ఆజ్ఞను నిర్వ రించడానికి నిరాకరించారు. తరువాత కుటీరాన్ని కూల్చి వేయమని ఉద్యోగి ఆజ్ఞాపించాడు. వృద్ధుడికి ఎలాంటి అపా యమూ కలగకుండా కుటీరం కప్పును మాత్రం తీసివేయ డానికి భటులు సమకట్టారు.

పిచ్చికల గూళ్ళు అంతిపా తలమీద రాలిపడ్డాయి. దూలాలు పగిలి నేలపైపడ్డాయి. ఆ చప్పుడుకు అడవిలోని పక్షులు కలకల చప్పుడు చేస్తూ కొమ్మలమీంచి నుంచి లేచిపోయాయి. ఇదంతా తను విననట్టూ, కననట్టూ, తనకు తెలియనట్టూ వృద్ధుడు ప్రార్థన చేస్తూనే ఉన్నాడు. భటులు కుటీరం గోడలను కూల్చడం ప్రారంభించారు. కాని వృద్ధుడు మాత్రం చలించలేదు. నిశ్చలంగా ప్రార్థిస్తూనే ఉన్నాడు.

ఆఖరు దూలాన్ని కూడా కూల్చి కుటీరాన్ని సమూలంగా ధ్వంసం చేసిన తరువాత పోలీసుఉద్యోగి వృద్ధుని సమీపించి అతని చెయ్యి పుచ్చుకుని పట్టుకుని ఈడ్చాడు.

అందుకు కూడా అంతిపా మారుపలక లేదు. కళ్ళెత్తి ఆకాశం వంక చూచి, "భగవంతుడా! వీరిని క్షమించు" అని మాత్రం అన్నాడు. ఆ తరువాత నిలువునా నేలమీద కూలి ప్రాణం విడిచాడు. ఇదీ అతని మృత్యు గాథ.

ఈ సంఘటన జరిగినప్పుడు అంతిపా పెద్దబ్బాయి యాకోవ్‌కు ఇరవై మూడు సంవత్సరాల వయస్సు. చిన్న బ్బాయి తెరంతికి పద్దెనిమిది సంవత్సరాలవయస్సు. యాకోవ్ ఎంతో అందగాడు. చూడ ముచ్చటగా ఉండేవాడు. బలిష్టమైన శరీరం. చిన్న తనంలోనే యాకోవ్ పూలరంగడనే పేరు సంపాదించు కున్నాడు. అతని కన్నుపడని ఆడ పురుగు ఆ చుట్టుపట్ల ఎక్కడా లేదంటే అందులో అతిశయోక్తి ఏమీ లేదు. అంద రికీ అతను కంటగింపయిపోయాడు. అతనిపై చాడీలు చెప్పని వారంటూ లేరు. ఊరి పెద్దలు పొరుగిళ్ళవారు, ఆఖరుకు అతని తల్లితోసహా అతన్ని "ఛీ ఛీ" అనేవారు. అతని దుండ గాలను అరికట్టడం అందరికీ కష్టమైపోయింది. ఒకసారి అతన్ని ఖైదుచేశారు. మరోసారి నలుగురిలోకి పిలిపించి కొట్టించారు. కాని ఈ శిక్షలు అతనికి చీమకుట్టినట్లు కూడా లేవు. అతని ధోరణి ఎంత మాత్రం మారలేదు. పైగా రెచ్చిపోయాడు కూడా. ఇహ అతన్ని చూస్తే ఒక రాక్షసుణ్ణి చూచినట్లుగా ఉండేది ఆ గ్రామ ప్రజలకు.

చెయ్యరాని పనులన్నీ తు. చ. తప్పకుండా చెయ్యడంలో యాకోవ్ ఘటికుడు. పొగ తాగడం, సోడా పుచ్చుకోడం, విదేశీ తరహాలో బట్టలు తొడుక్కుని పూలరంగడులా వీధులవెంట విహారాలు చేయడం. దేవాలయానికి వెళ్ళకపోవడం–అతను అలవరచుకోని దురాచారం ఒక్కటీ లేదు. 'అబ్బాయ్! మీనాన్నగారి పేరు చెడగొడుతున్నా' వని ఎవరైనా పెద్దలు మందలించినప్పుడు అతను వారి మాటలను మన్నించకపోగా 'అబ్బో! మహా చెప్పొచ్చారు!!' అన్నట్టు నవ్వేవాడు.

“మీ సలహా బాగానే ఉంది. కాని పశ్చాత్తాపానికీ భజనలకూ సమయం ఇదికాదు. పాపం పండనివ్వండి. అప్పుడు నేనూ పశ్చాత్తాప పడతాను. మా నాన్నను పోలికచూపి నన్ను బెదిరించకండి. మా నాన్న యాభై ఏళ్ళు నల్లమాలిన పాపాలన్నీ చేసి ఆఖరుకు సురంచేరాడు. ఆయన పశ్చాత్తాపతో కాలంగడిపిందిఇంతకూ ఎనిమిది సంవత్సరాలేగా! యాభై సంవత్సరాలపాపాలకు ఎనిమిదిసంవత్సరాలతపస్సుప్రాయశ్చిత్తమవుతుందా? నా పాపాలుఇప్పుడిప్పుడేముదురుపాకంలోపడుతూ ఉన్నవి. పూర్తిగా ముదిరి పండనివ్వండి. అప్పుడు నేనూ ప్రాయశ్చిత్తం చేసుకుంటాను” అనేవాడు యాకోవ్.

'నట్టి వితండం మనిషి!' అనేవారు ఊరివాళ్ళంతా. అతనంటే భయపడేవారు. దూరంగా తొలగిపోయేవారు.

అంతిమా చనిపోయిన రెండు సంవత్సరాలకుయాకోవ్‌కు పెండ్లయింది. ఉన్న ఊళ్ళో అతనికి పిల్లనివ్వడానికి ఎవ్వరూ సమ్మతించలేదు. ముప్పయి ఏళ్ళు నానాయాతనలూ

పడి తండ్రి కూడబెట్టిన ధనాన్ని సంవత్సరం తిరగకముందే మటుమాయంచేసిన ఈ బద్ధాయికి పిల్లనివ్వడం ఎలాగా అని ఆడపిల్లను కన్న ప్రతి తండ్రీ సంశయించాడు. చివరకు ఎలాగయితేనేమి, తన తండ్రి తేనెపట్టు పెంచుతూ వచ్చిన తోటను అమ్మి ఆ డబ్బుతో పెళ్ళి ఖర్చులు గడిపి, దూర గ్రామంలోని ఒక అనాథబాలికను యాకోవ్ వివాహం చేసుకున్నాడు. అతని తమ్ముడు తెరంతి వట్టి అసమర్థుడు. పైగా బలహీనుడు. అందుచేత అన్నగారిమాటను కాదనే ధైర్యం అతనికి లేదు. ఇహ తల్లి చూదామా అంటే—ఆవిడ ఆరోగ్యవంతురాలుకాదు. పైగా వయస్సూ మళ్ళిపోయింది. ఎప్పుడూ ఒక కుక్కిమంచంలో పడుకుని మూలుగుతూ ఉంటుంది. ఎప్పుడైనా ఎవరైనా పొరుగిళ్ళ అమ్మలక్కలు వచ్చి, "మీ అబ్బాయి అలా చేశాడమ్మా, ఇలా చేశాడమ్మా" అని చాడీలు చెప్పినప్పుడు మటుకు కొడుకును కేకలేసుంది.

ఒక సంవత్సరంపాటు మాత్రం యాకోవ్ జీవితం మామూలు ధోరణిలో సాగిపోయింది. పెద్ద ఒడుదుడుకులేమీ లేవు. ఇంతకు పూర్వం అల్లరి చిల్లరిగా తిరుగుతూ వచ్చినవాడు ఇప్పుడు పనిచేయడంకూడా మొదలెట్టాడు. వేళపట్టున ఇంటికి వచ్చేవాడు. ఇలా కొన్నాళ్ళు జరిగాయి. కాని ఇంతలోనే ఏదో శక్తి లాగినట్టు అతను ఇల్లువిడిచి వెళ్ళిపోయేవాడు. తిరిగి తిరిగి చినుగుబట్టలతోను, మాసిన తలకట్టుతోనూ ఆకలితో ఆవురావురుమంటూ ఇంటికి తిరిగివచ్చేవాడు. కొన్నాళ్ళకు అతని తల్లికూడా చనిపోయింది. ఆవిడ కర్మాంతరాల సమయంలో యాకోవ్ తాగి పాతపగను త్రవ్వి

ఊరి పెద్దను కొట్టాడు. అందుకు అతనికి శిక్ష విధించబడింది. సైన్యంలో ఖైదీల గుంపులో కలిసి పనిచేయవలసి వచ్చింది. శిక్ష అనుభవించిన అతను తిరిగి వచ్చేసరికి అతనిరూపురేఖలు మనస్సు పూర్తిగా మారిపోయింది. గుండు కొట్టిన తల. కళ్ళలో కాంతి అసలేలేదు. మనస్సులో ఏదో తీరని పగ. గ్రామ ప్రజలకు ఈసారి అతనంటే మరింత ఏవగింపుకలిగింది. ఈ ఏవగింపు అతను ఒక్కనితోనే ఆగిపోలేదు. ఊరి యువకు లంతా కలిసి అతని తమ్ముడు గూని తెరంతిని గేలి పట్టించడం సాగించారు. యాకోవ్‌ను 'గజదొంగ' అని పిలిచేవారు. తెరంతిని 'ఒరేయ్! గూతయ్యా!' అని గేలిచేసేవారు. పాపం తెరంతి మారుపలికేవాడుకాదు. యాకోవ్ మటుకు 'చంపుతాన్రోయ్, జాగర్త' అని వారిని బెదిరించేవాడు.

యాకోవ్ నలభై య్యేవపడిలో పడ్డాడు. ఆ సంవత్సరమే ఆ గ్రామంలో ఎక్కడో నిప్పంటుకొని ఊరంతాతగలబడింది. ఈ భయంకర కృత్యానికి యాకోవే కారకుడని అతనికి సైబీరియాలో ప్రవాసశిక్ష విధించబడింది.

ఇంక ఇంటి బాధ్యతలన్నీ యాకోవ్ తమ్ముడు తెరంతి భుజాలపై పడ్డాయి. గ్రామం అగ్నిదాహానికి బలియైనప్పుడు యాకోవ్ భార్య పిచ్చిదైపోయింది. అతనికి ఒక కొడుకున్నాడు. వాడి పేరు ఇల్యా. ఇల్యాకు పదేళ్ళు. వాడు ఇల్లు దాటి బైటికివచ్చినప్పుడల్లా వాడి ఈడు కుర్రాళ్ళు వెంటపడి రాళ్ళు రువ్వి తరిమేవారు. 'ఒరేయ్ ఖైదీ కొడుకా' అని దూషించేవారు.

గ్రామం దహనం కావడానికి పూర్వం, తెరంతి కాయకష్టం చెయ్యలేనివాడు కనుక సూదుల్లూ, దారాలు, దువ్వెనల్లూ చిల్లర సామాన్లు అమ్ముకుని పొట్టపోసుకునేవాడు. ఊరంతా తగలబడినప్పుడు అతను దాచుకున్న సామాన్లు ఇల్లుకూడా తగలబడిపోయింది. చివరకు అతనికి మిగిలింది ఒక గుర్రము, నల్లభైమూడు నూబుళ్ళుమాత్రమే. ఈఊళ్ళోనే ఉండి ఈ కొద్దిపాటి ఆ స్తితో పొట్టపోసుకోడం అసాధ్యం. అంతే కాక ఊరివాళ్ళంతా తనకుటుంబంమీదకట్టుకట్టారు. అందుచేత ఊరు విడిచివెళ్ళి పొట్టపోసుకుందామని నిశ్చయించుకున్నాడు తెరంతి. వదినగారిబెడద వదిలించుకోడానికి ఆమెను పొరుగింట్లో జీతానికి కుదిర్చాడు. తను ఒక పాతబండిని కొనుక్కొని అన్నగారికొడుకును అందులో కూర్చుండబెట్టుకుని నగరానికి తరలివెళ్ళాడు. నగరంలో తెరంతికి ఒక దూరపు బంధువు ఉన్నాడు. అతనిపేరు పెట్రూపాక్. పెట్రూపాక్ ఒక హోటల్లో వెయిటర్‌గా పనిచేస్తూ ఉన్నాడు. అతన్ని ఆశ్రయించి నగరంలో ఏదో ఒక విధంగా జీవయాత్ర సాగిద్దామని ఆశించాడు తెరంతి. ఎప్పుడెప్పుడు ప్రొద్దుగూకుతుందా అని కాచుకుని కూచుని చీకటిపడగానే దొంగల్లాగా ఊరు విడిచి, ప్రయాణం కట్టాడు తెరంతి. బండితోలుకుని పోతూ మధ్య మధ్యలో బిక్కు బిక్కుమని వెనుతిరిగి చూచేవాడు. బండి మెల్లగా నత్తగుల్లలా సాగిపోతూ ఉంది. మధ్య మధ్యలో ఎగుడు దిగుడు డొంకదారి. ఇల్యామటుకు పసి వాడు. కాబట్టి బండిలో హాయిగా నిద్రపోతున్నాడు. సగం రాత్రి గడిచింది. హఠాత్తుగా తోడేలుకూత వంటి ఒకకూత విని

పించి ఇల్యా ఉలిక్కిపడి లేచి కూచున్నాడు. రాత్రి చల్లగా నిర్మలంగా ఉన్నది. ఆకాశంలో నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నాయి. బండి ఒక అడవి కొనకువచ్చి ఆగింది. గుర్రం ఇకిలించి పచ్చిక మేస్తూ నిల్చుంది. ఆ పచ్చిక బయళ్ళ మధ్యలో ఒక్క మర్రిమొటుకు దూరంగా తరిమివేసినట్టుగా ఒంటిగా ఉన్నది. ఇల్యా నిద్రలేచి తన బాబాయ్ ఎక్క డున్నాడా అని భయంతో వెదికాడు.

గుర్రపు గిట్టల చప్పుడూ, గాలి రొదా వినిపిస్తూ ఉన్నవి.

"బాబాయ్ !" పిలిచాడు ఇల్యా.

"ఊఁ" పలికాడు తెరంతి.

"ఎక్కడున్నావ్ ?"

"ఇక్కడే, భయంలేదు నిద్రపో !"

ఇల్యా చూచేసరికి తెరంతి ఒకచిన్న గుట్టమీంద కూచుని ఉన్నాడు.

"నాకు భయంగా ఉంది" అన్నాడు ఇల్యా.

"ఇక్కడెవరున్నారు? భయంలేదు. నిద్రపో" అన్నాడు తెరంతి.

"ఏదో కూత వినిపించింది."

"కలలే అది, నిద్రపో"

"కలకాదు నిజం !"

"ఎక్కడో దూరాన తోడేలు అయి ఉంటుంది. భయంలేదు పడుకో !"

ఇల్యాకు మటుకు నిద్రపట్టలేదు. ఆ కూత సూత్రం అతని చెవుల్లో గింగురుమంటూనే ఉన్నది. తన బాబాయ్ వంకే చూస్తూ కూచున్నాడు.

తెరంతి దూరంగా ఉన్న చర్చి గోపురాలవంక చూస్తున్నాడు. అయిదు గోపురాలుగల ఆ చర్చి అరణ్యాగర్భంలో దాగి దూరంగా కనిపిస్తూ ఉన్నది. చర్చి గోపురాల చాటున నిండు చంద్రుడు నిర్మలంగా ప్రకాశిస్తూ కనిపిస్తున్నాడు.

తన బాబాయ్ చూస్తూ ఉన్నది లోమ్ దానా పిస్కి చర్చి అని, ఆ చర్చికి దరిదాపుల్లోనే తన స్వగ్రామం ఉన్నదని ఇల్యాకు తెలుసు.

"మనం ఎంతో దూరం వచ్చినట్టులేదే!" అన్నాడు ఇల్యా.

"ఏమిటన్నావ్ ?" ప్రశ్నించాడు తెరంతి.

"మనం త్వరగా వెళ్ళడం మంచిది. ఎవరైనా కనిపించవచ్చు" అన్నాడు కుర్రవాడు.

"సరే" అన్నాడు తెరంతి.

తరువాత మళ్ళీ అంతా నిశ్శబ్దం. ఇల్యా బండిలో కూచుని తెరంతి చూచిన వైపే తదేకంగా చూడసాగాడు. అగాధమైన అడవిచెట్ల నీడలలో దాగిపోయి గ్రామం గుర్తించడానికి వీలులేకుండా ఉన్నది. కాని ఇల్యా మటుకు ఆ గ్రామం తన కళ్ళముందు కనిపిస్తున్నట్టే ఊహించుకున్నాడు. గుడిసెలు, గుడిసెల మధ్యన చెట్లు, ఊరిమధ్య బావి, ఊరిని కోసినట్టున్న కాలువ- అన్నీ అతని కళ్ళముందు బొమ్మల్లా కనిపించసాగాయి. ఊరిమధ్య చెట్టుక్రింద తనతండ్రి పడి

ఉన్నాడు. చినుగు చొక్కా - చేతులు కాళ్ళూ కట్టివేసి ఉన్నాయి. మృతకళేబరంలాగా అతను పడిఉన్నాడు. అతని చుట్టూ ఊరి పెద్దలంతా పోగై ఉన్నారు. అందరూ అతన్ని నానా విధాలుగా తిడుతూ ఉన్నారు. ఈ సంఘటన జ్ఞప్తికి రాగానే ఆ కుర్రవాడి గొంతులో ఏడుపు సుళ్ళుసుళ్ళుగా తిరిగి వచ్చింది. బిగ్గరగా ఏడవాలనుకున్నాడు. కాని బాబాయి ఎక్కడ వినిపోతాడో అని గొంతులోని ఏడుపును గొంతులోనే దిగమింగుకున్నాడు. హఠాత్తుగా మళ్ళీ కూత వినిపించడం ప్రారంభించింది.

"బాబాయి, అదిగో కూత!" అన్నాడు ఇల్యా.

ఈ మాటకు తెరంతి జవాబు చెప్పలేదు. ఇల్యా బాబాయిని కౌగలించుకుని భయంతో వెక్కి వెక్కి ఏడవసాగాడు. అలా ఏడ్చి ఏడ్చి అలసిపోయి నిద్రపోయాడు.

బండి పట్నం చేరేసరికి తెల్లవారింది. ఇల్యా కళ్ళు తెరిచి చూచాడు. బండి పట్నంవైపుకు పోతూ ఉన్నది. పట్నం ప్రక్కనే నది. నది ఒడ్డునే కొండ. కొండపైన పట్నం. ఆ ఇళ్ళు చిన్న చిన్న చుక్కల్లే చెదురు చెదురుగా కనిపిస్తున్నవి. కొంత కొంసకు చేరేసరికి ఇళ్ళన్నీ బారులుతీరి నదిలోకి తొంగి చూస్తున్నట్టుగా కనిపిస్తున్నాయి. ఇళ్ళ చూరులకంటె మిన్నగా చర్చిల గోపురాలు కనిపిస్తున్నవి. సూర్యుడు అప్పుడే ఉదయించాడు. వాలుగా పడుతున్న సూర్యకిరణాలు ఇండ్ల కిటికీల అద్దాలపైపడి ప్రతిఫలిస్తున్నవి.

"చూడు బాబాయ్! అదిగో పట్నం" అని కుర్రాడు తన్మయుడై తదేకంగా ఆ దృశ్యాన్నే చూడ

సాగాడు. కాని హఠాత్తుగా ఒక భావం అతని మనస్సులో ప్రవేశించి అతని ఆనందాన్ని భగ్నం చేసింది. పట్నం వచ్చాము సరే, బావుంది. కాని ఈ పట్నంలో తాము తల దాచుకోటం ఎక్కడ? మాసిన బట్టలతో బిచ్చగాళ్ళవలె కనిపిస్తున్న తననూ, తన బాబాయిని ఈ పట్నంలోని శ్రీమంతులు అడుగుపెట్టనిస్తారా? బంగారంతో పోత పోసినట్టుగా ఉన్న ఈ పట్నంలో తాము ఎలా బ్రతకడం? ఈ సందేహాలు ఆ పసివాని మనస్సును బాధించసాగాయి. పట్నంలోకి పేద వాళ్ళను రానివ్వని కారణం వల్లనే తమ బండి పట్నంలో ప్రవేశించకుండా నదీ తీరంలో ఆగి ఉన్నదని ఆ కుర్రాడు ఊహించసాగాడు. పట్నంలో ప్రవేశించడానికి అనుజ్ఞ తీసు కోడం కోసం తన బాబాయ్ పట్నంలోకి వెళ్ళాడని అను కున్నాడు. పట్నంలోకి వెళ్ళిన బాబాయ్ ఎప్పుడెప్పుడు తిరిగి వస్తాడా అని ఎదురుచూస్తూ బిక్కు బిక్కుమంటూ దిగాలు పడి కూచున్నాడు. తనబండి ప్రక్కనుంచే మరెన్నో బండ్లు వచ్చి పోతూ ఉన్నాయి. కొన్ని పాలబిందెలున్న బండ్లు, మరికొన్ని బంగాళాదుంపల బస్తాలు మోసుకుని పోతున్న బండ్లు, కొందరు రైతులు కుటుంబాలతో సహా బండ్లలో వెడుతున్నారు. వీరంతా ఇల్యాకు కొత్తగా కని పించారు. ఇలాటి వ్యక్తులను ఇల్యా ఇంతకుముందు ఎన్నడూ చూడలేదు. అంతా తెల్లగా ఉతికిన బట్టలు వేసుకున్నారు. వారు మాట్లాడుతూ ఉంటే ఉచ్చారణ ఎంతో స్పష్టంగా ఉన్నది. కాలికి చెప్పులు తొడగని వ్యక్తి ఒక్కడూ కని పించడంలేదు. ఒకరు మరొకరిని చూచి భయపడకపోవడం

మాట అలాఉంచి నమస్కారాలు కూడా చెయ్యకుండా ఠీవిగా దర్జాగా నడిచివెడుతున్నారు. వీరందరినీ చూచినప్పుడు ఇల్యాకు ఎంతో సంతోషం కలిగింది. తనూ వారిలాగానే చక్కగా ముస్తాబు చేసుకుని ఠీవిగా తిరిగేరోజు రాకపోదని అనుకున్నాడు. దూరంనించి తన బాబాయి తెరంతి రావడం కనిపించింది ఇల్యాకు. తెరంతి ముఖంలో చిరునవ్వు చిందుతూ ఉన్నది. హుషారుగా అడుగులు వేసుకుంటూవస్తూ ఉన్నాడు. దూరాన ఉండగానే చెయ్యిచాపి ఏదో వస్తువును చూపాడు.

"అమ్మయ్య! భగవంతుని దయవల్ల బ్రతికినట్టే- పెట్రూషాక కనిపించాడు. ఇదుగో- ఈ బిస్కట్లు తిను" అన్నాడు తెరంతి.

కుర్రాడు ఎంతో భయంతో ఆ బిస్కట్లను తీసుకుని పట్టు జేబులో దాచుకున్నాడు.

"పట్నంలోకి రానిస్తారా?" కుర్రాడు ఆతృతతో అడిగాడు.

"ఓ, రానివ్వకేం? పడవరాగానే అవతలి గట్టుకు వెడదాం" అన్నాడు తెరంతి.

"మనం కూడానా?"

"ఆ"

"మనల్ని రానివ్వరనుకున్నాను. పట్నంలో ఎక్కడా మన బస?"

"ఇంకా బస ఏర్పాటు కాలేదు."

"ఆ ఎర్రని బంగళాలో బసచేద్దామా?"

"అక్కడ సైనికు లుంటారు."

"పోనీ- ఆ పైన కనిపిస్తున్న పెద్ద బంగళాలోనో?"

"అంత ఎత్తు బంగళాలోనే!"

"ఎక్కడేసరి?"

"నడిశావ్ ! కోతివెధన."

పడవలో నది దాటి అవతలిగట్టు చేరాను. నగరం శొనన ఉన్న ఒక పెద్ద సత్రంలాంటి ఇంట్లో బసచేశాను. ఆ ఇల్లు ఒకపాడు పడిన పాత సత్రంలాగా కనుపిస్తూ ఉన్నది. కిటికీల తలుపులన్నీ ఊడి పోయాయి: తలుపు చెక్కలు కదిలిస్తే చాలు, ఊడి మీద పడేటట్లుగా ఉన్నాయి. అద్దాలు మాసి మన్నూదుమ్మూ కొట్టుకుని ఉన్నాయి. ఇంటి లాగానే ఇంటి యజమాని కూడా ముసలివాడు. వృద్ధాప్యం పైబడిన అతని కళ్ళుకూడా మాసిపోయిన కిటికీల అద్దాలవలె కని పిస్తున్నాయి. కర్ర పుచ్చుకుని వణుకుతూ నడుస్తున్నాడు.

ఆ ఇంట్లోఅడుగుపెట్టగానే ఇల్యా ఒక్కమాటు ఆ లోపలకువెళ్ళి నాలుగు మూలలూ కలయ చూచి వచ్చాడు. ఆ ఇంట్లో ఇన్ని కుటుంబాలు నివసించడం అతనికి ఎంతో ఆశ్చ ర్యంగా కనిపించింది. ఈ ఒక్క ఇంట్లో నివసిస్తున్నంతమంది జనం తన స్వగ్రామంలో కూడాలేదు. రకరకాల కుటుంబాలు, రకరకాల వ్యక్తులు ఈ ఇంట్లో కనిపిస్తారు. కొందరు తాగు బోతు స్త్రీలు దొడ్డి గుమ్మంవైపు భాగాల్లో నివసిస్తున్నారు.

సీర్లిలో ఒక స్త్రీ మరీ విచిత్రంగా కనిపిస్తూ ఉంది. ఈవిడను అందరూ 'మతీజా' అని పిలుస్తూ గేలిచేస్తూ ఉంటారు. రాక్షసిలా కనిపించే ఈ స్త్రీ తనవైపు చూచి నప్పుడల్లా ఇల్యా బెదరిపోయేవాడు. ఇక క్రింది అంతస్తులో

అనేక తరహాల కుటుంబాలు నివసిస్తున్నవి. 'పెర్ఫిష్కా' అనే పేరుగల మాదిగవాడు క్రింది అంతస్తులోనే ఉన్నాడు. వాడి భార్య జబ్బుమనిషి. ఏడు సంవత్సరాలు వయస్సుగల ఒక కూతురున్నది. ఎరమీంతాతకూడా క్రింది అంతస్తులోనే ఉన్నాడు. అతను రోడ్డుమీద పాతగుడ్డల పీలికలన్నీ ఏరుతూ ఉంటాడు. షాలోరాత్రోయా అనే పేరుగల భిక్షుక స్త్రీ-గయ్యాళిది- అక్కడే ఉంటున్నది. ఒక మూలన అహరహోలూ ఆరకుండా వెలిగే కంసాలి పొయ్యి. సావెల్ అనే వడ్రంగి సుత్తి కొడుతూ, పాటలు పాడుతూ ఉంటాడు. మధ్య మధ్యలో బంతిలా కనిపించే అతనిభార్య బైటికివచ్చి అతను పనిచేస్తున్నాడో లేదో అని తొంగిచూచిపోతూ ఉంటుంది. ఆవిడ ఎప్పుడూ నెత్తిమీద ఒక తెల్లని శాలువాను ముసుగుగా వేసుకుని ఉంటుంది. కిలకిలా నవ్వుతుంది. ఆవిడ నవ్వుల కిల కిల భర్త సుత్తి దెబ్బల చప్పుడుతో కలిసిపోతూ ఉంటుంది. ఒక్కొక్కసారి భర్త సింహంలాగా గర్జించి ఆవిడను గద్దిస్తూ ఉంటాడు.

ఈ ఇంట్లో పగలనీ రాత్రనీ లేదు. ఎప్పుడూ ఏదో ఒక సందడి. ఎవరో ఒకరు రావడం పోవడం జరుగుతూనే ఉంటుంది. సాయంత్రమయ్యేసరికి అందరూ గూళ్ళవంటి ఇళ్ళ నుంచి బయటికివచ్చి వసారాలో తిష్ట వేస్తారు. మరికొందరు గేటు ప్రక్కనే ఉన్న బెంచీమీద కూచుంటారు. పెర్ఫిష్కా గిటార్ మీటుతాడు. సావెల్ ఏదో ఒకటి సన్నని కూని రాగం తీస్తాడు. మతిజా, తాగి ఉన్నట్లయితే ఒక విషాద గీతాన్ని ఆలాపిస్తాడు. ఆ గీతంలోని మాటలేమిటో అతనికే

బోధపడవు. మరో మూలన, పిల్లలంతా ఎరమీూతాత చుట్టూ పోగై, 'తాతా! తాతా! మాకో కథ చెప్పవూ?' అంటూ తాత ప్రాణాలను తోడేస్తారు.

ఒక క్షణంపాటు తాత దీపశిఖల్లా వెలుగుతున్న ఎర్రని కండ్లతో ఆ పిల్లల వంక చూచి నెత్తిమీద టోపీని ఉంచుకుని వణుకుతున్న కంఠస్వరంతో కథ ప్రారంభిస్తాడు. కథ చెబుతూ ఉంటే అతని కండ్ల వెంట చింతగింజలంత కన్నీటి బిందువులు రాలుతూ ఉంటాయి.

"అనగా అనగా ఒక రాజ్యం. ఆ రాజ్యంలో ఒక కుర్రాడు. అతని పుట్టుపూర్వోత్తరాలు ఎవరికీ తెలీవు..." కథ సాగుతుంది.

కథ చెబుతూ ఉన్నప్పుడు తాతగడ్డం ఊగిసలాడుతుంది. కన్నీరు ధారాపాతంగా ప్రవహిస్తుంది.

"ఈ కుర్రాడు అల్లరి చిల్లరే కుర్రాడుగా తయారయ్యాడు. ఎవరన్నా భయంలేదు. ప్రభువైన ఏసునుకూడా ఈ కుర్రాడు నమ్మేవాడుకాడు. మేరీ మాతను సైతం కాదనే వాడు. ఇహ తల్లిదండ్రుల మాట అసలే వినడు."

తాత కథని చెబుతూఉంటే పిల్లలు చెవులు నిక్కించుకుని ఎంతో శ్రద్ధతో వినేవారు. పెట్రూకా కొడుకు యకోల్ అయితే మరింత శ్రద్ధగా వినేవాడు. యకోల్ కుబ్జవాడు. సన్నని ముక్కు. రెపరెపలాడుతూకనిపించే వాడు. వాడు పరుగెత్తుతూ ఉంటే, తల అటూ ఇటూ ఊగిసలాడేది. కళ్ళు పెద్దవి. ఆ కళ్ళలో ఎప్పుడూ ఏదో అశాంతి దాగి వుండేది. అతని చూపు ఎప్పుడూ ఒకచోట నిలిచేదికాదు. ఒక వస్తువు

పైవాలి ఇంతలోనే ఆ వస్తువును చూచి భయపడినట్టుగా మరలిపోయి మరో వస్తువుపై వాలేది. ఎప్పుడూ మడత మూయని చక్కని దుస్తులు ధరించేవాడు. కుర్రాళ్ళందరిలోనూ ఎంతో ప్రత్యేకంగా కనుపిస్తూ ఉన్న యాకొవ్‌తో ఇల్యా నేస్తం కలుపుకున్నాడు.

వారికి నేస్తం కలిసిన తొలిరోజున "మీ ఊళ్ళో మంత్రగాళ్ళు చాలామంది ఉన్నారు కదూ ?" అని యాకొవ్ ఇల్యాను ప్రశ్నించాడు.

"ఎంతోమంది లేరు. కొద్దిమందే ఉన్నారు. మా ఇంటి ప్రక్కనే ఒక మంత్రగాడు కాపురం ఉండేవాడు" అని జవాబు చెప్పాడు ఇల్యా.

ఆ ఇంటి ముందు ఖాళీ స్థలంలో ఒక నిమ్మచెట్టు నీడలో కూచుని ఆ కుర్రాళ్ళిద్దరూ పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ ఉన్నారు. ఆ ఇంటి మొత్తంలో మా అంత ముచ్చటైన స్థలం మరొకటిలేదు. ప్రశాంతమైన ఆ స్థలంలో ఇంటి రొదకూడా వినిపించదు. పైననిర్మలమైన ఆకాశమూ, ఇంటి కిటికీల అద్దాలు మినహా మరేం కనుపించవుకూడా. నిమ్మ చెట్టు కొమ్మలలో దాగిన పిచ్చుకలు కిచ కిచమంటున్నవి.నీడలో కూచున్న కుర్రాళ్ళిద్దరూ మెల్లగా, చల్లగా కబుర్లు చెప్పుకుంటూ ఉన్నారు.

ఆ ఇంటిలో నివసించడం ప్రారంభించిన మొదటిరోజులలో ఇల్యాకు అంతా చీకాకుగాను, చీదరగాను కనుపించేది. చెవులు దిబ్బళ్ళు పడిపోయేటట్లుగా ఇల్లంతా ఒకటే రొద. అతనికి ఈ మహా సముద్రంనుంచి ఎలా బయట పడాలో

దిక్కుతోచేది కాదు. తెరంతి నీటి తొట్టెలో గుడ్డలు ఉతుకుతూ ఉండగా, ఇల్యూ తొట్టె ప్రక్కనే నిల్చుని వచ్చిపోయే జనాన్ని పరిశీలిస్తూ గంటలకొద్దీ కాలం గడిపేవాడు.

తినేవారు, తాగేవారు, పాడేవారు, కేకలు వేసేవారు, ఇలా రకరకాలుగా జనం వస్తూ పోతూ ఉండేవారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ దృశ్యాన్ని చూచినప్పుడు పిచ్చి వాళ్ళ ఆస్పత్రి జ్ఞాపకం వచ్చేది.

వచ్చేపోయే జనాన్ని వెర్రిగా పరికిస్తూ నిల్చున్న ఇల్యూను, "ఏమిట్రా! అలా వెర్రి మొహం వేసుకుని చూస్తూ నిల్చుంటావు? వెళ్ళు!" అని గద్దించేవాడు పినతండ్రి.

ఇల్యూ సణుక్కుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయేవాడు. ఒక మూలన పావెల్ తన దగ్గర వడ్రంగి పని నేర్చుకుంటూ ఉన్న కుర్రవాణ్ణి చివాట్లు వేయడం, మరో మూల కిటికీవద్ద చెప్పులు కుట్టే పెర్ఫిష్కా హుషారుగా పాట పాడుతూ ఉండడం, మరోప్రక్క తాగిన స్త్రీలు ఒకరిని ఒకరు తూలనాడుకొనడం– నానా శబ్దాలు అతని చెవుల్లో దూరేవి. వడ్రంగి కొడుకు పావెల్ మరెవరినో కేకలు వేస్తున్నాడు.

పావెల్ అల్లరి కుర్రాడు. అంత అల్లరి కుర్రాడు ఆ ఇంటి మొత్తంలో ఎవరూ లేరు. చిరుగు చొక్కా, కుదించిఉన్న నుదురు– చిత్రంగా కనుపిస్తాడు పావెల్. ఇల్యూను ఇప్పటికి రెండుసార్లు బాగా ఉతికాడు కూడా. ఇల్యూ పరుగెత్తుకుంటూ తెరంతి వద్దకు వెళ్ళి, "చూడు బాబాయ్! ఎలా కొట్టాడో" అని చెప్పి ఏడవసాగాడు.

"అనుభవించు వెధవా!" అన్నాడు తెరంతి.

"చూడు ఏం చేస్తానో- వాణ్ణి చంపేస్తాను" అన్నాడు ఇల్యా.

"ఆ పనిచెయ్యకు. జాగ్రత్తగా సంచరించుకో" అని హెచ్చరించాడు పినతండ్రి.

"మరి వాడు కొట్టవచ్చా ఏం?"—

"అవును, వాడు ఇక్కడ ఉండేవాడు. నీవు పరదేశం వాడివి."

ఇల్యా అంతటితో వదిలిపెట్టలేదు. ప్రతిరోజూ పావెల్‌ను చంపుతానని, కొడతానని అంటూ ఉండేవాడు. తెరంతికి కోపం వచ్చి తల వాచేట్లు చివాట్లువేశాడు. పట్నం కుర్రాళ్ళతో తాను సాటివాడుగా భావించి ప్రవర్తించుకొనడం మంచిది కాదని హెచ్చరించాడు.

యాకొవ్‌తో మటుకు ఇల్యా స్నేహం నానాటికి గాఢతరమవుతూ ఉన్నది.

యాకొవ్ నీతి నిజాయితీకల కుర్రాడు. తొణకడు. పల్లెత్తి మాట అనడు. తను ఒకరిచేత మాట అనిపించుకోడు. ఉన్నవారి పిల్లలు తోటల్లోను, రోడ్లల్లోను ఆడుకునే ఆటలంటే తనకు ఎంతో ఇష్టమైనప్పటికీ తాను వెళ్ళి ఆ ఆటలలో పాల్గొనడు. యాకొవ్‌కు మరో స్నేహితురాలు ఉన్నది. ఆ అమ్మాయి పేరు మాషా. చెప్పులు కుట్టే పెర్ఫిష్కా కుమార్తె. ఆ అమ్మాయి సన్నగా, రెబ్బలాగా ఉంటుంది వంకుల జుట్టు: రాత్రీ పగలూ ఇంటి ముందున్న ఖాళీ స్థలంలోనే ఆడుతూ, పాడుతూ తిరుగుతూ ఉంటుంది. ఆ పిల్ల తల్లి కూడా ఎప్పుడూ గడపలోనే కూచుని కూతురు ఆట పాటలను

చూస్తూ ఉంటుంది. లేకపోతే తలవంచుకుని ఎప్పుడూ ఏదో ఒక పమూలు కుట్టుకుంటూ కూచుంటుంది. పొడుగరి, ఒత్తయిన జుట్టు. తన కూతురి ఆట పాటలను చూడడానికి ఆవిడ ఒకమాటు ముఖాన్ని పైకెత్తినప్పుడు ఇల్యా ఆమె ముఖాన్ని చూచాడు. నిశ్చలంగా మృతకళేబరం వదనంలా ఉన్నది ఆవిడ ముఖం. ఆవిడ కళ్ళుకూడా అలాగే నిశ్చలంగా ఉన్నాయి. ఆవిడ ఎన్నడూ ఎవరితోనూ మాట్లాడి ఎరుగదు. కూతురిని పిలవాలన్నా సైగలతోనే పిలుస్తుంది. ఎప్పుడో ఒకమాటు సమృత్తుగా, "ఒసేయ్ మాషా" అని గద్దిస్తుంది.

మొదట్లో ఆవిడంటే ఇల్యాకు ఇష్టం కలిగింది. కానీ, రెండు సంవత్సరాలనుంచీ ఆవిడ నడవలేకుండా ఉన్నదని కొద్ది రోజుల్లోనే ఆరోగ్యం పూర్తిగా క్షీణించి చనిపోతుందని తెలిసిన తరువాత ఆవిడను చూడాలంటే భయం కలిగేది.

ఒకరోజున ఇల్యా ఆ తోవనే వెడుతున్నప్పుడు ఆవిడ అతన్ని రెక్కపుచ్చుకుని దగ్గరకు లాక్కుని "మా అమ్మాయిమాషాని సరిగాచూడు బాబూ!" అన్నది దీన స్వరంతో. ఇలా అన్నప్పుడు గుండెలలో రొప్పు కలగడంవల్ల ఆవిడ వాక్యాన్ని ఒక్కమాటుగ పూర్తిచేయలేకపోయింది. ఆ రోజునుంచీ ఇల్యా, యాకొవ్, మాషా విషయంలో ఎంతో శ్రద్ధవహిస్తూ వచ్చారు. మాషా ఒంటిమీద ఈగను కూడా వాలనిచ్చే వారుకాదు. ఇల్యాకు విచిత్రంగా కనిపించిన దేమిటంటే వయస్సుమీరిన ఒకవ్యక్తి వచ్చి, 'ఈ సాయం చేసిపెట్టు బాబూ!' అని తనలాటి కుర్రాణ్ణి అర్థించడం. సాధారణంగా పెద్దలు పిన్నలను కొట్టడం, తిట్టడం అతను

చూశాడు కానీ, ఇలా పెద్దలే వచ్చి పిన్నలను సాయంకోసం అతనెప్పుడూ చూడలేదు.

మాకర్ తన టీ కొట్టు కడుగుతూ ఉన్నప్పుడు అటు వైపు ఎవరైనా కుర్రాళ్ళు వెడితే వాళ్ళను కొట్టి వాళ్ళ ముఖాన నీళ్ళుపోసేవాడు. వడ్రంగి పావెల్ కొట్లోకి ఎవరైనా కుర్రాళ్ళు తొంగిచూస్తే చాలు, పావెల్ వాళ్ళ ముఖాలపై బొగ్గులు విసిరివేసేవాడు. కిటికీముందున్న దీపం ఆర్పివేయడానికి యత్నిస్తే పెత్రోషా చేతికి ఏది దొరికితే దాన్ని పుచ్చుకుని విసిరివేసేవాడు. మరికొందరు పెద్దలయితే అకారణంగానే పిల్లల్ని కొట్టేవారు, కాని ఎరమీతాతమాత్రం పిల్లలమీద ఎన్నడూ చెయ్యిచేసుకునేవాడు కాదు.

పట్నం వచ్చిన కొద్దిరోజులకే ఇల్యాకు పట్నజీవితం మీద విరక్తి కలిగింది. పట్నజీవితంకంటె తన పల్లెలో జీవితమే సుఖంగా ఉన్నట్లు అనిపించింది. పల్లెలో హాయిగా ఇష్టం వచ్చినట్టు తిరగొచ్చు. అడిగేవారు ఎవరూ ఉండరు. ఇక్కడ గడపదాటడానికి వీలులేదు. ఇల్లు దాటితే బాబాయ్ కోప్పడతాడు. పల్లెలో వాతావరణం ప్రశాంతంగాఉంటుంది. ఈ చప్పుడూ, ఈ సందడీ ఉండదు. ఎటు చూచినా కానలసి సంత బయలు. అంతేకాదు, పల్లీయులు చేసే ప్రతిపనీ ఇల్యాకు తెలుసు. కానీ ఇక్కడ పట్నంలో ప్రతివ్యక్తి తనకు తోచిన పని దేన్నయినా చేస్తాడు. భత్యాలకోసం ఇతరులమీద ఆధారపడతాడు. అవీ సరిగాగిట్టవు. సగం కడుపుకే తిని ఎలాగో ఒకలా జీవయాత్ర సాగిస్తాడు.

ఒకసారి భోజనాల సందర్భంలో తెరంతి దీర్ఘంగా నిశ్వసించి,'ఒకేయ్ అబ్బాయ్! శిశిరందగ్గరకువస్తూ ఉందిరా!' అన్నాడు. ఇలా అని తింటున్నవాడల్లా కాసేపాగి పళ్ళెంవంకనే తదేకంగా చూస్తూ ఉండిపోయాడు. బాబాయ్ ఇలా అనేసరికి కుర్రాడుకూడా ఆలోచనలో పడిపోతాడు. "నువ్వా యాకొవ్‌తో పాటు బడికి వెళ్ళడం మంచి దంటున్నాడు పెట్రూషా. ఏమైనాసరే నీవు బడికివెళ్ళి తీరాల్సిందే, కళ్ళు లేకపోతే ఎలాగో, చదువు లేకపోయినా అంతే. కాని నువ్వు బడికి వెళ్ళాలంటే చెప్పులు అవసరం – ఎలా మరి?"– అని తెరంతి ఒక్కమాటు దీర్ఘంగా నిట్టూర్చాడు. బాబాయ్ అలా దిగాలుపడి కూచునేసరికి కుర్రాడి గుండెల్లో బాకుపెట్టి పొడిచినట్లనిపించింది.

"పోనీలే బాబాయ్ ! ఇక్కడనుంచి వెళ్ళిపోదాం" అన్నాడు కుర్రాడు.

"ఎక్కడికి ?" అడిగాడు తెరంతి.

"అడవులకు !" అన్నాడు ఇల్యా ఉత్సాహంతో.

"చూడు, నువ్వేకదూ నాకు చెప్పావు– తాతయ్య సంవత్సరాల తరబడి అడవుల్లో ఉన్నాడని ఒక్క తాతయ్యే ఒంటిగా అరణ్యాలలో బ్రతక గలిగినప్పుడు మనం బ్రతకలేక పోతామా ? హాయిగా చెట్ల ఆకులనుకోసి గుడిసె వేసుకుందాం. కందమూలాలను, ఫలాలను తిందాం. నక్కలనూ ఉడతలనూ చంపి వండుకోవచ్చు. నీ దగ్గర ఒక తుపాకి ఉంటే చాలు. నేను ఎర వేస్తాను. నాకు పిట్టలను పట్టడంకూడా చాతొచ్చుగా !" అన్నాడు కుర్రాడు.

కుర్రాడి అమాయకత్వానికి తెరంతి హృదయం ద్రవించిపోయింది. కుర్రాడివంక జాలిగా అనురాగంతో చూచాడు.

"ఇన్ని చెప్పావు కానీ. తోడేళ్ళను, ఎలుగుబంట్లనూ వదిలేశావేం ?" అన్నాడు చమత్కారంగా.

"నీ దగ్గర ఒక్క తుపాకి ఉంటే చాలు. అడివి జంతువుల్ని చూచినా నాకు భయంలేదు. బాబాయ్ ! నేను కుర్రాణ్ణయినా నాకు అనుభవంవల్ల తెలుస్తూనే ఉంది. ఇక్కడి జీవితం నాకు ఎంత మాత్రం బాగా లేదు" అన్నాడు ఇల్యా.

"ఏడిశావ్ !" అని ఊరుకున్నాడు తెరంతి.

ఆ సాయంత్రం ఇల్యా ఇంటిముందు వసారాలో కాసేపు ఆడుకుని అలసిపోయి లోపలికివచ్చి బాబాయి ప్రక్కనే కూచున్నాడు. బాబాయి తెరంతి, ఎరమీ తాతా కలిసి టీ పుచ్చుకుంటూ ఉన్నారు. ఇల్యా కాసేపు బాబాయ్ ప్రక్కనే కూచుని కునికిపాట్లుపడి నిద్రపోయాడు. వాడు కొంచెం నిద్రమత్తులో ఉండగా ఎరమీ తాత, బాబాయ్ తెరంతి ఇలా మాట్లాడుకోడం అతనికి వినిపించింది.

"చూశావబ్బాయ్ ! అసలు ముఖ్యమైన విషయం భగవంతుని సేవ. ఇతర విషయాలన్నీ అంత ముఖ్యంకావు. మనమంతా కూడా ఆ భగవంతునికి సేవకులమే. పురాణ గ్రంథాలలో కూడా ఈ విషయాన్నే వ్రాశారు. భగవంతుడు మన కష్టాలు చూస్తూ కండ్లు మూసుకుని ఊరుకునేవాడు కాడు. ఆయన ఎంతో దయామయుడు. ఒకనాటికి కాకపోతే

ఒకనాటికైనా ఆయనకు మనమీద దయకలుగకపోదు. అప్పుడు ఆయన ఏం చేస్తాడో తెలుసా? తన దూతను పిలిచి 'ఓ దేవదూతా! నీవు భూలోకంలోకి వెళ్ళు. అక్కడ నా భక్తుడైన తెరంతి అనే వ్యక్తి ఎన్నో కష్టాలు పడుతూఉన్నాడు. నీవు వెళ్ళి అతన్ని కష్టాలనుంచి ఆదుకో' అని ఆజ్ఞాపిస్తాడు' అని ఎరమీా తాత తెరంతికి ఈశ్వర తత్వాన్ని ఉపదేశిస్తూ ఉన్నాడు.

"తాతా! నేనూ ఈశ్వరుణ్ణే నమ్ముకునిఉన్నాను. ఆయన కటాక్ష వీక్షణ ఏనాటికైనా మనపై ప్రసరించకపోతుందా అని ఎదురు చూస్తున్నాను. అంతకన్న మనం మానవులం చెయ్యగలిగింది మాత్రం ఏముంది?" అన్నాడు తెరంతి.

"అబ్బాయి ఇల్యాను బళ్ళో వేయడానికి కావలసిన డబ్బును ఎలాగో ఒకలా సేకరించి నేను నీ కిస్తాను. నీవేం బెంగ పెట్టుకోకు. నీవు బాగా డబ్బు గడించి ధనవంతుడవైన తరువాత తిరిగి నాకు ఆ డబ్బు ఇచ్చేద్దువుగాని" అన్నాడు తాత.

"తాతా! ఇదేమిటి?" అన్నాడు తెరంతి ఆశ్చర్యంతో.

"మరేం మాట్లాడకు. ప్రస్తుతానికి ఆ కుర్రాణ్ణి నా దగ్గర వదిలిపెట్టు. ఇది అతను ఉండవలసిన చోటుకాదు. నాకు ఈ వయస్సులో సహాయంగా కూడా ఉంటాడు" అన్నాడు తాత.

"భగవంతుడు నీ ఔదార్యానికి ఇంత కింతలు సాయం చేస్తాడుగాక!" అన్నాడు తెరంతి.

"భగవంతుడు నాకు సహాయం చేస్తాడు. నేను నీకు సాయం చేస్తాను. నీవు కుర్రాడికి సాయంచేస్తావు. ఈ చక్రం ఇలాగే తిరుగుతూ ఉంటుంది. కానీ ఇందులో ఎవరూ ఎవరికీ ఋణపడినవారు లేరబ్బాయ్! అన్నిటికీ కర్త ఆ భగవంతుడే!" అన్నాడు వృద్ధుడు. ఇల్యా వారిమాటలు వింటూ తూగి నిద్ర పోయాడు.

మరుసటిరోజు ఉదయాన్నే ఎరమీతాత ఇల్యాను నిద్రలేపాడు.

"అబ్బాయ్! నాతోరా" అన్నాడు. ఆనాటినుంచీ ఇల్యా ప్రతిరోజూ ఎరమీతాతతో కలిసి పట్నంలోకి వెళ్ళడం సాగించాడు. ఇరువురూ కలిసి పట్నంలోకివెళ్ళి పాత గుడ్డలను, పోగులను, బొమికలను, చెత్తకాగితాలను, ఇనప ముక్కలను, తోలుముక్కలను ఏరి పోగుచేసేవారు. మొదటి కొద్దిరోజులూ ఇల్యాకు పట్నం ఎంతో విచిత్రంగా కనిపించేది. ఇళ్ళనూ, ఇళ్ళల్లో కనిపించే వ్యక్తులను చూస్తూ వీధుల వెంట నడిచేవాడు. తాతను ఎన్నెన్నో విచిత్రమైన ప్రశ్నలు అడిగేవాడు. ఎరమీతాతకూడా మాటకారి. ఇల్యాకు ఎన్నో విషయాలను, విశేషాలను చెప్పేవాడు. ఫలానా ఇల్లు ఫలానా వారిదని, ఆ ఇంటి యజమాని ఫలానా వర్తకుడని, చాలా ఉన్నవాడని- ఇలా ఎన్నో కొత్త విషయాలను తాత ఇల్యాకు ఎరుకపరిచాడు.

"తాతా! వీరంతా ఇంత శ్రీమంతులు ఎలా అయ్యారు?" అని ప్రశ్నించాడు ఇల్యా.

"శ్రీమంతులు ఎలా అయ్యారంటావా ? చెమటోడ్చి అహర్నిశలూ విరామం లేకుండా పనిచేసి వీరంతా శ్రీమంతులయ్యారు. ఇలా పనిచేసి డబ్బు కూడబెడతారు. కూడబెట్టిన డబ్బుతో ఇళ్ళూ వాకిళ్ళూ కొంటారు. ఇళ్ళకు కావలసిన సామాన్లు, సామగ్రీ, అలంకారాలుకొంటారు. ఇళ్ళల్లో కావలసినంతమంది పనివాళ్ళను పెట్టుకుని అవసరమైన పనులన్నీ చేయించుకుంటారు. తాము హాయిగా విశ్రాంతి పుచ్చుకుంటారు. దీన్నే బాబూ, 'కష్టే ఫలీ' అంటారు పెద్దలు. కానీ అందరూ ఇలా కష్టించి ఆర్జించరు. కొందరు పీసమెత్తుకూడా పని చెయ్యకుండా అన్యాయంగా ఆర్జించిన సొత్తుతో ధనవంతులవుతారు. ఉదాహరణకు చెబుతాను. ఫెలిక్స్ అనే నర్తకుడు చిన్నతనంలో ఎవరినో హత్యచేసి డబ్బు గడించాడని అంటారు. ఇందులో నిజమెంతో, అబద్ధమెంతో ఎవరికీ తెలీదు. కానీ అందరూ అనుకునేమాట మాత్రం ఇది. ఫెలిక్స్ కూడా వట్టి కటికగుండె మనిషి. చూడు, ఎప్పుడూ బెదురు చూపులు చూస్తూ ఉంటాడు. ఇలాకూడా ఒక్కోసారి జరుగుతూ ఉంటుంది. ఏముంది బాబూ-జీవితంలో కలిసిరావాలి, అంతే! భగవంతుడు చల్లటిచూపు చూడాలి. మన చేతుల్లో ఏముంది? అంతా ఆ భగవద్విలాసం! రైతు పొలంలో విత్తనాలు చల్లి ఎలా ఎదుగుతాయో చూచినట్టు, భగవంతుడూ మనల్ని ఈ లోకంలో సృష్టిస్తాడు. ఏ ఏ తీరుల్లో మన కర్మలు పరిపాకం చెందుతూ ఉంటాయో, ఆయన పైన కూచుని వీక్షిస్తూ ఉంటాడు.

నిజంబాబూ! నేను చెబుతున్నది అక్షరాలా నిజం! అనుభవం నేర్పిన విద్య ఇది. చూడు- ఆ మేడ యజమాని పాన్‌లోవిచ్. అతను షెలిన్ కంటెకూడా గొప్ప శ్రీమంతుడు. కానీవాడికి హృదయం ఉన్నదంటావా ? ఛీ, ఛీ! అంతటి రాక్షసుడు ఈభూప్రపంచంలో లేడంటే నమ్ము- అతనుఇంతకు పూర్వం మా ఊళ్ళో గ్రామపెద్దగా ఉండేవాడు. అప్పుడు ఆ ఊళ్ళో ఎన్ని దోపిడీలు, దొంగతనాలు చేయించాడో ఆ భగవంతునికే తెలియాలి ! ఇహ మమ్మల్ని మాటుకు బ్రతకనిచ్చాడా ? పీల్చి పిప్పిచేశాడు. దేవుడు ఇవన్నీ కనిపెడుతూనే ఉన్నాడు. కానీ సమయం రావద్దూ? చివరకు మిట్రీ పాన్‌లోవిచ్ పాపం పండింది. వరుసనే కష్టాలు వచ్చాయి. అతను చెవిటివాడయ్యాడు. అతని కొడుకు గుర్రాల బండీక్రింద పడి చనిపోయాడు. ఇలా జరిగిన కొద్దిరోజులకే కూతురు లేచిపోయింది.”

ముసలాడు చెబుతున్న కథవింటూ ఇల్యా ఆ మేడను పరిశీలించసాగాడు.

“ఒక్కసారి ఆ మేడలోపలికి వెళ్ళి చూడవచ్చా?” అని అడిగాడు ఇల్యా.

“ఆ రోజులూ వస్తాయి. ముందు నీవు గట్టిగా చదువుకోవాలి. పెరిగి పెద్దయ్యాక ఎన్ని మేడలైనా చూడవచ్చు. నీవూ ఒకపెద్ద శ్రీమంతుడివై పోవచ్చు. చూచావు బాబూ, ఈ లోకాన్ని నీ అంతప్పటినుంచీ నేను చూస్తూ ఉన్నాను. ఈ లోకాన్ని చూచి చూచి నా కళ్ళు కాయలు కాచిపోయాయి. ఎప్పుడు ఏది తలుపుకువచ్చినా కన్నీరు ధారలుగా

కారిపోతాయి. నా మనసులోని బాధలూ, గాథలూ అన్నీ ఈ కన్నీటితోనే ప్రవహిస్తాయి" అన్నాడు తాత.

తాత భగవంతుని గురించి చెప్పిన మాటలు ఇల్యాకు ఎంతో ముచ్చటగా కనిపించాయి. తాత భగవంతుణ్ణి గురించి మాట్లాడుతూ ఉంటే నిజంగా భగవంతుడు ఉన్నాడనే అని పిస్తుంది. భవిష్యత్తుమీద ఆశ కలుగుతుంది. తాత చెత్త గుట్టలను వెదుకుతూ ఉంటే ఇల్యా ఆతృతగా వెదుకుతూ తాతకు సాయంచేస్తాడు. చెత్త గుట్టల్లో విలువైన వస్తువు ఏదైనా దొరికినప్పుడు తాత కండ్లు ఇంతింత అయ్యేవి. ఒక రోజున ఇల్యాకు ఒక పెద్ద వెండి చెంచా దొరికింది. తాత ఎంతో సంతోషించి ఇల్యాకు పిప్పరమెంట్లు కొని బహుమతిగా ఇచ్చాడు. మరోసారి ఒక పర్సు దొరికింది. పర్సులో ఒక రూబుల్ నాణెంకూడా ఉంది. ఒక్కొక్కసారి కత్తులూ, స్పూన్లు, ఫోర్కులూ కూడా దొరుకుతూ ఉండేవి. మరో సారి కంచుతో చేసిన కొవ్వొత్తుల దీప స్తంభం దొరికింది. విలువైన వస్తువును ఇల్యా వెలుపలికి తీసినప్పుడల్లా తాత సంతోషంతో అతనికి బహుమతులను ఇచ్చేవాడు.

'చూశావా తాతా, ఏం దొరికిందో!' అనేవాడు ఇల్యా.

'అరవకబ్బాయ్! ఎవరైనా వినిపోతారు' అనేవాడు తాత.

చెత్త గుట్టల్లో ఏదైనా విలువైన వస్తువు దొరికినప్పు డల్లా తాతకి భయం వేసేది...ఇల్యా చేతినుంచి దాన్ని

లాక్కుని ఎవరైనా చూచి పోతారేమోనని భద్రంగా పాతాళం లాంటి తన సంచీలో దాచేసేవాడు.

"బాబూ! ఏ విషయాన్నైనా పైకి చెప్పుకుంటే జనం బ్రతకనిస్తార్రా? అన్నీ దాచుకోవాలి బాబూ! ఈ ప్రపంచంలో అన్నీ దాచుకోవాలి' అనేవాడు తాత. ఇలా అంటూ ఉంటే అతని కండ్లవెంట కన్నీరు ధారాపాతంగా స్రవించేది.

ఇల్యాకు కూడా తాత ఒక చిన్న సంచీ ఇచ్చాడు. చెత్త గుట్టను పెళ్ళగించడానికి ఒక ఇనప గునపాన్ని కూడా ఇచ్చాడు. తన వృత్తికి ఆధారాలయిన ఈ వస్తువులను చూచుకుని ఇల్యా మురిసిపోయేవాడు. చిన్న చిన్న పెట్టెముక్కలు, పగిలిన బొమ్మలు, కుండపెంకులూ, పారేసిన పింగాణీ గిన్నెలు పోగుచేసుకుని వాటిని తన సంచీలో వేసుకుని వెళ్ళేవాడు. అప్పుడు తన సంచీలో ఈ వస్తువులు గలగలలాడిచప్పుడు చేస్తూ ఉంటే అతనికి ఎంతో సంతోషం కలిగేది.

'అవీ, ఇవీ ఏరుకుని వచ్చి, వాటిని పిల్లలకు ఇవ్వరా బాబూ! వాళ్ళు సంతోషిస్తారు. ఒకరిని సంతోష పెట్టడం కంటె గొప్ప పని మరొకటి ఏమీలేదు. భగవంతుని ఇచ్ఛ కూడా ఇదే! సంతోషాన్ని కోరనివారు మానవుల్లో ఎవరూ ఉండరు.' అనేవాడు తాత. ప్రతి ఇంటిముందూ చెత్తగుట్టను ఎంతో శ్రద్ధతో కలయబెట్టి వస్తువులను పైకి తీసేవాడు ఇల్యా.

రెండు మూడు గంటలతరువాత ఎరమీతాత, 'ఇక చాల్లే ఇల్యా! కాసేపు విశ్రాంతి తీసుకుందాం' అనేవాడు.

ఇలా అని జేబులోనుంచి ఒక రొట్టెను తీసి ఒకముక్క విరిచి ఇల్యాకు ఇచ్చేవాడు. ఇద్దరూ రొట్టెముక్క నమిలి కాసేపు విశ్రాంతి పుచ్చుకున్న తరువాత, నది ఒడ్డు చేరేవరకూ పాత చెత్తగుట్టలను వెదుకుతూ వెళ్ళేవారు. మెల్లగా ప్రవహించేనది, కొబ్బరిపాలలాగా తళ తళలాడే నీళ్ళనిచూస్తూంటే ఇల్యాకు నీటిపై తేలిపోవాలనిపించేది. నదికి ఆవలిగట్టు విశాలంగావున్న పచ్చిక బయళ్ళు - బయళ్ళ మధ్య గోపురాల వలె ఉన్న గడ్డివాములు కనిపించేవి. బయళ్ళ కావల దిక్చక్ర రేఖను అడ్డుతూ అడవి గోడ పెట్టినట్టుగా ఉండేది. పచ్చిక బయళ్ళు ప్రశాంతంగా నిద్రపోతున్న పసిపాపల్లాగ కనిపించేవి. అక్కడి గాలి ఎంతో స్వచ్ఛంగాను, నిర్మలంగాను, పరిమళ భరితంగాను ఉండేది.

ఇల్యా వెల్లకిలా పడుకుని వినీలాకాశంవైపు తదేకంగా చూస్తూ ఊహించసాగాడు. అతని మనస్సును ఏదో అవ్యక్తమైన దిగులు కమ్ముకున్నది. ఏవేవో అస్పష్ట దృశ్యాలు అతని నేత్రాలముందు దోబూచులాడసాగాయి. వినీలమైన ఆ ఆకాశం చాటున ఎవరో మహా గంభీరుడైన ఒకవ్యక్తి దాగి ఉన్నాడనిపించింది. ఆ వ్యక్తి అంతటి మహా గంభీరుడైనా ఎంతో దయామయుడుకూడా. ఆ మహావ్యక్తి అనంతమైన తేజః ప్రవాహాన్ని ధరిత్రిపై ప్రసరింపచేస్తున్నట్లు తోచింది. తనూ, ఎరమీాతాత, ప్రపంచం యావత్తూ ఆ మహావ్యక్తి సాన్నిధ్యానికి ప్రయాణం చేస్తున్నట్లు అనిపించింది. ఈ ఊహలు ఇల్యాను ఒక తీయని తన్మయీభావంలో ముంచివేశాయి.

ఆ సాయంత్రం ఇంటికి తిరిగివచ్చినప్పుడు ఇల్యా పగలంతా కష్టించి పనిచేసివచ్చిన పెద్దమనిషిలాగా ఇతర పిల్లల గొడవ పట్టించుకోకుండా సరాసరి ఇంట్లోకి వెళ్ళాడు. పిల్లలంతా అతన్ని ఒక పెద్దమనిషిని గౌరవంతో చూచినట్టుగా చూచారు. తాతకూడా ఇంట్లో అడుగు పెడుతూనే, "అబ్బాయిల్లారా ! ఒంటెలు మూటలు మోసుకుని వస్తున్నాయి, తొలగండి' అనేవాడు. ఆ తరువాత ఇల్యాతో, 'అబ్బాయి ! త్వరగా స్నానంచేసిరా, వెళ్ళి టీ పుచ్చుకుందాం' అనేవాడు.

ఇల్యా గడపదాటి లోనికి వెడుతూ ఉన్నప్పుడు వసారాలో ఆడుకుంటూ ఉన్న పిల్లలంతా అతని వెనకాలే వచ్చేవారు. అతని సంచిలో ఏమున్నదో అని భయం భయంగా అతని సంచిని తడిమి చూచేవారు. ఇతరపిల్లల సంగతి ఎలా వున్నా సావెల్ మట్టుకు ఇల్యాను అడ్డగించా డన్నమాటే-

'ఒరేయ్ ! పాకీ వెధవా! ఏం తెచ్చావో చూపరా !' అనేవాడు దురుసుగా.

'ఉండరా బాబూ ! టీ నీళ్ళు గొంతులో పోసుకుని రానీ' అని తోసుకుని పోయేవాడు ఇల్యా. టీ తాగడానికి వెళ్ళగానే. "వచ్చావురా అబ్బాయ్' అంటూ బాబాయ్ ఇల్యాను కౌగిలించుకునేవాడు.

'గొప్ప పనివాడవయ్యావురా !' అని సర్టిఫికెటిచ్చేవాడు. తానొక గొప్పవాడయ్యాడని బాబాయ్ చమత్కారంగా అన్నప్పటికీ ఇల్యా ఆ మాటకు పొంగి పోయేవాడు. తన బాబాయ్ తనని చమత్కారంగా 'పనివాడా!' అని

పిలవడం బాగానే ఉంది. కానీ, అల్లరివాడయిన సావెల్ కూడా ఇల్యాను ఆటలు పట్టించడం మొదలెట్టాడు. ఒకరోజున ఇద్దరికీ తగాదా వచ్చింది. అప్పుడు పావెల్ సావెల్‌ను పట్టుకుని తాటితో కట్టిపేసి చావమోదాడు. ఇల్యాకూడా ఈ దృశ్యాన్ని చూస్తూనే ఉన్నాడు. ఆఖరుకు అతనికే జాలికలిగి, "ఇహ ఊరుకో పావెల్ మామయ్యా!" అన్నాడు. పావెల్ సావెల్‌ను ఆఖరుసారిగా ఒకటి అంటించి ఇల్యావైపు తిరిగి. "ఒరేయ్ అబ్బాయ్ ! నువ్వు నాకు అడ్డంరాకు- బావుండదు." అని గద్దించాడు.

పావెల్ ఒక మూలకువెళ్ళి కూచుని హోరుమని ఏడవడం ప్రారంభించాడు. ఇల్యాకు పావెల్ శత్రువైనప్పటికీ అతని గుండె కరిగిపోయింది. దగ్గరకు వెళ్ళి ఓదార్చవలెనని అనుకున్నాడు. తీరా ఓదారుద్దామని దగ్గరకు వెళ్ళేసరికి అతని నోటివెంట మాట రాలేదు.

"నొప్పిగా ఉన్నదా ?" అని మాత్రం అడగగలిగాడు.

"వెళ్ళు మాట్లాడకు" అన్నాడు సావెల్.

తను ఓదార్చడానికి యత్నించినా, తనని పావెల్ విసిరికొట్టాడని ఇల్యాకు కోపంవచ్చింది.

"ఎప్పుడూ అందరిమీదా చెయ్యిచేసుకోడమనుకున్నావా ?..." అని ఇల్యా ఏదో అనబోయేసరికి పావెల్ అతన్ని నేలమీద పడేశాడు. ఇరువురూ నేలమీద చాపల్లా చుట్టుకుని దొర్లడం మొదలెట్టారు.

ఇల్యా చివరకు అతన్ని జుట్టుపట్టుకుని క్రిందపడేసి అతని తలను నేలకేసి బాదడం మొదలెట్టాడు. పావెల్ 'అయ్యబాబోయ్' అని కేక లేయసాగాడు.

"చూశావా నా తడాఖా? ఇకనైనా జాగ్రత్తగా సంచరించుకో" అని ఇల్యా లేచి నెత్తురు కారుతున్న ముఖాన్ని తుడుచుకుంటూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు. తోవలో పావెల్ తండ్రి వడ్రంగి కనిపించాడు. కొడుకును కొట్టినందుకు తనమీద చెయ్యిచేసుకుంటాడేమోనని ఇల్యాకు భయం వేసి అతనివైపు బెదురుచూపులు చూడసాగాడు. కానీ వడ్రంగి అతని సంగతి పట్టించుకోనేలేదు.

"ఏమిట్రా అలా వెర్రిచూపులు చూస్తావు? ఇదివరకు ఎన్నడూ నన్ను చూడలేదా ఏమిటి?" అని మాత్రం అన్నాడు.

ఆ సాయంత్రం వడ్రంగి పావెల్ ఇల్యాతల నిమిరి "ఎలా ఉందిరా వ్యాపారం పాకీవాడా?" అని సరసంగా అడిగాడు.

ఇల్యా ముఖం చేటంత అయింది. ఆనందం అంటే ఇదే. ఆ ఇంటికంతా ఆ వడ్రంగి అంటే హడల్. అలాటివాడు కూడా తనని గౌరవిస్తూ ఉన్నాడు. ఇక ఇల్యా ఆనందానికి. సంతోషానికి మేర ఏమున్నది?

పావెల్ అతని రెక్కపుచ్చుకుని, "అబ్బాయ్! ఏమో అనుకున్నాను. నీవు అచ్చంగా భీముడివిరా! పెద్దయిన తరువాత నిన్ను నా దగ్గర పనిలో పెట్టుకుంటానులే!" అన్నాడు.

ఇల్యా భక్తితో అతనికాళ్ళు పట్టుకున్నాడు. ఆ పసి వాడి గుండెదడ ఆ వడ్రంగికి వినిపించిందో ఏమో, వడ్రంగి మనస్సు కరిగిపోయింది.

ఇల్యా శిరస్సు మెల్లగా నిముకుతూ, "అనాధుడా! ఇహ వెళ్ళు నాయనా!" అన్నాడు ఆప్యాయంగా.

ఆ సాయంత్రం ఇల్యా తన మామూలు కార్యక్ర మాన్ని ఎంతో ఉత్సాహంతో ప్రారంభించాడు. తను పగలు వీధులన్నీ తిరిగి ఏరుకుని వచ్చిన 'బహుమతులను' తన తోటి పిల్లలకు పంచిపెట్టే కార్యక్రమం అది. సంచి తెరిచి ఒక్కొక్కటీ బైటికి తీయసాగాడు ఇల్యా. ఒక కాలికోముక్క, చెక్కతో చేసిన సైనికుని బొమ్మ, ఖాళీ బూట్‌పాలిష్ టిన్ను, ఒక తల నూనె సీసా, టీ కప్పు- ఇలా ఒక్కొక్క వస్తువునే బైటికి తీయసాగాడు.

"ఇది నాది! ఇది నాది!" అంటూ పిల్లలంతా చుట్టూ మూగారు.

"ఉండండి! కొంచెం ఆగండి! ముందు దుకాణాన్ని పరచనివ్వండి" అన్నాడు ఇల్యా. వస్తువులన్నీ తీసి వరుసనే ఉంచాడు. కాలికో గుడ్డను తీసి. "చూడండి ఇదిగో చక్కని కాలికో బట్ట. ఎవరు కొంటారో- యాభై కోపెక్కుల ఖరీదు" అని బేరం పాడడం మొదలెట్టాడు.

"మాషా! నువ్వు కొంటావా?" అన్నాడు.

"మాషా కోసం నేను కొంటాను." అని యాకొవ్ తన జేబులోనుంచి కుండపెంకులను తీసి ఇల్యా చేతిలో ఉంచాడు.

"ఇదేం ఆటకాదు. నువ్వు బేరమాడకుండానే డబ్బులు ఇచ్చేస్తున్నావు. ఇలా ఎవరైనా బేరం చేస్తారా ?" అన్నాడు ఇల్యా.

"ఓ, మరిచాలే !" అన్నాడు యాకొవ్. తిరిగి బేరం మొదలైంది.

బేరం సాగుతూ ఉండగా పావెల్ చాటున ఉండి కొన్ని వస్తువులను దొంగిలించి, "చూడండి, నా చేతిలో ఏముందో చూడండి!" అంటూ గిర్రున తిరుగుతూ నృత్యం చేయసాగాడు. పిల్లలందరికీ చిర్రెత్తుకొచ్చింది. ఇల్యా, యాకొవ్‌లు అతన్ని వెన్నంటసాగారు. కానీ అతను ఎంతకూ చిక్కలేదు.

కానీ, తరువాత, తరువాత వారు అతని మోసానికి అలవాటు పడిపోయారు. అతను మోసగాడని తేలిపోయింది. పిల్లలంతా అతన్ని ఏవగించుకోసాగారు. అప్పటినుంచీ పావెల్ ఎవరితోనూ కలిసేవాడుకాదు. దూరందూరంగా ఉండేవాడు. కానీ ఎప్పుడూ, ఎవరికో ఒకరికి హాని చెయ్యాలని తలపోస్తూ ఉండేవాడు. యాకొవ్ మటుకు మాషా అంటే పడిచచ్చేవాడు. ఎప్పుడూ మాషాను కనిపెట్టుకుని ఉండేవాడు. అయినప్పటికీ అప్పుడప్పుడు మాషా అతనికి లెంపకాయలు తగిలిస్తూ ఉండేది.

ఇల్యాకు, యాకొవ్‌కు స్నేహం నానాటికీ గాఢతరం కాజొచ్చింది. ఇద్దరూ ఎన్నెన్నో కబుర్లు చెప్పుకునేవారు. కథలల్లి పోగులుపెట్టేవారు. యాకొవ్ ఇల్యాకు ఎప్పుడూ ఏదో ఒక కథ చెప్పేవాడు. నిజానికి అవి కథ కాదు. ఒక స్వప్నం లాంటిది. ఒకరోజున యాకొవ్ ఇలా చెప్పసాగాడు :

"...నా దగ్గర లక్షల కొద్దీ గూబుళ్ళు ఉన్నాయట. నేను ఈ గూబుళ్ళను అడవిలో దాచాను. హఠాత్తుగా దొంగలు వచ్చారు. కత్తులతో, కత్తారతో సహా వచ్చారు. నాకు భయం వేసింది. నేను పరుగు ప్రారంభించాను. సంచీలో ఏదో కదులుతూ ఉన్నట్లు తోచింది. నేను సంచీని అక్కడ వదిలేశాను. సంచీలోనుంచి కొన్ని వందల పక్షులు రివ్వున ఎగురుతూ వచ్చాయి. ఆ పక్షుల రెక్కలపై కూచుని ఎగురుతూ నేను ఆకాశంలోకి వెళ్ళాను..." హఠాత్తుగా యాకొవ్ ఆగిపోయాడు.

"సరే, తరువాత ఏం జరిగింది? అని ప్రశ్నించాడు ఇల్యా.

"నేను హాయిగా ఆకాశంలోకి ఎగిరిపోయాను" అన్నాడు యాకొవ్.

"ఎక్కడికి?"

"ఎక్కడికో!"

"ఎక్కడికి వెళ్ళావో జ్ఞాపకం లేదూ?" ప్రశ్నించాడు ఇల్యా.

కుర్రాళ్ళిద్దరూ ఇలా మాట్లాడుకుంటూ ఉండగా ఎరమి తాత టీ దుకాణం నుంచి బైటికి వచ్చాడు. ఎదురెండకు చేతులు కళ్ళకు అడ్డం పెట్టుకుని వచ్చాడు.

"ఇల్యా! ఇంకా ఇక్కడే ఉన్నావా? వెళ్ళిపడుకో!" అన్నాడు.

ఇల్యా వెంటనే లేచి వెళ్ళి ఒక చిన్న గడ్డివాముమీద పడుకుని ఎన్నెన్నో కలలు కనేవాడు. అతను వీథు

ల్లో చెత్త బట్టలను ఏరుకునే వాడైనా, అతని కలలు మాత్రం ఎంతో అందంగానూ, ఆనందంగానూ ఉండేవి.

ఎరమీంతాత ఇల్యాకు ఒక బూట్లజత, ఒకకోటు ఒకటోపీ, కొనిపెట్టి అతగాడిని బడికి పంపాడు. ఇల్యాకు బడి అంటే భయం. ఇది వరకు ఎన్నడూ బడి అనేది యెలా ఉంటుందో చూడలేదు. భయం భయంగా బడికి వెళ్ళి వస్తూ ఉండేవాడు. అతను బడిలోకి వెళ్ళగానే ఇతర పిల్లలంతా అతన్ని గుర్తు పట్టారు.

"ఒకేయ్ ! నువ్వట్రా పాకీవాడా !" అని గేలి చేశారు.

కొందరు పిల్లలు చిలిపిగా అతన్ని గిల్లారు. మరి కొందరు నాలికలు బైటికి పెట్టి అతన్ని వెక్కిరించారు. కొందరు దగ్గరకు వచ్చి వాసన చూచి, 'ఛార్' అని వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు.

"పాడుకంపు" అని ఏవగించుకున్నారు.

ఇల్యా బడినుంచి తిరిగి వచ్చిన తరువాత ఎరమీ తాత దగ్గరికి వెళ్ళి, "తాతా ! పిల్లలంతా నన్ను ఇలా ఎందుకు గేలి చేస్తారు ? వీధులు తిరిగి పాత పీలికలు ఏరుకొనడం అవమానకరమైనదా ?" అని అమాయకంగా ప్రశ్నించాడు.

"అందులో అవమానకరమైనది ఏమీ లేదు బాబూ" అని ఎరమీంతాత ఇల్యాను ఓదార్చాడు.

"పిల్లలు చిలిపిగా ఉంటారు. అది సహజం. కొన్నాళ్ళకు అలవాటు పడిన తరువాత వాళ్ళే ఊరుకుంటారు"

"నా బూట్లూ, నా కోటూ కూడా నావి కావంటు న్నారు తాతా! నేను చెత్తగుట్టలో ఏరుకుని వచ్చానంటు న్నారు." అన్నాడు ఇల్యా.

ఎరమీాతాత ఇల్యాను ఓదార్చాడు.

"సహనం అవసరం నాయనా! భగవంతుడే అన్ని కష్టాలూ తీరుస్తాడు. మనుష్యులు ఏం చేయగలరు?" అన్నాడు తాత.

అతని కళ్ళు మిల మిల మని మెరిశాయి. తాత ఎప్పుడు భగవంతుణ్ని గురించి మాట్లాడుతున్నా, భగవంతుడు తన. కళ్ళముందు సాక్షాత్తూ కనిపిస్తున్నట్లే మాట్లాడేవాడు. ఏదో చెప్పరాని ఒక తన్మయాన్ని పొందేవాడు. తాత మాట లను వింటూ ఉంటే కుర్రాడికి మనస్సులోని గాయాలన్నీ నయమైనట్లుగా తోచింది. కానీ, అప్పటికి తాత్కాలికంగా అతని మనోయాతన ఉపశమించినట్లు కనిపించినా, ఆ మరు నాటి ఉదయం రెండింతలు శక్తితో తిరిగి అతని మనస్సులో మేల్కొన్నది. తనూపనివాడు. కష్టించి ఆర్జించుకుంటున్నాడు. వడ్రంగి పావెల్ కూడా అతన్ని ఎంతో గౌరవిస్తాడు. ఇహ ఈ కుర్రకుంకలా తనని గేలిచేయడం? ఇల్యాకుబళ్ళుమండిపోయింది. బడికి వెళ్ళడమంటే రోత కలిగింది. బడిపంతులుకు కూడా ఇల్యా వృత్తి తెలిసింది. అంతటితో ఊరుకోనక తనని ఒక ఆదర్శంగా పిల్లలకి చూపుతూ వచ్చాడు. 'చూడండి అబ్బాయిల్లారా! ఇల్యా ఎలా కష్టించి చదువుకుంటూ ఉన్నాడో' అనేవాడు. పంతులుగారు సదుద్దేశంతో ఇలా అన్న ప్పటికీ ఇల్యాకి మరింత చికాకు కలిగింది.

ఇల్యా ముందు బెంచీలో కూచునేవాడు. వెనక బెంచీలపై కూకున్న ఇతర పిల్లలంతా తనని వెక్కిరిస్తున్నారని, గేలి చేస్తున్నారని అతనికి తెలుసు.

యాకొవ్ కూడా ఇల్యాకు సహపాఠి. అతన్ని కూడా పిల్లలు గేలిచేసేవారు. "మొద్దబ్బాయి, గొర్రెపిల్ల" అనే వారు. యాకొవ్ నిజంగా కూడా మందమతి. పరధ్యానం మనిషి. అంచేత పాఠాలు సరిగా వచ్చేవి కాదు. పంతులు గారి చేతిలో రోజూ బడితె పూజ జరుగుతూ ఉండేది. కానీ యాకొవ్ పట్టించుకునేవాడు కాదు. ఏమీ జరగనట్టుగా ఊరుకునేవాడు. తన చుట్టూ ఏం జరుగుతూ ఉందో కూడా గమనించేవాడు కాదు. అతని లోకనే అతనిది. ఇంటి వద్దకాని, బడివద్ద కాని అతని తరహానే వేరు. అతని లోకనే వేరు. అంతేకాదు, ఉండి ఉండి ఇల్యాను విచిత్రమైన ప్రశ్నలు అడిగేవాడు. ఆ ప్రశ్నలకు ఒక అర్థమంటూ ఉండేది కాదు.

"చూడు ఇల్యా! మనుష్యుల కళ్ళు ఇంత చిన్నవికదా అంతంత పెద్ద వస్తువులను ఎలా చూడగలుగుతున్నాయీ అంట? ఇంత కళ్ళలో ఒక పెద్ద పట్టణాన్నయినా చూడవచ్చు. ఏమిటంటావ్ ఈ విచిత్రం?" అని అడిగేవాడు యాకొవ్.

మొదట్లో ఇల్యా ఇలాంటి ప్రశ్నలను అంతగా పట్టించుకునేవాడు కాదు. కానీ తరువాత రాను రాను మాత్రం అతనుకూడా అనేక విషయాలను గురించి ఆలోచించసాగాడు. ఎరమీ తాతతో ఇలా చెప్పేవాడు.

"చూచావ్ ఎరమీా తాతా! మా బడిపంతులుకుకూడా ఉన్నవారూ, లేనివారూ అనే భేదం ఉన్నది. మొన్న ఒక దుకాణదారు కిటికీ అద్దాన్ని పగలకొట్టాడు. అందుకుపంతులు గారు వాణ్ణి చివాట్లు వేశాడు. అంతే, మరుసటి రోజున తన డబ్బుతోనే అద్దాన్ని బిగించాడు" అని చెప్పాడు ఇల్యా.

"చూడు - ఆయన ఎంత దయార్ద్ర హృదయుడో!" అన్నాడు ఎరమీా తాత.

"దయార్ద్ర హృదయుడా! అదేం? మరో రోజున ఏం జరిగిందో తెలుసా? మరో కుర్రాడు కిటికీ అద్దాన్ని పగలకొట్టితే వాడికి ఒకరోజంతా భోజనం కూడా పెట్టకుండా చేశాడు. వాళ్ళ నాన్న గారికి కబురుపెట్టి నల భై పెన్కులు వసూలు చేశాడు. ఇంతేకాదు, ఆ కుర్రాడికి వాళ్ళ నాన్న గారి చేతిలో భాగా దెబ్బలు తగిలాయి కూడా!" అన్నాడు ఇల్యా.

"అలాటి విషయాలను మనం పట్టించు కోకూడదు బాబూ! చూసీ చూడ నట్టుగా ఊరు కోవాలి" అని సలహా నిచ్చాడు తాత. 'మంచిచెడ్డలు నిర్ణయించడం మనవంతుకాదు. సృష్టికర్త అయిన భగవంతుడే అన్నిటికీ బాధ్యుడు. ఇప్పుడు నా వయస్సెంతంటావు? నీ అంతప్పటినుంచీ నేను ఈ లోకాన్ని చూస్తున్నాను. ఇలాటి అన్యాయాలను, అక్రమాలను ఎన్నింటిని చూచానో అన్నీ అన్యాయాలే! న్యాయాన్ని కాని, మంచిని కాని మచ్చుకైనా చూడలేదు. కానీ అంతమాత్రంతో చని పోయానా? ఈ కాయాన్ని ఇంకా ఇలాగే మోస్తున్నాను" అన్నాడు తాత.

"న్యాయాన్యాయాలను నిర్ణయించడంలో పెద్ద కష్టం ఏముంది తాతా! రెండో కుర్రాడి వద్ద యాభై కోపెక్కులు వసూలు చేసినప్పుడు మొదటి కుర్రాడినద్ద కూడా వసూలు చేసి తీరాలి. అంతే న్యాయమంటే!" అన్నాడు ఇల్యా.

న్యాయాన్యాయాలను గురించి కుర్రాడు చేసిన ఈ నిర్వచనాన్ని వృద్ధుడు అంగీకరించలేదు. న్యాయాన్ని నిర్ణయం చేసే విషయంలో మానవుల అశక్తతను గూర్చి, అల్పత్వాన్ని గూర్చి కుర్రాడికి ఒక చిన్న బోధ చేశాడు.

'తాతా! భగవంతుడు న్యాయ నిర్ణయం చేస్తాడని అంటున్నావు. అలాటి పుణ్యదినం ఉన్నదంటావా?' అని ప్రశ్నించేవాడు.

'ఆ ఘడియ ఎప్పుడు వస్తుందో ఎవరు చెప్పగలరు నాయనా? ఆ ఘడియంటూ రాకపోదు. అప్పుడు భగవంతుడు ఆకాశం నుంచి అవతరించి న్యాయాన్యాయాలకు తగిన ఫలితాలను పంచిపెడతాడు' అనేవాడు తాత.

తరువాత శనివారం వచ్చింది. ఇల్యా తాతతో కలిసి చర్చికి వెళ్ళాడు. చర్చిలో బిచ్చగాళ్ళు నుంచునే స్థలంలో ఇద్దరూ నిల్చుని ప్రార్థనలు చేశారు.

ఈ విధంగా ఇల్యా జీవితం సాగుతూ ఉంది.

ఇల్యా పట్టి అల్పనాకారపుబిడ్డ. కొంచెం గాలిసోకితే చాలు, వాడికి ఇట్టే పడిశం పట్టేది.

చర్చిలో కూడా వెలుపలే నిల్చోడంవల్ల వాడికి కాళ్ళు తిమ్మిర్లు పుట్టాయి. మాటి మాటికీ కాళ్ళు విదిలిస్తూ నిల్చున్నాడు. చర్చి వెలుపల వాకిట అద్దంలో నుంచి లోపలజరిగే

కార్యక్రమాన్నంతా చూచాడు ఇల్యా. కొవ్వొత్తుల కాంతులు, వినమితమైన భక్తుల శిరస్సులు. జీసస్ ప్రతిమ - ఆ వాతావరణం అతనికి విచిత్రంగా కనిపించింది.

చర్చిలో ప్రజల ప్రవర్తనకూ, లోకంలో ప్రజల ప్రవర్తనకూ భేదం కూడా కనిపించింది. చర్చిలో ప్రజలు వినయంగాను, శాంతంగాను కనిపించారు.

వారిలో ఒక విధమైన నిండూ, నిబ్బరమూ కనిపిస్తూ ఉన్నది.

చర్చి తలుపు తెరిచినప్పుడల్లా ఒక చల్లని పాట పిల్లగాలిలా తేలివచ్చి ఇల్యాను ఒక విధమైన తన్మయత్వంలో ముంచెత్తేది. బళ్ళో అల్లరి పిల్లలు కూడా చర్చిలో ప్రార్థనలలో పాల్గొనడం ఇల్యాకు విచిత్రంగా కనిపించింది. తను కూడా వెళ్ళి వాళ్ళతో పాటు చర్చిలో కూచుని ఆ సమూహ సంగీతంలో పాల్గొనాలని అనిపించింది. తను చర్చి నుంచి వెలుపలికి వచ్చిన తరువాత అతనిలో ఏదో మార్పు కలిగినట్లు తోచింది. తన విరోధులు కూడా మిత్రులైనట్లు తోచారు.

సోమవారం వచ్చింది. ఇల్యా బడికి వెళ్ళాడు. బడికి వెళ్ళినప్పుడు మటుకు అతనిలో ఈ భావం పూర్తిగా మారిపోయింది. జీవితం మళ్ళీ యథాతథంగానే కనిపించసాగింది. ప్రతి సమాజంలోనూ ఇమడలేని వ్యక్తి ఒకడు ఉంటూనే ఉంటాడు. ఇది సహజం. అతను ఇతర వ్యక్తులకంటె ఘనుడనీ కాదు, అల్పుడనీ కాదు. ఇతరులతో సరిపెట్టుకోలేకపోవడం అతని స్వభావం. అంతమాత్రమే. నలుగురూ హేళన చెయ్యడానికి ప్రత్యేకమైన కారణం ఏదీ ఉండనవసరం లేదు. అతని

ముక్కు వంకరనో, లేక మూతి వంకరనో శోధన చేసే అవసరం లేదు. లేక అతని మేధా సంపద అతీతం కావలసిన అవసరం కూడా లేదు. నలుగురిలోనుంచి ఒక్క వ్యక్తిని విడదీసి అతన్ని గేలి పట్టించడం నలుగురూ తద్వారా ఆనందించడానికే. ప్రస్తుతం ఈ వాంఛకి గురియైన వ్యక్తి ఇల్యా. సరిగా ఇదే సమయంలో బడిజీవితంలో అతని అభిలాషను పూర్తిగా నశింపచేసి అతన్ని ఆ జీవితం కంటె అతీతుణ్ణిగా భావింపచేసిన ఒక సంఘటన జరిగింది. ఈ సంఘటనే కనుక జరిగి ఉండకపోయినట్లయితే అతనిజీవితం అధోగతి పాలై ఉండేదే!

ఒకరోజున అతను ఇంటిముందు పెద్ద జనసమూహం కూడి ఉండడాన్ని చూచాడు.

యాకొవ్, ఇల్యా బడి నుంచి తిరిగి ఇంటికి వస్తూ ఉండగా ఈ సంఘటన జరిగింది.

"చూడు- మళ్ళీ ఏదో పెద్ద యుద్ధం జరుగుతున్నట్టుంది." అన్నాడు యాకొవ్. ఇద్దరూ జనసమూహాన్ని త్రోసుకుని ముందుకు వెళ్ళారు.

వడ్రంగి దుకాణం వద్ద జనసమూహం కూడి ఉంది. ఒక స్త్రీ నేలమీదపడి ఉన్నది. ఆ స్త్రీ వీపు నెత్తుటితో తడిసి ఉన్నది

ఆ స్త్రీ ప్రక్కనే విరిగిపోయిన ఓ శాలువా ఉంది. వడ్రంగి సావెల్ గడపలోకూచుని ఆ స్త్రీ వైపే చూస్తున్నాడు. అతని ముఖం కుంచించుకుపోయి ఉంది.

అక్కడ చేరిన జనసమూహమంతా నిశ్చల వదనాలతో అతనివంకే చూస్తున్నారు. ఎవ్వరి నోటి వెంటా ఒక్క

మాట కూడా రావడం లేదు. ఎరమితాత జనసమూహం మధ్య లోంచి ప్రోవచేసుకునివచ్చి, "సావెల్! ఇదిగో మంచి నీళ్ళు, త్రాగు" అని మంచినీళ్ళు అందించాడు.

"అతనికి ఇవ్వవలసినది మంచినీళ్ళుకాదు, ఉరితాడు!" అన్నారు జనసమూహంలో ఎవరో సణుగుతూ.

సావెల్ మెల్ల మెల్లగా మంచినీళ్ళు తాగాడు. నీళ్ళన్నీ తాగిన తరువాత ఖాళీగా ఉన్న గ్లాసులోకి చూస్తూ వృద్ధ కంఠస్వరంతో ఇలా చెప్పడం ప్రారంభించాడు :

"దానికి ఎన్నోసార్లు చెప్పిచూచాను. 'చాలించవే నీ వెర్రి వేషాలు' అన్నాను. 'జాగ్రత్త, చంపేస్తాను' అని బెదిరించాను. కానీ అది వింటేనా ? క్షమించాను, ఒకసారి కాదు లక్షసార్లు అయిపోయింది. ఆఖరుకు అంతా అయి పోయింది. తాతా! సావెల్ ఇప్పుడు అనాథు డయ్యాడు. కొంచెం వాణ్ణి కనిపెట్టి ఉండు."

"అందరినీ కనిపెట్టేవాడు ఆ ఈశ్వరుడే!" అంటూ తాత వణుకుతున్న తన చేతిని వడ్రంగి తలపై ఉంచినిమిరాడు.

"రాక్షసుడు ! భగవంతుని పేరు కూడా ఉచ్చరిస్తున్నాడు !" అన్నారు ఎవరో జనసమూహంలోంచి.

ఆ మాట వడ్రంగికి వినిపించింది. అతను ఉగ్రుడై పోయాడు. "వెళ్ళండి ఇక్కడి నుంచి, ఇక్కడ బొమ్మలు ఆడడం లేదు." అంటూ జన సమూహాన్ని గద్దించాడు.

పిడుగులాగా వడ్రంగి ఇలా గర్జించగానే అక్కడ చేరిన జనసమూహమంతా గొణుక్కుంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

జన సమూహమంతా వెళ్ళిపోయిన తరువాత వడ్రంగి అక్కడి నుంచి తన భార్య మృతకళేబరం వద్దకు వెళ్ళాడు. ఒక్క క్షణం అక్కడే ఆగి చటుక్కున వెనక్కు తిరిగి లోనికి వెళ్ళాడు. ఒక స్టూలుమీద కూచుని తలలో ఏదో పెద్ద భారాన్ని మోయలేనట్లుగా అటూ యిటూ ఊగిసలాడాడు. ఆ తరువాత వసారాలోకి వచ్చి అటూ ఇటూ తిరగడం మొదలెట్టాడు. అతని చుట్టూ చేరి వాళ్ళు ఏవేవో విషయాలను మాట్లాడుకుంటూ ఉన్నా, అతని కవేవీ వినిపించడంలేదు. అతను ఈ లోకంలోనే లేనట్టు ఉన్నాడు. అప్పుడు అతని స్థితిచూస్తే ఇల్యాకు ఎంతో జాలి కలిగింది.

ఈలోగా పోలీసులు వచ్చి జన సమూహాన్ని చెదరగొట్టారు. వడ్రంగిని స్టేషనుకు నడిపించుకుని వెళ్ళారు.

"వస్తాను తాతా, సెలవు!" అంటూ వడ్రంగి వెళ్ళిపోయాడు.

"మంచిది, వెళ్ళిరా నాయనా!" అన్నాడు తాత.

మరెవ్వరూ మాట్లాడలేదు.

కొంత మంది మాత్రం అక్కడే ఉండి హత్య చెయ్యబడిన స్త్రీ వైపు క్రోధంతో కూడిన దృక్కులను ప్రసరింపసాగారు. కొందరు ఒక బొగ్గుల బస్తాను తీసుకునివచ్చి ఆ స్త్రీ ముఖంమీద కప్పారు. ఒక పోలీసువాడు మటుకు అక్కడే కూచుని చుట్టకాలుస్తూ మధ్యమధ్యలో ఉమ్మివేస్తూ ఎరమీాతాత చెబుతున్న మాటలను వింటున్నాడు.

"అతనే చంపాడని అనుకుంటున్నారు కదూ? అతను కాదు చంపింది. ఏదో అతీతమైన అంధశక్తులున్నాయి. అవి

చంపింది. బ్రతికించడం, చంపించడం మన చేతుల్లో ఉందటయ్యా నాయనా? ఒకరిని ఒకరు చంపనూ లేరు, బ్రతికించనూ లేరు" అని చెబుతున్నాడు తాత.

"తాతా! అంతా పిచ్చి నీది. ఇహ ఊరుకో!" అని పోలీసువాడు ఘాటుగా ఒక దమ్ముకొట్టి పొగ వదిలాడు.

కొందరు అమ్మలక్కలు అక్కడచేరి చనిపోయిన స్త్రీని గురించి మాట్లాడుకుంటూ ఉన్నారు.

"అసలు పెళ్ళి కాకముందే ఇది ఇలాంటి..." అన్నది ఒక స్త్రీ.

"ఈ పావెల్ అసలు ఈ నడ్రంగి బిడ్డడే కాదట" అన్నది మరొక స్త్రీ.

"ఎవరో పంతులు చేసుకున్న పుణ్యంట!" అన్నది మరో స్త్రీ.

"ఆ పంతులే కదూ - ఆత్మహత్య చేసుకున్న పంతులు" అని వ్యాఖ్యానించింది మరొకతె.

"అసలు వాడే మొదలు" అన్నది మరో స్త్రీ.

ఇల్యా ప్రక్కనే నిల్చుని ఈ దృశ్యాన్ని చూస్తూ ఉన్నాడు.

పెర్ఫిష్కా భార్య మెల్లిగా కుంటుతూవచ్చి గడపదగ్గర కూచుంది. ఆకాశంవంక నిశ్చలంగా తదేకంగా చూడసాగింది. ఆవిడ అలా నిశ్చలంగా ఆకాశంవంక చూస్తూ ఉన్నప్పుడు భగవంతునికి తన హృదయ వేదనను విన్నవించుకుంటున్నదా అనిపించింది ఇల్యాకు.

ఇంతలోనే పిల్లలంతా వచ్చి అక్కడే గడపదగ్గర పోగయ్యారు. సావెల్ కొడుకు పావెల్ జరిగిన గాథనంతా చెబుతూవుంటే ఒక గొప్ప పురాణ గాథను వింటున్నట్లుగా అతి శ్రద్ధతో ఆలకించసాగారు. పావెల్ కండ్లలో ఒక విధమైన ఆందోళన, ఆవేదన కనిపిస్తున్నాయి. ఆరోజున ఒక పెద్ద సంఘటన జరిగినట్టూ, జరిగిన నాటకానికి తానొక నాయకుడైనట్టూ భావిస్తున్నాడు పావెల్.

ఇప్పటికి కనీసం ఒక వందసార్లయినా ఈ గాథను ఏకరువు పెట్టాడు. ఈసారిమటుకు అతను చెబుతున్న తీరులో మొదలు కనిపించినంత ఉద్వేగం కనిపించడంలేదు. తనకు సంబంధించని విషయాన్ని నిర్లిప్తంగా చెబుతున్నట్టు చెబుతున్నాడు.

పావెల్ ఇలా చెప్పసాగాడు: "అమ్మ ఇంట్లోనుంచి వెళ్ళిపోయి మూడురోజులు కావస్తూంది. అప్పటినుంచీ నాన్న బోనులో పులిలాగా ఇంట్లో తిరుగుతూ ఉన్నాడు. నన్ను జుట్టుపట్టుకుని కొట్టేవాడు. అప్పుడే అనుకున్నాను, 'ఏదో గొడవ జరిగి ఉంటుందని.' మూడురోజుల తరువాత అమ్మ తిరిగివచ్చింది. మెల్లిగా మెట్లు ఎక్కుతూ మేడమీదకు వెళ్ళింది. నాన్న మెల్లిగా అడుగులు వేసుకుంటూ అమ్మ వెనకాలే వెళ్ళాడు. నాన్న అలా నడుస్తూవుంటే నా మటుకు నాకు ఎంత భయం వేసిందో! నాన్న కళ్ళు చింత నిప్పుల్లాగా మండుతున్నాయి. 'అమ్మా! జాగ్రత్త! వెళ్ళిపో' అని పెద్దగా అరుద్దామనుకున్నాను. కానీ నా నోటినుంచి మాట పెగలలేదు. అమ్మ ఒకసారి వెనక్కు తిరిగి చూచింది.

నాన్నని చూచేసరికి పిల్లిలాగా అయిపోయి పసుగుపుచ్చుకుంది. కానీ లాభం...?" పావెల్ ముఖం హఠాత్తుగా విషాదపూరిత మైపోయింది. తలవంచుకుని నిశ్శబ్దంగా కూచున్నాడు.

"అయితే, అమ్మని పూర్తిగా చంపాడంటావా ?" అని అడిగింది మాషా.

"వట్టి మొద్దు, ఊరుకో !" అన్నాడు పావెల్.

యాకొవ్ మాషా నడుముచుట్టూ చెయ్యివేసి దగ్గరకు తీసుకున్నాడు.

ఇల్యా కూడా పావెల్ దగ్గరకు వెళ్ళి కూచున్నాడు.

"నీకు ఆవిడ చనిపోయిందని దిగులుగా ఉన్నదా ?" అని అడిగాడు యాకొవ్ మెల్లిగా.

"నీకెందుకు ?" అన్నాడు పావెల్. అతని సమాధానం కట్టెపిడిచి పొయ్యిలో పెట్టినట్లు నిక్కచ్చిగా ఉంది.

"అది మంచిదికాదు. తిరుగుబోతు" అన్నది మాషా.

మాషా ఈ మాట అనేలోపునే యాకొవ్ కల్పించుకుని, "అలా అనొచ్చా అమ్మాయ్ ! అలాంటి కటికవాడు మొగుడైనప్పుడు ఎవరైనా అలాగే తయారవుతారు. అలాంటివాణ్ణి కట్టుకుని కూడా – ఆ బాధ కనిపించనీయకుండా – నవ్వుతూ హాయిగా ఉండేది" అన్నాడు.

యాకొవ్ ఇలా చెబుతూవుంటే పావెల్ మధ్యలో ఒకమాటు అతనివంక చూచాడు. తరువాత తను ఒక పెద్ద మనిషిలాగా ఇలా చెప్పడం ప్రారంభించాడు: "నేనూ ఒకసారి అమ్మతో చెప్పాను. 'అమ్మా జాగ్రత్త! నాన్న చంపేస్తాడు' అని హెచ్చరించాను. కానీ అమ్మ నామాట పట్టించు

కుంటేనా? 'నాన్నతో చెప్పకు బాబూ' అంటూ నాకు అవీ ఇవీ కొనిపెట్టి నా నోరు మూయించేది. అమ్మతో ఉంటూ వచ్చిన వ్యక్తికూడా అడపా దడపా నా చేతిలో ఏదో ఒకటి పెడుతూనే వచ్చాడు. అమ్మరాసిన చీటీని అతనికి అందించి నప్పుడల్లా అతను నాకు ఏదో ఒకటి బహుమతి ఇచ్చేవాడు. అతనూ మంచివాడే పాపం! ఎంత బలశాలి అనుకున్నారు! పైగా పెద్ద మీసం."

"చేతిలో కత్తికూడా ఉండేదా ఏమిటి?"

"ఊఁ" అన్నాడు పావెల్.

"ఇప్పుడు నువ్వూ అనాథ బాలుడివి అయ్యావు - యాకొవ్ లాగానే" అన్నాడు యకోల్.

"అయితేనేం? నేను వాడిలాగా వీధుల వెంట తిరుగుతూ పాతగుడ్డల పీలికలు ఏరుతాననుకున్నావా?" అన్నాడు.

"ఇహ చూడండి నేనేం చేస్తానో - నాన్న నన్ను బడికి వెళ్ళొద్దన్నాడు. ఇప్పుడు నాన్న లేడుగా - నాన్నను జైలుకు తీసుకుని వెళ్ళారు. ఇహనుంచీ నేను బడికి వెడతాను. మీ అందరికంటె చక్కగా చదువుకుంటాను" అని గర్వంగా చెప్పసాగాడు పావెల్.

బడికి వెళ్ళాలంటే మరి బట్టలో? చిరుగు బట్టలు తొడుక్కున్నవాళ్ళను బళ్ళోకి రానిస్తారా ఏమిటి?" అన్నాడు ఇల్యా.

"మా నాన్న వడ్రంగి కొలిమిని అమ్మేస్తాను. బట్టలకేం తక్కువ?" అన్నాడు పావెల్.

"ఆహా! ఇల్యా ప్రశ్నకి ఎంత చక్కని సమాధానం చెప్పాడూ" అన్నట్లుగా పిల్లలంతా పావెల్ వంక ఆశ్చర్యంగా చూచారు. పిల్లలంతా పావెల్ వంక అలా శ్రద్ధతో చూచేసరికి తనకేదో లేని ప్రాధాన్యంవచ్చి పడినట్టుగా భావించసాగాడు పావెల్.

"ఒక గుర్రాన్నికూడా కొంటాను. బొమ్మ గుర్రం అనుకున్నారా? ఊహుఁ, అసలు గుర్రం- గుర్రం మీదెక్కి రాజాలా బడికి వెడతాను" అన్నాడు. ఇలా అని గర్వంతో చిరునవ్వు నవ్వాడు పావెల్.

"ఇహ నీకు ఎదురు లేదులే" అన్నది మాషా.

"తాటిచెట్టెక్కేవాడికి తలదన్నేవాడు ఉండక పోతాడా?" అన్నాడు ఇల్యా.

పావెల్ ఇల్యా వంక తీక్ష్ణంగా చూచాడు.

"నువ్వేనా ఏమిటి తల తన్నేవాడివి - చూచుకుంటావా మరి?" అన్నాడు సవాలు చేస్తున్నట్టుగా యాకొవ్ కల్పించుకున్నాడు.

"ఊరుకోండిరా అబ్బాయిల్లారా! ఇది ఆట. అంతే!" అంటూ ఇద్దరినీ సర్దాడు.

"చూడండి - ఒక్కక్షణం క్రింద హాయిగా తిరుగుతూ ఉన్న మనిషి ఇప్పుడు ఎలా ఉందో - జీవితం అంటే ఇలాగే ఉంటుంది. ఏ క్షణాన ఏం జరుగుతుందో! ఇప్పుడు ఆవిడ ఎక్కడికి వెళ్ళిందంటారు?" అన్నాడు యాకొవ్.

యాకొవ్ ఇలా చెబుతూ ఉంటే, పిల్లలంతా అతని వైపే చూడసాగారు. అతనికళ్ళు పెద్దవై విచిత్రంగా కనిపించాయి.

"అవును, నీవు చెప్పినదంతా నిజమే! నేనూ ఇదే విషయాన్ని ఆలోచిస్తున్నాను" అన్నాడు ఇల్యా.

"చనిపోయిందంటారు. చావంటే ఏమిటో?" అన్నాడు యాకొవ్.

"ఆత్మ శరీరంనుంచి ఎగిరిపోయిందన్నమాట" అన్నాడు పావెల్.

"ఆకాశానికి ఎగిరిపోయింది" అన్నది మాషా కండ్లెత్తి ఆకాశం వంక చూస్తూ. ఇలా అంటూ యాకొవ్‌కు మరింత దగ్గరగా జరిగింది. ప్రొద్దు క్రుంకింది. మినుకు మినుకుమంటూ నక్షత్రాలు గగనంలో మొలకెత్తాయి. ఒక పెద్ద నక్షత్రం భూమి దాపుగా కన్నార్పకుండా చూస్తున్నది. మాషా ఆకాశం వంక చూచినట్లే పిల్లలు ముగ్గురుకూడా అటువైపే చూడసాగారు. ఇల్యా కళ్ళల్లో భయం కనిపించింది. యాకొవ్ ఆకాశంలో ఏదో వెదుకుతూ ఉన్నట్లు అటువైపే చూడ సాగాడు.

"యాకొవ్!" పిలిచాడు ఇల్యా.

యాకొవ్ సమాధి భగ్నమైంది.

"ఏమిటి పిలిచావు?" అడిగాడు యాకొవ్.

"నేనూ ఆలోచిస్తున్నాను"

"దేన్ని గురించి?"

"వాళ్ళు ఆవిడని ఎలా చంపారూ అని? ఇప్పుడు చూడు- ఆవిడ గొడవ అనుకునే వాళ్ళు లేరు. ఎవరి గొడవ వాళ్ళది."

"ఎరమీా తాత ఏడ్చాడుగా!"

"తాత ఎప్పుడూ కన్నీళ్ళు పెట్టుకుంటాడు. అది అత నికి అలవాటు. కానీ పావెల్ చూడు - పిట్టకథను చెప్పినట్టు జరిగిన వృత్తాంతమంతా చెప్పాడు"

"వాడికీ దుఃఖం ఉండదూ! కానీ బైటికి వెలి బుచ్చాడంటే సిగ్గుపడతాడు. ఒంటరిగా కూచుని పాపూ వెక్కి వెక్కి ఏడుస్తాడు.

ఇద్దరూ కాసేపు మాట్లాడకుండా నిశ్శబ్దంగా కూచు న్నారు.

మాషా యాకొవ్ మోకాళ్ళపై తల వాల్చి నిద్ర పోయింది. నిద్రిస్తున్న ఆ అమ్మాయి ముఖం ఇంకా ఆకాశం వైపే చూస్తున్నట్లుగా ఉన్నది.

"నీకు భయంగా ఉన్నదా ?" మెల్లిగా అడిగాడు యాకోవ్.

"ఊఁ" అన్నాడు ఇల్యా.

"ఆవిడ దెయ్యమై వస్తుందేమో !"

"ఊఁ, మరెలా? మాషా నిద్రపోతోంది"

"మాషాను ఇంటికి చేర్చాలి. కానీ కదలాలంటే భయంగా ఉంది."

"నేను నీకు తోడు వస్తానులే." యాకొవ్ ఆ పిల్ల తలను తన బుజంమీద ఉంచి నెమ్మదిగా లేవదీయడానికి యత్నించాడు.

"ఉండు ఇల్యా! ముందు నేనువెడతాను?" అన్నాడు యాకొవ్.

యాకొవ్ నెమ్మదిగా ఆ పిల్లను మోసుకుని నడవ సాగాడు. ఇల్యా అతన్ని అనుసరిస్తున్నాడు. అతని వెనకాల ఎవరో వస్తున్నట్టుగా అనిపించింది ఇల్యాకు. అతనికి భయం వేసింది.

"త్వరగా వెళ్ళు" అన్నాడు ఇల్యా.

ఈ సంఘటన జరిగిన కొద్ది రోజులకు ఎరమీాతాత ఆరోగ్యం బాగాదెబ్బతిన్నది. ఇప్పుడుఇంట్లోనే ఉంటున్నాడు. గుడపీలికలను ఏరడానికి బైటికి వెళ్ళడంలేదు. ఎప్పుడూ ఏదో ఆలోచనట్టుగా తిరుగుతూ ఉంటాడు. లేదా గదిలోనే పడు కుంటాడు. వసంతం వచ్చింది. ఎండవచ్చినప్పుడల్లా తాత కాసేపుబయటికి వచ్చికూచుంటాడు. వ్రేళ్ళులెక్కెట్టుకుంటూ ఏదో గొణుగుతూ ఉంటాడు. పిల్లలకు కథలు చెప్పడం పూర్తిగా మానేశాడు. ఒకనేళ ఎప్పుడైనా కథలు చెప్పినా, అవి అంత బావుండడంలేదు. పైగా దగ్గు. కథ చెబుతూ ఉంటే మధ్యలో దగ్గు తెరలు తెరలుగా వచ్చేది.

'అబ్బబ్బ! ఆపుతాతా దగ్గడం' అనేది మాషా.

'ఆగమ్మా... ఒక్క నిమిషం...' అనేవాడు తాత.

తాత ఎంత ప్రయత్నించినా దగ్గు అగేది కాదు. అసలే ఎముకల పోగై మిగిలిన అతని దేహం దగ్గుకు తుపానుకు చెట్టు ఊగినట్టుగా ఊగిపోయేది.

తాత మధ్యలోనే కథని ఆపుచేసేవాడు. పిల్లలంతా ఎవరికి వాళ్ళు వెళ్ళిపోయేవారు. పూర్వం తాను కథ చెబుతూఉంటే గంటలతరబడి వినేవాళ్ళుపిల్లలు. ఇప్పుడో... మరి తాతకి ఎంతో దిగులేసేది.

తెరంతి, పెట్రూకా మధ్య మధ్యలో తాత క్షేమ సమాచారాలు విచారించేవారు. తాత ఆరోగ్యాన్ని గురించి ఆందోళన వారికి నానాటికి హెచ్చుకాసాగింది.

వారు వారి పనులుచేసుకుంటూ మధ్యలో తీరినప్పుడు తాత గదిలోకి తొంగి చూచి, 'ఎలా వున్నావు తాతా ? క్షేమమా ?' అని అడిగేవారు.

తాత గదిలో అటూ ఇటూ తిరుగుతూ ఉండేవాడు. పాడుగుపాటి పాతకోటుధరించేవాడు. తాత జేబుల్లో ఎప్పుడూ నాణేలు మ్రోగుతూ ఉండేవి. ముందు బట్టతలయిపోయింది.

ఇల్యాకు తాతంటే మొదటినుంచీ ఇష్టంలేదు.

ఇప్పుడు అతని అయిష్టం మరింత ఎక్కువైపోయింది. పెట్రూకాకు కూడా తాతంటే ఇష్టంలేదు. ఒకప్పుడు తన బాబాయ్ ఎరమీతాతతో పెట్రూకా ఇలా చెబుతూ ఉండడం ఇల్యా విన్నాడు :

'తెరంతి! కాస్త కనిపెట్టిఉండు. తాతంటే సామాన్యుడనుకునేవు. మనకి రెండేకళ్ళు. తాతకి ఒళ్ళంతా కళ్ళే. నట్టి పిసినిగొట్టు, దిండు కింద ఎంత డబ్బు దాచాడో'

తాత ప్రాణం ఇనాళ్లో రేపో గుటుక్కుమనేట్టుగా ఉంది. అయినా బైటికి రానడం మానలేదు. ప్రతిరోజూ సాయంకాలం బైటికి వచ్చి టీ తాగుతూ టీ దుకాణంలో కూచునేవాడు. తెరంతికి వేదాంతం చెప్పడం కూడా మానుకోలేదు. ఇహ పరాలను గురించి ఉపన్యసిస్తూనే ఉన్నాడు.

పట్నం జీవితం తెరంతిని బాగా కుంగ దీసింది. అసలే గూనివాడు. ఇప్పుడు మరీ వికారంగా కనిపిస్తూ ఉన్నాడు. టీ దుకాణం ప్లేట్లు కడిగి కడిగి అతని చేతులు కణుపులు కట్టిపోయాయి. కళ్ళు కొద్దిగా మసకలు కమ్మాయి. ఆ కళ్ళలో ఒకవిధమైన భయం కూడా కనిపిస్తున్నది. నడుము వంగి పోయింది.

ఎరమీాతాత వచ్చి టీ దుకాణంలో కూచోగానే తెరంతి దగ్గరికి వచ్చి 'ఏం కావాలి తాతా ?' అని అడుగుతాడు.

'ఏమీా అవసరం లేదు' అంటాడు తాత. తెరంతి మెల్లిగా అడుగులు వేసుకుంటూ మళ్ళీ టీ దుకాణంలోకి వెళ్ళిపోతాడు.

'ఇహ లాభం లేదు. ఆ రోజు దగ్గరికి వచ్చింది' అని సణుక్కుంటాడు తాత. ఒక రోజున తాతకి దగ్గుతెర బ్రహ్మ ప్రళయంగా వచ్చింది.

"భగవంతుడా! మరికొన్నాళ్ళు బ్రతకనివ్వు. ఇన్నాళ్ళూ నే కూడబెట్టిన డబ్బు...మా ఊళ్ళో చర్చి కట్టించడానికి కూడబెట్టాను. దేవాలయాలు ఎంతో అవసరం. పాపాత్ములకు

దేవాలయం కన్న శరణ్యం మరేమున్నది ?" అని భగవంతుణ్ణి ప్రార్థించాడు.

ఇల్యా అటు వెడుతూవుంటే తాత ఇల్యాను దగ్గరికి పిలిచాడు. "అబ్బాయ్ ఇల్యా! నాదగ్గర డబ్బుంది నాయనా! కాస్త కనిపెట్టు ఉండు. గద్ద తన్నుకుని పోతుందేమో !" అన్నాడు.

తాత తనకి ఒక పెద్ద రహస్యం చెప్పాడని అనిపించింది ఇల్యాకి. తాత గద్ద విషయం చెప్పాడు. ఆ గద్ద ఎవరో ఇల్యాకి తెలుసు. ఒకరోజున ఇల్యా బడినుంచి వచ్చి బట్టలు మార్చుకుంటూ ఉండగా తాత గదిలో మూలగడం వినిపించింది.

"ఇక - వెళ్ళు !" అని మూలుగుతున్నాడు తాత.

ఇల్యా తలుపుసందులోనుంచి చూచాడు. 'తాతా!' అని పిలిచాడు. తాత ఉలిక్కిపడి తలెత్తి చూచాడు.

"భగవంతుడా ! అడుగో ! పెట్రూకా వచ్చినట్టున్నాడు. వీడే ఆ గద్ద. భగవంతుడా! డబ్బంతా నీగుడి కోసమే కూడబెట్టాను" అని కలవరించసాగాడు తాత.

తాత కలవరింతలనూ, పలవరింతలనూ విని ఇల్యా నిలువునా వణికిపోయాడు.

తాత ఆకాశంలోకి ఎవరివైపో వేలుచూపుతూ, 'జాగర్త ! అది దేవుని ధనం' అని బెదిరించసాగాడు.

వృద్ధుడి మొహం హఠాత్తుగా సుళ్ళు తిరిగిపోయింది. లేచి కూచున్నాడు. తెల్లగా నెరిసిన గడ్డం పావురాయి రెక్కలాగా గాలికి ఊగిసలాడుతున్నది. చేతులు ముందుకు చాచి నిలువునా నేలమీద కూలిపోయాడు.

'తాత చనిపోయాడు - తాత చనిపోయాడు' అని కేకలు వేస్తూ ఇల్యా టీ దుకాణంలోకి పరుగుతీశాడు.

తెరంతి ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చి వెనక్కి తిరిగి పెట్రూకా వైపు తదేకంగా చూచాడు.

"వృద్ధుని ఆత్మ శాంతించుగాక!" అన్నాడు పెట్రూకా.

"పాపం తాత ఎంత మంచివాడు! ఎన్నాళ్ళో మనల్ని కనిపెట్టి ఉన్నాడు - ఒకసారి చూచివస్తాను. అబ్బాయ్, ఇల్యా! నువ్వు ఇక్కడే ఉండు - అవసరమైతే నన్ను పిలు" అని పెట్రూకా త్వరత్వరగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఇల్యాకు ఈ సంఘటన ఎంతో భయం కలిగించింది.

"నీవు తాత చనిపోవడం చూచావా?" అని అడిగాడు యాకోవ్.

ఇల్యా అతనివైపు చూచాడు.

"వాళ్ళంతా అక్కడికి ఎందుకోసం వెడుతున్నారో?" అని అడిగాడు యాకోవ్:

"తాతని చూసి రావడానికి వెడుతున్నారు" అన్నాడు ఇల్యా.

ఇల్యా ఒకమాటు కళ్ళు మూసుకున్నాడు.

"దెయ్యం ఎంత తోపు తోసింది?" అన్నాడు.

"దెయ్యం తాతని ముందుకు తోసిందా? తాత దెయ్యాన్ని తోశాడా?" అడిగాడు యాకోవ్.

"ఆఁ...అఁ... మరిచాను... దెయ్యాన్నే తాత ముందుకు తోశాడు" అన్నాడు ఇల్యా.

"నువ్వు దెయ్యాన్ని చూశావా ?"

ఇల్యా సమాధానం చెప్పకుండా కళ్ళు మూసుకున్నాడు.

"నీకు భయం వేసిందా ?"

ఇల్యా ఈ మాటుకూడా సమాధానం చెప్పలేదు.

"ఒక్క నిముషం ఉండు, ఇప్పుడే వస్తాను." అని అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

అనుమానాలతో సతమత మవుతూ ఇల్యా మెల్లిగా పిల్లిలాగా అడుగులు వేసుకుంటూ తాత గదినద్దకు వెళ్ళాడు.

వృద్ధుడు ఇంకా చనిపోలేదు. కొన ఊపిరితో మూలుగుతూ ఉన్నాడు. తాత కాళ్ళ దగ్గిర ఇద్దరు వ్యక్తులు కూచుని ఉండడం ఇల్యాకు కనిపించింది.

తెరంతి మెల్లిగా లేచి వెళ్ళి తాతదిండు జాగ్రత్తగా కుట్టడం ప్రారంభించాడు.

"త్వరగా కానీ, కుట్టుపనిచేస్తూ కూచోడానికి ఇదేనా సమయం ?" అని గద్దించాడు పెట్రూకా.

పెట్రూకా గుసగుసలు, మరణశయ్యపై ఉన్న వృద్ధుని మూల్గులు, తెరంతి సూదితో దిండును కుడుతూ ఉన్న ధ్వని, వెలుపల కాలవలో నీళ్ళ చప్పుడు ఈ శబ్దాలన్నీ కలిసి ఒక విచిత్రమైన ధ్వనిగా పరిణమించి కుర్రాడి మనస్సునూ, ఇంద్రియాలనూ స్తబ్ధీభవింప చేశాయి.

ఇల్యా మెల్లిగా మెట్లెక్కి పైకి వెళ్ళాడు. అతను ఆ దుఃఖంలో అడుగుతీసి అడుగు వేయలేకపోయాడు. టీ దుకాణం గడపచేరేసరికి ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడవ సాగాడు. వెనుక నుంచి పెర్ఫిష్కా కంఠస్వరం వినిపించింది.

"ఏమిటి ? అయిపోయాడా ?" అంటూ పెర్ఫిష్కా చరచరా మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

ఈలోగా పెట్రూకా మెట్లు ఎక్కి వస్తున్న అడుగుల చప్పుడు ఇల్యాకి వినిపించింది. తెరంతి కూడా అతని వెన కాలే వచ్చాడు. ఇల్యా ఏడవడం అతనికి వినిపించింది.

"ఏమిట్రా అబ్బాయ్, ఏడుస్తున్నావా ? అవును, తాతయ్యకూ నీకూ ఉన్న ఆ స్నేహబాంధవ్యం అలాంటిది" అంటూ నేడమీదికి వెళ్ళాడు తెరంతి. ఇల్యా చొక్కాతో కళ్ళు తుడుచుకున్నాడు. ఒకసారి నలువంకలా కలయ చూచాడు. పెట్రూకా మళ్ళీ క్రిందికి వెళ్ళి సారా దుకాణంవద్ద ఉన్నాడు. పెర్ఫిష్కా కూడా అక్కడే ఉన్నాడు. పెర్ఫిష్కా ముఖం పేకాటలో దివాలా తీసిన వ్యక్తిలా ఉంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు పెర్ఫిష్కా ?" అని అడి గాడు పెట్రూకా.

"డబ్బు" అన్నాడు పెర్ఫిష్కా.

డబ్బా ? ఎక్కడిదీ ?" అన్నాడు పెట్రూకా.

"ఓ, అలాగా- నాకు దాన్ని వాసన కూడా చూప వన్నమాట. పోనీలే, అంతా నువ్వే అనుభవించు" అన్నాడు పెర్ఫిష్కా.

"ఏమిట్రా నీ గొడవ ?" అన్నాడు పెట్రూకా.

"ఏమీ లేదు. నేను వట్టి వెర్రివాణ్ణి కదూ, అందుకని అడిగాను" అన్నాడు పెర్ఫిష్కా.

"నీ గొడవ నాకు తెలిసిందిలే. చుక్క పడాలంటావు. అంతేగా !" అన్నాడు. పెట్రూకా.

పెర్ఫిష్కా నవ్వుతూ వెళ్ళిపోయాడు.

ఇల్యా తలలో ఏదో బరువు ఉన్నట్లుగా ఒక మాటు తల విదిలించుకున్నాడు.

ఆ రాత్రి ఇల్యా తను మామూలుగా నిద్రపోయే చోట నిద్రపోలేదు. సారాదుకాణంలో తెరంతి కప్పులుకడిగే చోట ఒక బల్లక్రింద చోటుచేసుకుని పడుకున్నాడు. సారా దుకాణంలో దీపాల కాంతి మటుకు టీ దుకాణంలోని బల్లల పైన మందంగా పడుతూ ఉన్నది. టీ దుకాణంలో మటుకు ఒక్క దీపంకూడా లేదు. వెలుపల సన్నని వానజల్లు పడుతూ ఉన్నది. తెరంతి మధ్య మధ్యలో నిశ్వసిస్తూ, బల్లలు తుడుస్తూ ఉన్నాడు. తెరంతి దీపానికి దగ్గరగా వచ్చినప్పుడల్లా అతని నీడ పెద్దదై నేలపై పడుతున్నది. ఇల్యా ఆ నీడను చూచి ఎరమీటాత దెయ్యమేమో .అనుకున్నాడు.

చలి. దుర్గంధం. నేల అలికిన వాసన. ఇల్యాకు ఊపి రాడడంలేదు. ఎంత ప్రయత్నించినా నిద్రరావడం లేదు. బాబాయిని వచ్చి తన ప్రక్కనే పడుకోమని అడగాలను కున్నాడు. కానీ బాబాయ్ అంటే ఒక విధమైన చెప్పరాని అసహ్యం కలిగింది. చివరకు ఎలాగయితేనేం మనస్సు చిక్క బట్టుకుని, "బాబాయ్ ఇలా రా !" అని పిలిచాడు.

తెరంతి ఉలిక్కిపడి, "ఏమిట్రా బాబూ!" అన్నాడు.

కిటికీ అద్దాలపై వాన చినుకులు టపటప మని ధ్వని చేస్తూ పడుతున్నవి. దీపం మినుకు మినుకు మంటున్నది. మినుకు మినుకుమనే దీపకాంతిలో సీసాలు, టీపాయ్‌లు సగం కనపడి, సగం కనపడకుండా కనిపిస్తున్నవి.

హఠాత్తుగా అతని ప్రక్కనే ఏదో ధ్వని అవుతున్నట్టు వినిపించింది.

ఇల్యా కుంచించుకుని పోయాడు. తెరంతి మోకాళ్ళపై కూచుని, "భగవంతుడా! భగవంతుడా!" అంటూ ప్రార్థిస్తున్న శబ్దం అతనికి వినిపించింది.

బాబాయి ఇలా ప్రార్థిస్తూ ఉంటే, ఎరమీంతాత మూలుగు జ్ఞాపకం వచ్చింది ఇల్యాకి.

"అలా ప్రార్థించకు" అన్నాడు ఇల్యా.

"నీవు పడుకుని నిద్రపోగా బాబూ!" అని బ్రతిమాలాడు తెరంతి.

చీకటి, చిత్తడి. ఇల్యాకు చెప్పరాని చీదర. ఎంత యత్నించినా ఊపిరి సలపడం లేదు. అతని మనస్సులో అనేక విరుద్ధ భావాలు సంఘర్షించ సాగాయి.

భయం, ఎరమీంతాతపై జాలి, బాబాయంటే కోపం – అనేక విచిత్ర విరుద్ధభావాలు తుఫానులా విజృంభించాయి.

అతను ఎంతకూ పక్కకుదరక కాసేపు అటూ ఇటూ దొర్లుతూ పడుకుని చివరకు లేచికూచున్నాడు.

"ఏమిట్రా గొడవ ?" అన్నాడు బాబాయి తెరంతి. గదిస్తున్నట్టుగా.

"ఏదో భయంగా ఉన్నది. ఎక్కడికైనా వెళ్ళి దాక్కుందా మనిపిస్తున్నది" అన్నాడు ఇల్యా. అతని నోటి వెంటమాట రావడం లేదు. వెక్కి వెక్కి ఏడుస్తూ పక్కమీద వాలిపోయాడు.

ఆ తరువాత ఇల్యాలో పెద్దమార్పు వచ్చింది. ఇది వరకు బళ్ళో పిల్లలతో మాత్రమే కలవకుండా దూరంగా ఉంటూ వచ్చాడు. కానీ ఇంటికి వచ్చిన తరువాత మాత్రం పిల్లలతోనూ, పెద్దలతోను కలిసి మెలసి తిరిగాడు. ఇప్పుడు అలా కాదు. అందరికీ దూరంగా ఉంటున్నాడు. ఎప్పుడూ ఏదో ఆలోచన. తనకే తెలీని ఏదో అవ్యక్తమైన ఆవేదన. వయస్సుకు మించిన ఆలోచనలతో అతని బుర్ర వేడెక్కి పోతోంది. ముఖం నిశ్చల గంభీరంగా కనిపిస్తోంది. పెదవులపై ఏ క్షణంలో కూడా చిరునవ్వు తాండవించడం లేదు.

ఎరమీతాత మరణానికి సంబంధించిన జ్ఞాపకాలు అతని మనస్సును వదలకుండా వేధిస్తున్నాయి. తన బాబాయి, పెట్రూకా, తాతకి అన్యాయం చేశారన్న విషయం అతనికి పదేపదే జ్ఞాపకం వస్తున్నది.

ఎవరిని చూచినా అనుమానమూ, అక్కసూ కలుగుతున్నాయి. ఇతరుల పాపాలను గణించుకుంటూ తద్వారా తనలోని లోపాలు తగ్గినట్లుగా భావించసాగాడు ఇల్యా.

ఇహ, ఇల్యాకి న్యాయ సమ్మతంగా ఉన్న విషయం ఒక్కటీ కనిపించలేదు. ఎటు చూచినా అన్యాయం. అక్రమం. పెట్రూకాను మోసగాడని అనని వ్యక్తి ఆ ఇంటి మొత్తంమీద ఒక్కడూ లేడు.

అందరూ అతన్ని దొంగని నిందించేవారే. కానీ ఈ మాటను బహిరంగంగా అతని మొహాన్నే అనడానికి అంతా భయపడతారు. చాటుగా ఇష్టం వచ్చినట్టు నిందిస్తారు. కానీ తీరా ఎదురుపడేసరికి ఎంతో గౌరవంగా మాట్లాడుతారు.

ముసలిదైన మటిజ్టా తాగినప్పుడు అందరూ దాన్ని కొట్టితిట్టి గేలిచేస్తారు. ఒకరోజున వంటవాడు దాని మీద గంజికూడా పోశాడు.

కానీ అంతా దానిచేత నానా చాకిరీ చేయించుకుంటారు. అదీ కిమ్మనకుండా అందరూ అడిగిన పనులుచేసి పెడుతుంది. కానీ దానికి అందరూ ఇచ్చే బహుమతులు తిట్లూ, కొట్లూ, చీవాట్లూ.

పెళ్ళిపాక భార్య అవిటిది. దానికి స్నానం చేయించాలంటే మటిజ్టా రావాలి. పెట్రూకా టీ దుకాణాన్ని ప్రతి సెలవు రోజున అదే కడగాలి. కానీ పెట్రూకా దానికి ఒక్క కానీకూడా ఇవ్వడు. తెరంతి పట్టెలూ, లాగులుకూడా అదే ఉతికి ఇవ్వాలి.

ఇంతకు ఇన్ని విధాలుగా చాకిరీ చేయించుకుని తిట్లూ చివాట్లూ బహూకరించినా, మటిజ్టా మారుమాటాడేదికాదు. పిల్లలనూ, జబ్బు మనుష్యులనూ ఎంతో ఆప్యాయంగా ఆదుకుని సేవచేసేది.

ఇక పెర్ఫిష్కా విషయం — ఆ ఇంట్లో ఎవరూ పెర్ఫిష్కాకు పెద్ద ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపించలేదు ఇల్యాకు. అతని మాటలను అంత పట్టించుకునేవారు కాదు. కానీ అతను తాగి తన గిటార్‌పై 'అప్పనా మనా తనా' లాటి గీతాలు పాడుతూ ఉన్నప్పుడు మటుకు అంతా అతని చుట్టూ చేరేవారు. కానీ అతను హృదయంలేని వ్యక్తికాదు. పైగా ఎంతో ఆర్ద్ర హృదయుడుకూడా. నేడమెట్లు దిగలేని తన అవిటి భార్యను క్రిందికి మోసుకుని వస్తున్నప్పుడు, ముద్దుల వర్షం కురిపిస్తూ తన చిన్నారి కూతురిని జోలపాడుతూ నిద్దర పుచ్చినప్పుడు, చూడాలి అతని ఆర్ద్రత. అతని చిన్నారి కూతురంటే అతని ముద్దూ ముచ్చటా ఇంతా అంతా అని చెప్పడానికి వీల్లేదు. వంట చెయ్యడం, ఇల్లు అలంకరించడం, అన్నీ తాను స్వయంగా ఆ అమ్మాయికి నేర్పేవాడు.

వడ్రంగి జైలుకు వెళ్ళిన తరువాత అతని కొడుకు పావెల్ ఆలనా పాలనా చూసే బాధ్యతను నెత్తిన వేసుకున్న వ్యక్తి ఒక్క పెర్ఫిష్కా మాత్రమే.

పావెల్‌ను తన ఇంట్లోనే ఉంచుకున్నాడు. ఇల్లు ఊడవడం, నీళ్ళు తెచ్చిపెట్టడం బజారుకెళ్ళి ఏవైనా కూరలూ నారలూ తేవడం - ఇలా పనులు చేస్తూ వచ్చాడు పావెల్. ఆదివారాలు, సెలవులూ వస్తేచాలు పెర్ఫిష్కా తప్ప తాగేవాడు. తాగితేచాలు ఇహలోకస్మారకం లేకుండా తన ఇష్టం వచ్చినట్లు సంచరించేవాడు. మరుసటిరోజున కైపుతీరి ఇహంలో పడగానే పసిపిల్లవాడిలాగా భార్యవద్దకు వెళ్ళి, "పిల్లా! దున్యా! నా మీద కోపం వచ్చింది కదూ? నిజంనా నాకు

తాగాలని బుద్ధేసి తాగానని అనుకుంటున్నావా? ఛీఛీ! అలా అనుకోకు. ఏదో కాస్త మార్పుకోసం గొంతు తడుపుకున్నాను. వారమంతా చాకిరీ. మరి ఒక్క సారయినా మార్పు ఉండొద్దూ"- అని బ్రతిమాలుకో సాగేవాడు.

"అబ్బెబ్బె, నాకేం కోపం? నాకు జాలి" అని భార్య సమాధానపడేది.

"నన్ను ఈశ్వరుడు ఎత్తుకుని వెడితే ఎంత బాగుండును: అవిటి దాన్ని, బ్రతికెందుకు?" అని తన్నుతాను నిందించుకునేది.

ఇలా నిందించుకున్నప్పుడల్లా పెట్రూష్కాకు మండిపోయేది.

"అలా మాట్లాడకే, అబ్బబ్బ నీకూ నాకూ ఇద్దరికీ తగిలినట్టుంది. ఇవ్వాళో రేపో ఇల్లు మారుస్తాను. ఈ మురికి కూపంలోనుంచి బయటపడదాం. బాగా గాలి వెల్తురూ వచ్చే కొంపతీసుకుంటాను"- అనేవాడు.

పెట్రూష్కా జీవితంలో మలుపులేమీ లేవు. ఇల్యాకు అతని జీవితం అతిసాధారణంగా కనుపించింది. అతని జీవయాత్ర జరగడం కష్టసాధ్యమే. కాని అతను జీవితాన్ని అంతగా పట్టించుకునేవాడు కాదు. ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ హాయిగా గడిపేవాడు.

పెట్రూకా రాత్రనక పగలనక అస్తమానం టీ దుకాణంలో కూచుని పేకాట ఆడుతూ ఉంటాడు. వెయిటర్ల మీద చిరుబుర్రు లాడుతూ కేకలేస్తూ ఉంటాడు. ఎరుమెయ్ తాత

చనిపోయిన తరువాత సారాకొట్టు పనంతా తెరెంతికి ఒప్ప చెప్పాడు. ఎప్పుడూ ఇంటిముందు పచార్లు చేస్తూ ఇల్లు ఏకోణంలోంచి ఎలా కనుపిస్తూ ఉందో పరీక్షించడం తప్ప అతనికి మరో పని లేదు.

ఇల్యా మటుకు తన తోటి మానవులను పరిశీలించడం మానుకోలేదు. వారిని పరిశీలించే కొద్దీ వారిపట్ల అతని ఏవగింపు మరింత ఎక్కువవుతూ ఉన్నది.

మనుష్యులను గురించి, వారి స్వభావాలను గురించి తన ఉద్దేశాలను ఎవరితోనైనా మాట్లాడాలని ఇల్యా అభిలాష. కాని ఈ విషయాలను తన బాబాయ్ తెరంతితో మాట్లాడడానికి అతనికి ధైర్యంచాలడం లేదు. ఎరుమెయ్ తాత చనిపోయాక, తనకూ తన బాబాయికి మధ్య ఏదో అస్పష్టమైన అగాధం ఏర్పడింది.

పూర్వంలాగా తన బాబాయితో చనువుగా ఉండలేక పోతున్నాడు. ఇహ, పోనీ, యాకొవ్‌ను అడుగుదామా అంటే అతనూ తనలాంటి వాడే. ఇతరులతో కలిసి మెలిసి తిరిగే వ్యక్తి కాదు.

యాకొవ్ కూడా ఇప్పుడు అదోలా ఉంటున్నాడు. తాత చనిపోయాక అతనూ దిగులుగా ఉన్నాడు.

'తాత బ్రతికి ఉండగా జీవితం ఎంత బావుండేది! తాత ఎన్ని కథలు చెబుతూవచ్చాడు! ఇప్పుడు కథ చెప్పేవారే లేరు' అనే వాడు యాకొవ్!

ఒకరోజున ఇల్యాతో యాకొవ్ 'నీ కొకటి చూపనా?' అన్నాడు.

'అవుతే నీవు ఎవరితోనూ చెప్పనని ఒట్టేసుకోవా లబ్యాయ్ !' అన్నాడు.

'సరే' నన్నాడు ఇల్యా.

యాకొవ్ ఇల్యాను పెరట్లో ఉన్న నిమ్మచెట్టు దగ్గరికి తీసుకుని వెళ్ళాడు. నిమ్మచెట్టుకు ఒక చిన్న తొర్రలో భగవంతుడి విగ్రహం ఉన్నది. విగ్రహంముందు దీపారాధన వెలుగుతూ ఉన్నది.

'ఇదేమిటి ?' అని అడిగాడు ఇల్యా.

'ఒక చిన్న దేవాలయం' అన్నాడు యాకొవ్.

'ప్రతిరోజూ రాత్రి రహస్యంగా వచ్చి నేనిక్కడ ప్రార్థిస్తూ ఉంటాను' – అన్నాడు యాకొవ్.

ఇల్యాకు యాకొవ్ దేవాలయం ఎంతో నచ్చింది. కాని అందులో ఏదైనా ప్రమాదం ఉన్నదేమోనని అనుమానం కలిగింది.

'ఎవరైనా చూస్తే ఏమీ అనుకోరా ? మీ నాన్న చూస్తే నిన్ను తంతాడేమో ?' అన్నాడు ఇల్యా.

'రాత్రిపూట, అంతా నిద్రపోయాక వెళ్ళి ప్రార్థిస్తాను. పగటిపూట మనం ప్రార్థిస్తే మన ప్రార్థనలు ఈశ్వరుడికి వినిపిస్తాయా ?' అన్నాడు యాకొవ్.

'ఏమో మరి ?' అన్నాడు ఇల్యా.

'నీవూ వచ్చి నాతో కలిసి ప్రార్థిస్తావా ?' అని అడిగాడు యాకొవ్.

'నీవు ప్రార్థించడం యెందుకోసం ?'

'ఊరికేనే.'

'నేనూ వస్తాను.'

ఇనువును కుర్రాళ్ళు అర్ధరాత్రి సమయంలో నిద్ర లేచి భగవంతుణ్ణి ప్రార్థించాలని నిశ్చయం చేసుకుని పడుకున్నారు, కాని నిద్ర లేవలేకపోయారు.

ఇల్యా మనస్సులో అనేక భావాలు చెలరేగసాగాయి. అతను నిమ్మ చెట్టు తోపులోని దేవాలయం విషయాన్ని పూర్తిగా మరచిపోయాడు.

పావెల్ కూడా చాలా మారిపోయాడు. పూర్వం కంటె చిక్కిపోయాడు. ఇప్పుడు ఎంచాతనో కాని కొంచెం దిగులుగా కనుపిస్తున్నాడు.

ఇల్యా, యాకొవ్ బడికి వెడుతూ ఉన్నారు. పావెల్ వారిని బడిలో ఏ ఏ పాఠాలు చెబుతున్నారని ప్రశ్నించాడు. తను చదువుకోనందుకు దిగులుపడ్డాడు. అసూయ కూడా కలిగింది. 'నేనూ మీలాగానే చదువుంటాను చూడండి – ఎక్కడికైనా వెళ్ళిపోయి' అన్నాడు పావెల్.

నిజంగానే కొద్ది రోజులకు పావెల్ ఎక్కడికో వెళ్ళిపోయాడు.

పావెల్ వెళ్ళిపోయి కొద్ది రోజులు కావస్తూంది.

ఆ రోజు ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తూ ఉన్నది. ఇల్యా ఆకాశం వంక చూస్తూ కిటికీవద్ద కూచున్నాడు. ఎంతసేపు అలా కూచున్నాడో అతనికే తెలీదు. పావెల్ జ్ఞాపకం

వచ్చాడు. అతనికి ఇప్పుడు పావెల్ మంచిచెడ్డలు జ్ఞాపకం రాలేదు. పావెల్ మాత్రమే జ్ఞాపకం వచ్చాడు. పావెల్ అంటే ఏదో అవ్యక్తమైన జాలి ఇల్యా జాలిగుండెలో కలచి వేయసాగింది.

వర్షం కురుస్తూనే ఉన్నది. వర్షానికి ఇల్లంతా ఫెళ్ళు ఫెళ్ళుని కూలిపోతుందేమో అనిపించింది.

కాని ఇల్లు కూలిపోలేదు. సారా కొట్టు పెట్రూకా ఆ ఇంటిని కొన్నాడు. ఇల్లుకొని రెండు మూడు రోజులు ఇంటిని మరమ్మత్తుచేశాడు. కొత్త వేళ్ళు పాతుకున్న వృక్షంలా ఆ ఇల్లు ఇప్పుడొక కొత్త శోభతో కనుపించ సాగింది.

"పై మరమ్మత్తులు ఎన్ని చేస్తేనేం? ఇల్లు యథాతథంగానే ఉంది. పాత కొంపను కొత్త కొంప చెయ్యడం మానవుల తరమా?' అన్నాడు పెర్ఫిష్కా.

పెర్ఫిష్కా అన్న ఈ మాటకు ఇల్యాకు నవ్వు వచ్చింది. నిజమే. పాతకొంపను కొత్త కొంప చెయ్యడం ఎవరితరం!

ఇల్యాకు మధ్య మధ్యలో పావెల్ జ్ఞాపకంవస్తున్నాడు. 'ఇప్పుడు పావెల్ ఎక్కడున్నాడో? ఏం చేస్తున్నాడో?' — అనుకునేవాడు.

ఆ ఇంటిలో జీవితం కూడా నానాటికి దిగజారిపోసాగింది. ఇప్పుడు పూర్వం ఉన్న నిమ్మచెట్టు లేదు. నిమ్మ చెట్టును కొట్టివేశారు. పూర్వంలాగా వసారాలో పిల్లలంతా చేరి చక్కగా ముచ్చట్లు చెప్పుకోవడం లేదు. ఇప్పుడు తెరంతి సారాకొట్టు వెనకాల ఒక చిన్నగదిలో కాపరం

ఉంటున్నాడు. పగలూ రాత్రీ అతనికి సారా కొట్లోనే పని. ఒకే చోక్కా మాసిపోయిన శరీరాన్ని అంటిపెట్టుకుని ఉన్నది. ఇల్యా కోసం వున్ని కోటు కొన్నాడు. బూట్లు, టోపీ కూడా కొన్నాడు. ఇవి ధరించినప్పుడల్లా ఇల్యాకు ఎరమెయ్ తాత జ్ఞాపకం వచ్చేవాడు.

రోజులు బరువుగా దొర్లిపోతున్నాయి. ఇల్యాకు ఒకొక్కసారి తన గ్రామ జీవితమే పట్నం జీవితం కంటె హాయిగా ఉన్నదా అనిపించేది. అక్కడ అడవులూ-పొలాలూ-చెరువులూ - ఎంత అందంగా ఉంటాయి! జీవితం మెల్లగా చల్లగా సాఫీగా సాగిపోతుంది. పావెల్ ఏమైనాడు ? ఎక్కడికి వెళ్ళాడు ? అతనూ తన తాతయ్యలా అడవులకు వెళ్ళి తపస్సు చేసుకుంటూ ఉన్నాడేమో అనిపించేది ఇల్యాకు.

పట్నం జీవితంలో ఒకటే సందడి. కల్లోలం. ప్రజలు ప్రవాహంగా పరుగిడుతూ ఉంటారు. అరుస్తారు. కేకలేస్తారు. ఒకరి గొడవ ఒకరికి పట్టదు. ఇహ బడిపిల్లలూ ఇంతే. ఒకటే అల్లరి. మోసగాళ్ళ లెక్క చెప్పడానికే వీల్లేదు. పావెల్ వంటి రాతుసులూ ఉన్నారు. భార్యల్ని చావమోది ప్రాణాలు తీస్తారు. పెర్ఫిష్కా, తెరంతిల వంటి అమాయకులూ, తామసులూ ఉన్నారు.

ఒకనాటి ఉదయం ఇల్యా పుస్తకాలు సర్దుకుని బడికి పోబోతూఉన్నాడు. పెర్ఫిష్కా కళ్లు నులుముకుంటూ వచ్చి సారా కొట్టునద్ద నిల్చున్నాడు. అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి. తెరంతి అతని వంక చూచి రెండు గ్లాసులు సారా

పోసి, 'ఏమిటి కళ్ళలా ఎర్రగా ఉన్నాయి ?' అని ప్రశ్నించాడు.

'మా ఆవిడ చనిపోయింది !' అన్నాడు పెర్ఫిష్కా.

'అయ్యో ! భగవంతుడా ! ఆవిడ ఆత్మ శాంతి పొందుతుంది గాక !' అన్నాడు తెరంతి.

ఇల్యా మెట్లుదిగి వెడుతూ ఒకమాటు పెర్ఫిష్కా గది లోకి తొంగిచూచాడు. గది చీకటిగా ఉంది. మృతురాలిని చూడడం కోసం వచ్చిన జనం పోగై ఉన్నారు.

ఇల్యాకు భయం వేసింది. బరువుగా అడుగులు వేసుకుంటూ బడికి పోయాడు.

ఇల్యా బడినుంచి తిరిగి వచ్చేసరికి చాలా ఆలస్యమైంది. పెర్ఫిష్కా ఒకమూల కూచుని విరహగీతాలు ఆలపిస్తూ ఉన్నాడు. 'అంతా నన్ను ఆడిపోసుకున్నారు. ఒరేయ్ తాగు బోతా ! పో, అని తోలేశారు.' అని తనలో తాను ఏదో గొణుక్కుంటూ వున్నాడు.

'నన్ను ఒక గుక్కెడు సారా తాగనివ్వండి. నన్ను జీవితాన్ని ఆస్వాదించ నివ్వండి' అంటున్నాడు పెర్ఫిష్కా. అతని ముఖంలో దిగులు కనిపించడం లేదు. ఇల్యా అతనివంక చూచాడు. ఇల్యాకు ఒక విధమైన అసహ్యాం కలిగింది.

భార్య చనిపోయి ఒకరోజు కూడా గడవలేదు. భర్త హాయిగా తాగి గల్లంతు చేస్తున్నాడు. 'ఇలాంటిపాపిని భగవంతుడు శిక్షించడా ?' అనుకున్నాడు ఇల్యా.

'చూచావా, పెర్ఫిష్కా ఎంతటి రాక్షసుడో ! భార్య గతించి ఒక రోజున్నా కాలేదు. హాయిగా తాగి పాటలు పాడుతూ ఉన్నాడు. అన్నాడు' ఇల్యా యాకొవ్‌తో.

'పోనీ ! వాడు ఎలా చస్తే నాకేమిటి ?' అన్నాడు యాకొవ్.

యాకొవ్‌లో ఇటీవల కొత్త మార్పు కనుపిస్తూ ఉన్నది. పూర్వంలాగా ఇల్యాతో ఆడుకోవడానికి రావడం లేదు. 'ఇంట్లో కూచుని చదువుకుంటూ ఉన్నాడేమో' అనుకున్నాడు ఇల్యా. కాని యాకొవ్ అలాంటి దేమీ చేస్తున్నట్లు కనుపించడంలేదు. రోజు రోజుకూ అతని చదువు తీసికట్టుగానే ఉంది. ప్రతిరోజూ బళ్ళో మాస్టరు చివాట్లేస్తున్నాడు.

'ఏమిట్రా ఇలా ఉంటున్నావు ? నాతో స్నేహం చెయ్యడం నీకు ఇష్టం లేదా ఏమిటి ?' అని అడిగాడు ఇల్యా

'అదేమిట్రా ?' - అన్నాడు యాకొవ్.

మిత్రులిద్దరూ ఇళ్ళుచేరుకున్నారు. యాకొవ్ ఒక ఎర్ర అట్టల పుస్తకం తీసుకునివచ్చాడు. ఇల్యా అతని ప్రక్కనే కూచున్నాడు. యాకొవ్ పుస్తకం తెరిచి చదవడం ప్రారంభించాడు.

'ఆకాశమంత ఎత్తుకొండ. కొండ ప్రక్కనే లోయ. లోయ మధ్యలో కోట. కోటకు ఇనప తలుపులు. రాజకుమారుడు గుర్రం పరుగు తీయించాడు. బల్లెంతో తలుపును బదాబదలు చేశాడు'

'ఎవరీ వీరుడు ?' - ప్రశ్నించాడు ఇల్యా.

"ఒక రాజకుమారుడు ప్రేమించిన యువతిని ఒక సర్పరాజు దొంగిలించి కోటలో దాచాడు. రాజకుమారుడు దండు వెడలాడు" అన్నాడు యాకోవ్.

కుర్రాళ్ళు ఇద్దరూ కలిసి ఆ పుస్తకాన్ని చదవసాగారు. ఆ కొత్త వింత కథ చదివినంతసేపూ వాళ్ళకి ఏవేవో నూతన లోకాలకు యాత్ర చేసినట్లనిపించింది. ఆ లోకం తీరే వేరు. ఆ లోకంలో ఇలా తాగుబోతులూ, రోగిష్టి వాళ్ళూ కనిపించరు. అన్నీ రాజమహాళ్ళు, బంగారువన్నెల చిలుకలు. రాజకుమారులూ రాజకుమార్తెలూను.

కుర్రాళ్ళు కళ్ళు ఇంతింత చేసుకుని పుస్తకం తదేకంగా చదువుతూ ఉన్నారు. ఒక ప్రక్కనుంచి పెర్ఫిష్కా పాటలు వినిపిస్తూ ఉన్నాయి. ఈ ఒక్క పుస్తకంతో ఇల్యా సరనా సక్తి ఆగిపోలేదు. ఇలాంటివే అనేకం వింత వింత కథల పుస్తకాలు తెచ్చి చదువసాగాడు. ఇప్పుడు అతని మనస్సులో రాజకుమారులూ, రాజకుమార్తెలూ నీడల్లాఆడుతూ ఉన్నారు. ఇలా రోజులు గడిచిపోతున్నాయి. ఒక రోజున పెర్ఫిష్కకు పోలీస్ స్టేషన్ నుంచి కబురు వచ్చింది. అతనికి పోలీస్‌స్టేషన్ అంటే భయం. ముందు బడికి వెళ్ళని మొండి పిల్లాడిలా మారాం చేశాడు. కానీ తరువాత వెళ్ళక తప్పింది కాదు. పోలీస్ స్టేషన్‌కు వెళ్ళినవాడు ఇట్టే తిరిగి వచ్చాడు. వస్తూ పావెల్‌ను కూడా తీసుకుని వచ్చాడు.

"చూడండిరా నాయనలారా! పావెల్‌గాడు తిరిగి వచ్చాడు. ఎంత సాహసం చేశాడో చూడండి! కాలినడకన పెన్జా పట్నానికి యాత్ర చేసి వచ్చాడు" అన్నాడు పెర్ఫిష్క-

"ఈ పావెల్‌గాడు వట్టి తిరుగుబోతుగా ఉన్నాడు. వీడికి నాలుగు దెబ్బలు అంటిస్తేనే కానీ ఇంటి పట్టుపడిన ఉండడు" అన్నారు అక్కడ చేరిన గుంపులో ఒకరు.

"ఏడిశాడు! తిరిగితే తిరగనివ్వండి" అన్నాడు పెరూ్ఫషా.

తేరంతి కల్పించుకుని, "ఒకేయ్ అబ్బాయ్! ఇలా రారా! ఈ రొట్టెముక్క పుచ్చుకో" అన్నాడు.

కుర్రాడు మారు మాట్లాడకుండా రొట్టెముక్క పుచ్చుకుని నమలడం మొదలెట్టాడు.

ఈ దృశ్యాన్ని చూస్తూ అక్కడే నుంచున్న ఇల్యా పావెల్‌ను పిలిచాడు.

పావెల్ నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఇల్యా దగ్గరకు వెళ్ళాడు.

"ఏమిటి పని ?" పావెల్ అడిగాడు

"కూర్చోవోయ్ మహా బెట్టుసరి!" అన్నాడు ఇల్యా.

"చదువు ముగిసిందా ?" అడిగాడు పావెల్.

"ఉహుం, ఇంకా కొన్నాళ్ళు చదవాలి. నీకో మరి? ?" అడిగాడు ఇల్యా.

"నా చదువు అప్పుడే అయిపోయింది."

"నిజంగా ! ఎక్కడ చదివా వేమిటి ?"

"ఖైదీలతో కలిసి జైలుకు వెళ్ళాను. వాళ్ళే చదువు నేర్పారు."

"జైలే! అమ్మయ్యో! అక్కడఅసహ్యంగాఉండదూ?"

"నేను అనేక జైళ్ళు చూశాను. పెద్ద మనుష్యులు కూడా ఉంటారు."

"జైళ్ళలో చదువు చెప్పుతారా ?"

"ఓ! నేనే అడిగాను నాకు చదువు చెప్పమని. చెప్పారు."

"నీకు చదవడం, వ్రాయడం వచ్చా ?"

"వ్రాయడం అంతగా రాదుగానీ చదవడం మాత్రం బాగా వచ్చు. అనేక పుస్తకాలు చదివాను"

"నేనూ యాకొవ్ కలిసి అనేక పుస్తకాలు చదివాం."

యాకొవ్ కూడా అక్కడికి వచ్చాడు. పావెల్‌ను చూచి బిగ్గరగా నవ్వసాగాడు.

"ఏమిట్రా నవ్వుతున్నావ్ ?" అడిగాడు పావెల్.

"ఇన్నాళ్ళూ ఎక్కడికి వెళ్ళావోయ్ ?"

"నే నెక్కడికి వెళ్ళానో చెప్పనా? జడుసుకోకు."

"ఏం ? అది యమలోకమా?"

"ఏమిటనుకున్నావ్? వీడు చదువు కూడా నేర్చుకున్నాడట!" అన్నాడు ఇల్యా యాకొవ్‌తో.

"ఓహో ! ఎన్ని విషయాలు చూచా ననుకున్నారు ! ఎన్ని కష్టాలు పడ్డాననుకున్నారు ! ఒకసారి రెండురోజులు వరసగా పస్తున్నాను. ఒంటరిగా ఒకరాత్రి అడవిలోనే ఉండి పోయాను" అని చెప్పసాగాడు పావెల్.

"నీకు భయం పుట్టలేదా ?"

"భయం అంటా వేమిటి ? కజన్‌లో అయితే ఇంచు మించు చనిపోయాననే అనుకున్నాను. కజన్‌లో ఒక కవిగారి

శిలా విగ్రహం ఉన్నది. ఎలా ఉంటాననుకున్నావేమిటి ? ఎంత ఎత్తు ! చూస్తేనే ఆశ్చర్యపోతావు. నేనూ కవిత్వం రాస్తానోయ్" అలా అని పావెల్ ఈ క్రింది పద్యం చదివాడు.

"పెద్ద మనుషులు
చక్కగా ముస్తాబు చేసుకుని
వీధిలో నడుస్తున్నారు.
వారిని ఒక [illegible]ధర్మం చెయ్యమను.
'పో రా పో!' అంటారు"

ఈ పద్యం చదివి పావెల్ దిగులుగా తల వాల్చుకున్నాడు.

"ఇదీ కవిత్వం మంటావా ?" అన్నాడు ఇల్యా ధైర్యం చేసి.

"యతి ప్రాసలు కనిపించడం లేదటోయ్ ?" అన్నాడు పావెల్.

పావెల్ మరికొన్ని పద్యాలు చదివాడు. యాకోవ్ కళ్ళు పెద్దవి చేసుకుని ముగ్ధుడై విన్నాడు. యాకోవ్ శ్రాగత్త విన్నప్పుడు పావెల్ చెక్కిళ్ళు సిగ్గుతో ఎర్రవారాయి.

పావెల్ ఇప్పుడు పెర్ఫిష్కా ఇంట్లోనే ఉంటున్నాడు. కాలం మెల్లిగా సాగుతూ ఉన్నది. పెర్ఫిష్కా ఇప్పుడు ఇంట్లో ఉండడంలేదు. ఎప్పుడూ తాగి తిరుగుతూ ఉన్నాడు. తన డబ్బంతా ఖర్చు చేసుకున్నాడు. అక్కడా ఇక్కడా తిరిగి ఎవరో ఒక ఆసామి దగ్గర చాకిరీచేసి పొట్టపోసు కుంటున్నాడు.

పాటకజనం అతనంటే పడిచస్తారు. వారికి పాటలు పాడి వినిపిస్తాడు. కథలల్లి చెప్పి వారిని ఆనందపరుస్తాడు.

తన చేతిలో నాలుగు రాళ్ళు పడినప్పుడు ఇంటికివచ్చి వాటిలో సగం తన కుమార్తె చేతిలో ఉంచుతాడు. ఇదే అతనుపడే సంసార తాపత్రయం.

మాషా ఇప్పుడు పెరిగి పెద్దదైంది. పొడుగ్గా రెపరెప లాడుతూ రెట్టలాగా కనిపిస్తూ ఉంది. కళ్ళు విశాలంగా అగాధంగా కనుపిస్తూ ఉన్నాయి. ఇంటి విషయంలో ఎంతో శ్రద్ధ వహిస్తూ ఉన్నది. ఇల్లు ఎంతో ముచ్చటగా అలంకరిస్తుంది. ఒక్క క్షణంకూడా ఏమారదు. పగలంతా ఏదో ఒకపని చేస్తూనే ఉంటుంది. ఏపనీ లేనప్పుడుకూడా కిటికీ దగ్గర కూచుని పాతబట్టలు కుట్టుకుంటూ ఉంటుంది.

అప్పుడప్పుడు మటిల్డా మాషాను చూడాలనివచ్చేది. టీ, చక్కెర తెచ్చి ఇచ్చేది. ఒకసారి మాషాకు నీలిరంగు దుసులను కొనిచ్చిందికూడా. మటిల్డా వచ్చినప్పుడు మాషా ఎంతో వినయ విధేయతలతో పెద్దింట ఆడబడుచులా ప్రవర్తించేది.

మటిల్డా మాట్లాడుతూంటే వినడమంటే మాషాకు ఎంతో ప్రీతి. ఇద్దరూ కూచుని గంటల తరబడి మాట్లాడు కునేవారు. మటిల్డా తాగుబోతు పెర్సిస్కాను ఆడిపోసేది.

మటిల్డాకూడా తాగేది. కాని వట్టి అన్యాయకురాలు. మాషా మటిల్డా ఒడిలో కూచుని చిన్నపిల్లలే ఎన్నెన్నో కబుర్లు చెప్పేది.

మాషాపట్ల యాకొవ్‌కుకూడా భక్తిశ్రద్ధలు ఎక్కువయినాయి. మాషాకు ఎప్పుడూ ఏదో ఒకటి కొనితెచ్చేవాడు. టీ, చక్కెర, రొట్టెముక్కలు తెచ్చిపెట్టేవాడు. అప్పుడప్పుడు చిల్లర డబ్బులిచ్చేవాడు. ఎందుకని మాషా అడిగేదికాదు. యాకొవ్ చెప్పనూ చెప్పేవాడుకాదు.

ఇల్యాకుకూడా మాషాతో అనుబంధం నానాటికీ హెచ్చుకాసాగింది. మాషాకూడా తనలాగానే తల్లిలేని బిడ్డ. మాషా తల్లిలేని పిల్లకావడంవల్ల పెద్దవాళ్ళలాగా అన్ని పనులూ తాను స్వయంగా చేసుకునేది. ఇల్యా ఎప్పుడూ ఏదో ఒక కథ చెప్పి మాషాను నవ్విస్తూ ఉండేవాడు. ఒక్కోసారి మాషా నవ్వేదికాదు. అప్పుడు ఇల్యాకు కోపం వచ్చేది. 'వెర్రి మొహం!' అనేవాడు ఇల్యా.

'అబ్బో! నీ మొహం బావున్నట్టు!' అనేది మాషా.

ఇద్దరూ తగాదా పడేవారు. మాషాకు ఇట్టే పట్టరాని కోపం వచ్చి ఇల్యామీదపడి రక్కబోయేది. ఇల్యా నవ్వుతూ తప్పించుకుని పరుగుపుచ్చుకునేవాడు.

ఒకసారి ముగ్గురూ పేకాటలో కూచున్నారు. మాషా దొంగాట ఆడింది. ఇల్యా గ్రహించాడు. "మాషా! ఒసేవ్! యాకొవ్ ప్రియురాలా!" అన్నాడు. కొత్తగా నేర్చుకున్న మరో బూతుమాటకూడా ప్రయోగించాడు.

యాకొవ్ అతని పక్కనే కూచుని ఉన్నాడు. మొదట్లో ఆ మాటకు యాకొవ్ నవ్వాడు. కానీ తరువాత మాషా ముఖంలో మార్పు రావడం చూచి అతనికి ఎక్కడలేనీ కోపం వచ్చింది. ఇల్యా మీదికి సింహం దూకినట్టు దూకి

ముక్కు మీద బాదాడు. "ఏరా శృతిమించి రాగానపడిందే!" అంటూ ఇల్యా కూడా యాకొవ్‌తో యుద్ధానికి దిగాడు.

"వాడు నట్టి రాక్షసుడు! ఖైదీ కొడుకు! వాడి జోలికి పోకు" అన్నది మాషా.

ఇల్యాకు మొదట ఎంతో కోపం వచ్చింది. కానీ తరువాత అంతకు మించిన పశ్చాత్తాపం కలిగింది. మెట్లు దిగి అక్కడనుంచి వెళ్ళిపోయాడు. వారికి కోపం కలిగించినందుకు వాపోతూ కాసేపు అటూ ఇటూ పచార్లు చేశాడు.

యాకొవ్, మాషా మళ్ళీ పేకాటలో కూచున్నారు. ముక్కలు ముఖానికి అడ్డం పెట్టుకుని యాకొవ్ నవ్వుతున్నట్టున్నాడు. ఇల్యాకు ఒంటరితనం భరించరానిదిగా తోచింది. ఒకటి రెండు సార్లు అటూ ఇటూ పచార్లుచేశాడు. తరువాత ఒక్కమాటుగా గిరుక్కున తిరిగి వాళ్ళు పేకాట ఆడుతూ ఉన్న చోటికి వెళ్ళాడు.

"నన్నూ పేకాటలోకి రానివ్వండి! ఈసారి ఇహ పోట్లాడనుగా– ఒట్టు!" అన్నాడు.

మాషా కిలాకిలమని నవ్వింది.

"సరే కూచో" అన్నది.

అప్పుడప్పుడు పావెల్ కూడా వారివద్దకు వచ్చేవాడు. నలుగురూ కూచుని ప్రేమగాథలు వ్రాసిన పుస్తకాలు చదివేవారు. పావెల్, యాకొవ్ మాషాల వంక చూచి చిరునవ్వు నవ్వి, "అబ్బాయ్ యాకొవ్! అమ్మాయ్ మాషా! మీ

రిద్దరూ పెళ్ళికోడుకులు. పెళ్ళికూతురూను. మీకు పెళ్ళి చెయ్యనా?" అనేవాడు నవ్వుతూ.

"ఏడిశావ్! నోరు మూసుకోవోయ్" అనేది మాషా.

నలుగురు మిత్రులూ పకాలున పగలబడి నవ్వేవారు.

పావెల్ వారికి తన యాత్రలను గురించి చెప్పేవాడు.

"కొన్ని చోట్లకు పాస్‌పోర్టు లేకుండా వెళ్ళడానికి వీలుండదు. అప్పుడు గమ్మత్తు చేసేవాణ్ణి. పోలీసు కనిపించగానే ఏదో పనిమీద ఉన్నట్టు పరుగుతీసేవాణ్ణి. లేక ఎవరో పెద్దమనిషిని అంటిపెట్టుకుని ఉండేవాణ్ణి. నేనూ ఆ పెద్దమనిషి తాలూకువాణ్ణని అనుకునేవారు. నేను పొలాలవెంట వెళుతూ ఉన్నప్పుడు అక్కడుండే రైతులు నన్ను పిలిచేవారు. 'అబ్బాయ్! పరదేశీ! ఇలా రా' అనేవారు. నాకు తినడానికి, తాగడానికి ఎన్నెన్నో ఇచ్చేవారు. అబ్బ! ఒకోక్కసారి నాకు ఎంత ఆకలేసేది అనుకున్నారు!" అని తన యాత్రల పురాణాలు వినిపించేవాడు పావెల్.

కొన్నాళ్ళకు పావెల్ మళ్ళీ మాయమయ్యాడు. ఎక్కడికి వెళ్ళాడని వెదికి ఆరా తీయగా దూరంగా పట్నానికి ఆవల ఉన్న ఒక ప్రెస్సులో పని చేస్తున్నాడని తెలిసింది. ఈ వార్త విన్నప్పుడు ఇల్యాకు కూడా ఎక్కడికైనా వెళ్ళి పనినేర్చుకోవాలని అనిపించింది.

"చూడు మన బ్రతుకులు ఇక్కడే తెల్లవారి పోతాయేమో!' అన్నాడు యాకొవ్‌తో.

ఇలా ఉండగా ఒకరోజు ఉదయం తెల్లారకట్టనే తెరంతి ఇల్యాను నిద్రలేపాడు.

"అబ్బాయ్! త్వరగా లేచి స్నానం చెయ్యరా పనుంది" అన్నాడు.

"ఏమిటిబాబాయ్? ఎక్కడికి వెళ్ళా?" అని అడిగాడు ఇల్యా.

"చేపల దుకాణంలో నీకు పని కుదిర్చాను. వెళ్ళాలి" అన్నాడు తెరంతి.

ఇల్యాకు పనిచెయ్యాలని ఎంత అభిలాష ఉన్నప్పటికీ ఈ ఇల్లువిడిచి వెళ్ళాలంటే ఎంతో దిగులు కలిగింది. ఒకప్పుడు తను ఎంతో అసహ్యించుకుంటూ వచ్చిన ఈ గది ఇప్పుడు శుభ్రంగా స్వర్గమందిరంలాగా కనిపించసాగింది. తనకు ఎంతో ప్రియతములైన యాకొవ్ మాషాలను విడిచి దూరంగా వెళ్ళాలన్నా కూడా ఇల్యాకు దిగులు వేసింది. ఇల్యా నిద్రలేచి స్నానంచేసి బట్టలు వేసుకున్నాడు. పనిలో కుదర డానికి బయలుదేరాడు. మాషా యాకొవ్‌లు సాగనంపడానికి వాకిటి దాకా వచ్చారు.

"ఇక సెలవా! మళ్ళీ తిరిగిరాక ఎప్పుడో?" అన్నది మాషా దిగులుగా.

"తప్పకుండా వస్తావుకదూ!" అన్నాడు యాకొవ్.

"ఏడిశావ్! రాక ఏమవుతాన్రా?" అన్నాడు ఇల్యా లోపలినుంచి ఉబికివస్తున్న దుఃఖాన్ని అణుచుకుంటూ.

ఇల్యాను పనిలో కుదర్చడానికి పెట్రూకా అతన్ని తీసుకుని వెళ్ళాడు.

దోవలో ఇలా చెప్ప సాగాడు: "అబ్బాయ్! నిన్ను స్టోగనీ అనే వ్యక్తి వద్ద పనిలో కుదుర్చడానికి తీసుకు వెడుతున్నాను. అతను చాలా పెద్ద మనిషి. నలుగురిలోనూ పలుకుబడిగల వ్యక్తి. పట్నంలో కౌన్సిల్ మెంబరుకూడా. వచ్చే ఏడాది మేయరు కావచ్చు. జాగ్రత్తగా పనిచేసి పేరు సంపాదించుకో!"

ఇల్యా స్టోగనీ రూపాన్ని ఊహాకట్టుకో సాగాడు. అతను తన ఎరమీా తాతయ్య లాగానే ఉంటాడేమో - సన్నగా పొడుగ్గా అనుకున్నాడు ఇల్యా.

తీరా, చేపల దుకాణం దగ్గరకువెళ్ళి చూసేసరికి స్టోగనీ అలా లేడు. స్టోగనీ బాగా భారీ మనిషి, పెదపొట్ట. అతన్ని చూడగానే ఇల్యాకు ఏం చెయ్యాలో తోచలేదు.

"అయ్యగారికి దణ్ణంపెట్టు" అన్నాడు పెట్రూకా.

ఇల్యా బిడియంగా నమస్కారం చేశాడు.

"ఏమిటోయ్ నీ పేరు? ఇల్యా కదూ! బావుంది. చూశావ్ అబ్బాయ్! ఒక విషయం గమనించు - నీకు ఈ లోకంలో నా అనేవాళ్ళు ఎవరూ లేరు కదూ? నేనే నీకు అన్నీ అనుకో- తల్లికాని, తండ్రికాని, బంధువులుకాని అన్నీ నేనే! ఇంతకన్న నీకు నేను మరేమీా చెప్పదలుచుకో లేదు" అన్నాడు యజమాని.

ఇల్యా ఈ మాటలను శ్రద్ధతో విన్నాడు. ఒక మాటు చేపల దుకాణాన్ని నలువైపులా కలయచూచాడు. పెద్దపెద్ద చేపలు వేలాడకట్టి ఉన్నాయి. ఎండుచేపలు బుట్టలకొద్దీ నింపి ఉన్నాయి. ఆ నాటినుంచీ ఇల్యా చేపలకొట్లో పని చేయడం

మొదలెట్టాడు. తొట్లలోనుంచి చేపలను తీయడం, ఎండ వేయడం, ముక్కలు కోయడం, తొట్లకు సరిపోయే లాగా మంచుగడ్డలను తరగడం, మొదలైన పనులు ఎన్నెన్నో నేర్చుకున్నాడు. ఒకసారి ఇల్యా పొరబాటున ఒక కూజా పగల కొట్టాడు. యజమాని అతని వంక నిశ్శబ్దంగా చూచాడు. "ఈ సారికి క్షమిస్తున్నాను. మళ్ళీ ఇలాంటి పని చేశావంటే చెవులు పిండేస్తాను" అని బెదిరించాడు యజమాని.

ఇల్యా జీవితం ఇలా సాగిపోతూ ఉంది. రోజూ ఉదయాన్నే లేవడం, ఇల్లంతా ఊడవడం, యజమానీ, అతని కుటుంబంలోని వారూ తొడిగే బూట్లు పాలిష్ చెయ్యడం మొదలైనవన్నీ చేసేవాడు. ఆ తరువాత దుకాణానికి వెళ్ళాలి. దుకాణాన్ని ఊడ్చి బాగు చెయ్యాలి. నడి జాముకు వెళ్ళి భోజనం చేసి వస్తాడు.

ఆ చేపల దుకాణంలో మరో గుమాస్తా ఉన్నాడు. అతను వట్టి బండమనిషి. రాక్షసుడిలాంటి వాడు. అతనికీ, ఇల్యాకు ఒక్క క్షణంకూడా సరిపడేదికాదు. ఎప్పుడూ ఇల్యాను ఏదో చివాట్లువేస్తూ ఉండేవాడు. అడుక్కునేవారు ఎవరైనా వస్తే వారిని గొడ్లను అదిలించినట్టు అదిలించేవాడు. ఒక రోజున ఒక బిచ్చగత్తె పారేసిన ఎండు చేపలను ఏరుకుంటూ ఉండగాచూచి ఆవిడను చావమోదాడు. "వెధవ బిచ్చగాళ్ళు! దోమలు ముసిరేసట్టు ముసురుతారు. బ్రతకనివ్వరు" అన్నాడు.

కార్ప్ అనే మరో గుమాస్తా ఈ మాటలు విన్నాడు. అతనికి ఎంతో ఏవగింపు కలిగింది. కార్ప్ చాలా దైవ భక్తి

పడుడు. ఎప్పుడూ పూజలను గురించీ, పునస్కారాలను గురించీ మాట్లాడుతూ ఉంటాడు. మంత్ర తంత్రాలన్నా, పూజారాధనన్నా కార్పుకు ప్రాణం.

ఇల్యా దుకాణంలో పనివాడుగా జీవితాన్ని గడుపుతున్నాడు. యజమాని ప్రొద్దస్తమానం రొక్కం పెట్టెదగ్గరే కూచుంటాడు. చేపలు కొనడానికి వచ్చినవాళ్ళు డబ్బులిస్తారు. యజమాని ఆ డబ్బు తనది కానట్లుగా విసిరిపుచ్చుకుని రొఖ్ఖం పెట్టెలో వేస్తూ ఉంటాడు. ఇల్యాకు ఇది ఎంతో చిత్రంగా కనిపించింది.

ఒక రోజున బేరం కాస్త తగ్గుగా ఉన్నప్పుడు ఇల్యా తలుపు దగ్గర నుంచుని తలవాల్చుకుని కునుకు తీయడం చూచాడు యజమాని.

"ఏమిట్రా మొద్దు మోహమా! నిద్దరోతున్నావా ?" అన్నాడు.

"ఉఁ హుఁ" అన్నాడు ఇల్యా.

"ఏమిటి ఎప్పుడూ అలా ఉంటావు? పని బాగా లేదా?" అడిగాడు యజమాని.

ఇల్యా సణిగాడు.

యజమాని ఇల్యాను దగ్గరికి పిలిచాడు. ఇల్యా భయ భయంగా దగ్గరకు వెళ్ళాడు.

"ఒకేయ్ అబ్బాయ్! పనంటే ఇంతేరా! కానీ తప్పదు. ముప్ఫయి సంవత్సరాల నుంచీ నేనూ ఇలాగే ఈదు కొస్తున్నాను" అన్నాడు యజమాని.

యజమాని అప్పుడప్పుడూ ఇల్యాతో మాట్లాడుతూ ఉండేవాడు. యజమానిని ఏవైనా ప్రశ్నలు అడగాలని అనిపించేది ఇల్యాకి. యజమానికి కావలసినంత డబ్బూ, పెద్ద భవంతీ ఉన్నాయి. కానీ ఇలా మురికి కూపంలాంటి ఈ చేపల దుకాణంలో భార్యా బిడ్డలతో సహా ఎందుకింత కాపరం ఉంటున్నాడో ఇల్యాకు అర్థమయ్యేది కాదు. ఒక రోజున ఏమైతేనేం ధైర్యం చేసి ఇల్యా యజమానిని ఆ ప్రశ్న అడిగాడు.

"అబ్బాయ్! అడగ దలుచుకున్నంతా అడిగావా?" అన్నాడు యజమాని గంభీరంగా.

"ఆ!" అన్నాడు ఇల్యా.

"ఇలా రా!"

ఇల్యా దగ్గరకు వెళ్ళాడు.

"ఒరేయ్! నీ అంతట నువ్వే ఈ ప్రశ్న అడిగావా? మరెవరయినా అడగమంటే అడిగావా?"

"నేనేనయ్యా! మరెవరూ నాకు చెప్పలేదు."

"ఇహ ఎప్పుడూ ఇలాటి ప్రశ్నలు అడక్కు — వెళ్ళి పని చూసుకో!"

♦ ♦ ♦

రోజులు బరువుగా దొర్లిపోతున్నాయి. ఇల్యాకు ఇక్కడి జీవితం ఎంతమాత్రం రుచించడంలేదు. ఈ జీవితానికి ఒక అంతంటూ ఉండదని అనిపిస్తూ ఉంది. ఆకాశంలో

మబ్బు తునకలు చెదిరిపోయి అటూ ఇటూ ప్రయాణం చేసి నట్టు ఇల్యా మనస్సు ఎక్కడెక్కడికో పరుగులు తీస్తూ ఉంది. ఒక్కొక్కసారి పావెల్‌లాగా ఎక్కడికో దూరదేశానికి వెళ్ళి పోయి మళ్ళీ తిరిగి రాకూడదని అనిపించేది.

ఆదివారాలు వస్తే ఇల్యా చర్చికి వెళ్ళేవాడు.

ఆరు నెలలకు రెండుసార్లు మాత్రమే వెళ్ళి తన బాబాయ్ తెరంతిని చూచి రావడానికి వీలు కలిగేది. అక్కడ కూడా జీవితంలో పెద్ద మార్పేమీ లేదు. తన బాబాయ్‌కి కూడా వయస్సు పైబడింది. బక్కచిక్కి పోయాడు. మనిషిలో ఒకవిధమైన నిరాశ ప్రవేశించింది. ఇల్యా యాకోవ్‌ను కూడా కలిశాడు.

"ఎలా ఉన్నావురా అబ్బాయ్ ?" అన్నాడు.

"నా సంగతి గొడవగానే ఉందిరా అబ్బాయ్ ! నాకేమో పుస్తకాలంటే మహా ప్రీతి. మా నాన్నకు ఈ చదువులన్నా, సంధ్యలన్నా గిట్టదు. 'ఒరేయ్ అబ్బాయ్ నా ఇంట్లో ఈ పుస్తకాలు పురుగులు ఉండడానికి వీల్లేదు. వెళ్ళి ఎక్కడైనా పని కుదుర్చుకో' అని నన్ను అస్తమానం చివాట్లేస్తాడు."

"మరి పని కుదుర్చుకున్నావా ?"

"ఎక్కడైనా దేవుడుపటాలమ్మే దుకాణంలో పని కుదిర్చిపెట్టమన్నాను. అక్కడ ఈ రొదా సొదా ఉండవు. అదీకాక దేవుడు పటాలంటే నాకెంతో ఇష్టం."

"ఇంకా పుస్తకాలు చదువుతున్నావా ?"

"ఓ! పుస్తకాలంటే పడిచస్తాను. పుస్తకాలు చదవందే నేను బ్రతకగలనట్రా ?"

ఇల్యా ఒకసారి యాకొవ్ ముఖంవంక చూచాడు. ఎంతో పెద్దవాడైపోయినట్లు కనిపించాడు.

"ఇప్పుడు మాషా ఎక్కడ ఉంటోంది ?" అడిగాడు ఇల్యా.

"మాషా భిక్షుక శరణాలయానికి వెళ్ళింది. ఇప్పుడు నేను మాషాకు ఒక్క పైసాకూడా ఇవ్వడానికి వీలు కలగడం లేదు. ఎప్పుడూ మా నాన్న నన్ను ఒక కంట కనిపెడుతూనే ఉన్నాడు. మాషా భిక్షుక శరణాలయానికి వెళ్ళి అక్కడ అన్నమూ, చాగూ తెచ్చుకుని తింటోంది" అన్నాడు యాకొవ్.

యాకొవ్, ఇల్యా ఇలా కాసేపు ముచ్చట్లాడారు. తరువాత ఇద్దరూ ఎక్కడికో పోయారు.

♦ ♦ ♦

కొన్నాళ్ళు గడిచాయి. పెద్ద మార్పేమీ లేదు. కానీ ఒక చిత్రమైన సంఘటన జరిగింది. ఒక రోజున ఇల్యా యజమాని రొఖ్ఖంపెట్టె టిక్కెట్టు కొన్నాడు. ఒక పది రూబుళ్ళ నోటు కనిపించలేదు. భగ్గున మండిపడ్డాడు. "ఒరేయ్ ఇల్యా ! నీవేకదూ తీశ్చేది ? నీకు పది రూబుల్ల నోటు కనిపించిందా ?" అన్నాడు.

"లేదయ్యా!"

"జాగ్రత్తగా చూడు."

"చూచానయ్యా!"

"చూచానంటే కాదు. మళ్ళీ ఒకమాటు చూడు."

"చూచానయ్యా!"

"అరేయ్ జాగ్రత్త!" అంటూ యజమాని ముందుకు వచ్చాడు.

"నాకు తెలీదయ్యా! ఆ డబ్బు గుమాస్తా మైఖేవ్ దొంగిలించాడు" అన్నాడు ఇల్యా.

మైఖేవ్ ఈ మాట వినేసరికి ఒక్కసారిగా స్తంభీభూతుడయ్యాడు. తను కూచున్న చోటునుంచి సరాసరి లేచి వచ్చి ఇల్యా నెత్తిమీద మొట్టి "అది నా డబ్బయ్యగారూ! ఒట్టంటే ఒట్టు!" అన్నాడు.

"నోరు ముయ్!" అన్నాడు యజమాని.

గుమాస్తా మైఖేవ్ ఇల్యా పైకి సివంగిలా దుమక బోయాడు.

ఇల్యాకు ఒళ్ళు మండుకొచ్చింది.

"ఏం చంపుతావా? రా చూదాం!" అంటూ చేపలు తరిగే కత్తి పుచ్చుకున్నాడు.

"వెధవ! ఖైదీ కొడుకు!" అన్నాడు గుమాస్తా.

"ఒరేయ్, కత్తి దింపెయ్!" అని కేకేశాడు యజమాని.

ఇల్యా పిల్లిలాగా కత్తి దించి అవతలపెట్టి చేతులు కట్టుకుని నుంచున్నాడు.

తరువాత యజమాని మైఖేల్‌కు రావలసిన డబ్బు లెక్కచూచి ఇచ్చి బర్తరఫ్ చేసి పంపివేశాడు.

మైఖేల్ తలదించుకుని వెళ్ళిపోయాడు.

"ఒరేయ్ అబ్బాయ్! నిజంగా నేను అడ్డుపడకపోతే ఆ కత్తితో గుమాస్తాను పొడిచే వాడివేనా?" అని అడిగాడు యజమాని.

"ఓ!" అన్నాడు ఇల్యా.

"మీ నాన్నని హత్యచేసినందుకు అరెస్టు చేశారు కదూ?"

"చిత్తం!"

తరువాత మరో గుమాస్తా కార్ప్ పిల్లి అడుగులు వేసుకుంటూ దుకాణంలోకి వచ్చాడు.

"కార్ప్! మైఖేల్‌ను దుకాణం నుంచి బర్తరఫ్ చేశానోయ్!" అన్నాడు.

"తమదయ!" అన్నాడు కార్ప్.

"వాడు డబ్బు దొంగిలించాడు. నీవేమంటావ్?" అన్నాడు యజమాని.

కార్ప్ నీళ్ళు నమిలాడు.

యజమాని ఇల్యాను దగ్గరికి పిలిచాడు.

"ఒరేయ్ అబ్బాయ్! కార్ప్ విషయం ఏమిట్రా? కార్ప్ దొంగతనం చేస్తాడంటావా? చెయ్యడంటావా?" అని అడిగాడు.

"కార్ప్‌కూడా దొంగే!" అన్నాడు ఇల్యా.

కార్ప్ ఒక్కసారి కూలిన చెట్టులా అయిపోయాడు.

"కార్ప్! ఇల్యా ఏమన్నాడో విన్నావా ?" అన్నాడు యజమాని.

"చిత్రం! వాడి మాటల కేం లెండి ?" కుర్రాడు !' అన్నాడు కార్ప్.

"మాటలు మార్చకు" అన్నాడు యజమాని.

"కార్ప్! నిన్నూ బర్తరఫ్ చేస్తున్నాను" అన్నాడు మళ్ళీ యజమాని.

కార్ప్ ఇంటికి వెడుతూ ఇల్యాను నానా చివాట్లు పెట్టాడు. "ఒరేయ్ అబ్బాయ్! మైఖేవ్ విషయంలో మంచి పనే చేశావు. కానీ నా విషయంలో మటుకు ఎంతో అన్యాయం చేశావు. జాగ్రత్త రోయ్! ముసలాడ్ని మరచిపోకు" అని బెదిరించాడు.

తరువాత ఇల్యాను యజమాని తన ఇంటికి కబురు పెట్టాడు. ఇల్యా మేడమెట్లెక్కి వెళ్ళి విశాలంగా ఉన్న పెద్ద గదిలో ప్రవేశించాడు. యజమాని తన భార్యలతోనూ, ముగ్గురు కూతుళ్ళతోనూ సభ తీర్చి ఉన్నాడు. ముగ్గురు కూతుళ్ళూ చక్కగా అలంకరించుకుని ఉత్సవ విగ్రహాల్లాగా కూచుని ఉన్నారు. ఇల్యా గదిలోకి వచ్చి దూరంగా నిల్చున్నాడు.

"ఫీడే!" అన్నాడు యజమాని.

"మంచి కుర్రాడే !" అన్నది భార్య.

"ఒరేయ్ అబ్బాయ్ ! నీకు ఎందుకు కబురు పంపానో తెలుసా ? ఇహ నువ్వు మా దుకాణంలో పని చెయ్య

నక్కర్లేదు. నీవు తప్పుచేశావని నేను అనడంలేదు. నీవు మంచి కుర్రాడివి కూడా- బాగా పనికూడా చేస్తావు. అయినా నీవు ఏ మాటయినా ముఖాన్నే అనేస్తావు. ఇది వ్యాపారంలో కుదరదు. ఇదుగో, ఈ రూబుల్ తీసుకుని నీ దోవన నీవు పో!" అన్నాడు యజమాని.

ఇల్యాకు ఏం జవాబు చెప్పాలో తోచలేదు. యజమాని విసిరేసిన రూబుల్ పుచ్చుకుని "సెలవయ్యా!" అని సెలవు తీసుకుని ఇంటిదోవ పట్టాడు.

ఇల్యా నడిచి నడిచి చివరకు ఇల్లుచేరు కున్నాడు. పెర్ఫిషాక ఎదురువచ్చి "వచ్చావటోయ్ ఘనుడా !" అన్నాడు.

"చాలా పెద్దవాడివై పోయావే !" అన్నది మాషా.

ఇల్యా ఇంటికితిరిగి వచ్చినందుకు యాకొవ్ కూడా ఎంతో సంతోషించాడు.

"మళ్ళీ మనం కలుసుకున్నాం రా తమ్ముడూ! నేనొక కొత్త పుస్తకం కొన్నాను. ఇద్దరం కలిసి చదువుకుందాం" అన్నాడు యాకొవ్.

తరువాత రెండు నెలలపాటు ఇల్యా ఏపనీ లేకుండా ఉన్నాడు. కానీ ఇలా ఎన్నాళ్ళు ఉండ గలగడం? ఏదో పని చూచుకోవాలి. తెరంతిబాబాయి ఇల్యాను పిలిచి "ఎలాగురా ఇలా కూచుంటే! ఎలా గడుస్తుంది? ఏదో ఒక పని చూచుకో వద్దా?" అన్నాడు.

"నాకేం? చదవడం రాయడం వచ్చునుగా– ఎక్కడికి వెళ్ళినా పని ఇస్తారు. కానీ నన్ను అతి సాహసవంతుడని పనిలోంచి తీసేస్తారు" అన్నాడు ఇల్యా.

"సరే, మరి ఏంచేస్తానంటావు?"

"పోనీ, ఏదైనా చిన్న వ్యాపారం చేసుకుంటాను. సూదులూ, పిన్నులూ, జడసవరాలూ, దువ్వెనలూ ఒక చిన్న పెట్టెలో పెట్టుకుని అమ్ముకుని వస్తాను" అన్నాడు ఇల్యా.

"సరే, కానీ చూదాం" అని ఊరుకున్నాడు తెరంతి.

ఆ తరువాత ఇల్యా జీవితంలో మరో మలుపు. చిన్న వ్యాపారస్తుడుగా ఇల్యా జీవితం మొదలుపెట్టాడు. ఉదయం నుంచి సాయంత్రంవరకూ సూదులూ, పిన్నులూ, జడసవరాలూ అమ్ముతూ నగరమంతటా తిరిగేవాడు. జనం ప్రవాహాలుగా వెడుతున్న నగరవీధులలో తిరగాలంటే అతనికి ఎంతో సరదాగా ఉండేది. తనకూ ఒక ప్రత్యేక వ్యక్తిత్వం ఉన్నట్లనిపించింది. నగరవీధుల్లో తిరుగుతూ మధ్యలో అలసట వచ్చినప్పుడు ఎక్కడో టీ దుకాణం దగ్గర ఆగి ఇల్యా ఒక కప్పు టీ తాగి కాసేపు అలసట తీర్చుకునేవాడు.

ఏ పార్కులోనో, ఏ చెట్టు నీడనో విశ్రాంతి తీసుకునేవాడు. అప్పుడు ఆ తీరిక సమయాల్లో ఇల్యా ఎన్నెన్నో కలలు కనేవాడు తన భావి జీవితాన్ని గురించి. తను ఇలాగే క్రమంగా పెద్ద వ్యాపారస్తుడవుతాడు. తనూ ఒక ఫ్యాన్సీ షాపుకు సొంతదారవుతాడు. ఎంతో చూడముచ్చటగా

అలంకరించుకుంటాడు. అందరూ తనని ఎంతో గౌరవిస్తారు. అమ్మాయిలు తనవైపు వాలు చూపులు విసురుతారు. ఇలా ఎన్నెన్నో ఊహాలతలు అల్లుకునేవాడు ఇల్యా.

ఒక్కోసారి అతని భావాలు మరో తీరుగా ప్రవహించేవి. జీవితం నిరాశామయంగా కనిపించేది. తను కట్టుకున్న స్వప్న సౌధం తన కళ్ళముందే నేలకూలినట్లనిపించేది.

ఒకరోజున ఇల్యా నగర వీధులలో వెడుతూ ఉండగా పావెల్ కనిపించాడు. బరువుగా కాళ్ళీడ్చుకుంటూ నడుస్తూ వస్తున్నాడు పావెల్. ఒళ్ళంతా దుమ్ము కొట్టుకుని ఉన్నది.

"ఒరేయ్ ఇల్యా!" అని కేకేశాడు పావెల్.

ఇల్యా పావెల్ వద్దకు వెళ్ళాడు.

"ఏమిట్రా ఇలా ఉన్నావ్? చాలా మారిపోయావ్! ఏంచేస్తున్నావు? ఎక్కడ ఉంటున్నావు?" అని అడిగాడు ఇల్యా.

"ఏదో ఇలాగే సాగిస్తున్నా జీవయాత్ర. ఏదో ఉన్నప్పుడు గప్‌చిప్– పడుకోడం– అంతే!" అన్నాడు పావెల్.

స్నేహితు లిద్దరూ కాసేపు ముచ్చటించుకున్నారు. తరువాత ఎవరి దోవనవారు పోయారు.

ఇల్యా ఇంటికి వెళ్ళేవరకూ దోవ పొడుగునా పావెల్ విషయమే ఆలోచించసాగాడు. పావెల్‌లో ఏదో మార్పు కనిపిస్తూ ఉన్నది. అతను పూర్వంలాగా అతనిలో అసూయ కానీ, ద్వేషంకానీ కనిపించడంలేదు. తను ఎంచ చక్కగా

ముస్తాబై ఉన్నప్పటికీ పావెల్ ఎంతమాత్రం అసూయ కని పరచలేదు. పావెల్ ధోరణి అతనికి ఎంతో విచిత్రంగా కనిపించింది. అతను ఏదో అవ్యక్తమైన ఒక వస్తువుకోసం అన్వేషిస్తూ ఉన్నట్లు తోచింది.

ఇల్యా చర్చికి వెళ్ళడం మొదలుపెట్టినప్పటి నుంచీ అతనిలో కూడా ఏదో అవ్యక్తమైన మార్పు కనిపించసాగింది. అతను చర్చికి వెళ్ళి ప్రార్థనలలో పాల్గొనలేకపోయినా, చర్చిలో ఒకమూలన నిల్చున్నప్పుడు అతని మనస్సును ఏదో అవ్యక్తమైన ప్రశాంతి ఆవరించేది. అప్పుడు తన తాతయ్య అంతిపాను గురించి చెప్పుకునే కథలూ, ఎరమీతాత చెబుతూవచ్చిన కథలూ జ్ఞాపకం వచ్చేవి.

తనలో తనకు తెలియకుండానే మరొక నూతన వ్యక్తిత్వం ఉదయిస్తున్నట్టు తోచింది ఇల్యాకు. కానీ ఈ ద్వంద్వ వ్యక్తిత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలో, ఎలా సమన్వయించుకోవాలో ఇల్యాకు బోధపడలేదు. యాకొవ్‌తో ఇల్యా అనేక ఆంతరంగిక విషయాలను చర్చించేవాడు. కానీ ఈవిషయాన్ని మటుకు ఎన్నడూ ప్రస్తావనకు తెచ్చేవాడుకాదు. ఈ విషయాలన్నీ తనకు తాను చెప్పుకునే ధైర్యంకూడా ఉండేదికాదు ఇల్యాకు. వీధులన్నీ తిరిగి వస్తువులమ్మి ప్రొద్దుగూకేసరికి ఇంటికి రాగానే ఇల్యా మాషా గదిలోకి పరుగు తీసేవాడు.

'ఏమిటి ఇవాళ శాకపాకాలు ?' అని ప్రశ్నించేవాడు.

మాషా టీ పొయ్యి అంటిస్తూ ఉండేది. నలుగురికీ టీ కాచి ఇవ్వడమంటే మాషాకు ఎంతో ఇష్టం.

మాషాకూడా ఇప్పుడు స్వయంగా డబ్బు సంపాదిస్తూ ఉన్నది. పూర్వంలాగా భిక్షుక శరణాలయాలకు వెళ్ళడంలేదు. కాగితాలతో పూలు తయారు చెయ్యడం నేర్చుకుంది మాషా. ఆ పూలు అమ్మి పొట్టపోసుకుంటూ ఉన్నది.

మాషా తండ్రి ఇటీవల జ్వరాన పడ్డాడు. కొన్నాళ్ళు ఆస్పత్రిలో ఉండి తిరిగి వచ్చాడు.

యాకొవ్, ఇల్యాలు ప్రతినిత్యం టీ పుచ్చుకోడానికి మాషా ఇంటికి వస్తున్నారు. ఇలా రావడం వారికి ఒక అలవాటైపోయింది. టీ పుచ్చుకుని ఎంతోసేపు లోకాభిరామాయణం మాట్లాడుకునేవారు. ఒక్కొక్కసారి మాషా తండ్రి పెర్ఫిష్కా కూడా వచ్చి పిల్లలతోపాటు కబుర్లలో కూచునేవాడు.

ఒక్కొక్కసారి పిల్లలు ముగ్గురూ సాదా కబుర్లు చెప్పుకోడం మాని తీవ్రమైన సమస్యలు చర్చించడం మొదలెట్టేవారు. ఆ సమస్యలు ఎంత చర్చించినా తెగేవి కావు. వాటి అంతం కనిపించేదికాదు. యాకొవ్‌కు ఇలాటి సమస్యలను చర్చించడమంటే ఎంతో ఇష్టం. యాకొవ్ సహజంగా ఊహాప్రియుడు. భావకవి మనస్తత్వం. అస్పష్టమైన విషయాలను ఆలోచించడం, అవ్యక్తమైన విషయాలను చర్చించడం అతనికి ఎంతో ప్రీతి. కనిపించే విషయాలపైకంటె కనిపించని విషయాలపై మక్కువ ఎక్కువ. అతను ఎన్నెన్నో కలలు కనేవాడు. తను చదివిన పుస్తకాలలో కథలు చెబుతూ ఉన్నా యథాతథంగా చెప్పేవాడు కాదు.

మధ్యలో స్వకపోలకల్పితమైన కొన్ని సంఘటనలు కూడా చేర్చేవాడు.

'నిద్రపోతూ ఉన్నప్పుడు మనిషి ఆత్మ ఏమవుతుంది? ఎక్కడికి వెడుతుంది?' అన్న ప్రశ్ననుగురించి చర్చ బయలు దేరింది.

'ఎక్కడికో ఎగిరిపోతుంది' అని వివరం చెప్పేవాడు యాకొవ్.

'అవును, ఆత్మ నిద్రలో మరేదో లోకానికి ఎగిరి పోతుంది' అనేది మాషా.

'నీ కెలా తెలుసు?' అని అడిగేవాడు ఇల్యా.

'తెలుసు, అంతే!' అనేవాడు యాకొవ్.

ఒక్కొక్కసారి వాళ్ళు మృత్యువును గురించి చర్చించుకునేవారు. ఈ సమస్య వారికి అసలు బోధపడేది కాదు.

ఇలా అర్ధరాత్రి దాటేవరకూ ఎన్నెన్నో కథలు, కబుర్లూ చెప్పుకుంటూ కాలక్షేపం చేసేవారు. ఇల్యా దీపం ఆర్పివేసేవాడు. తరువాత గపేచిప్. అంతా నిద్రపోయేవారు. ఒక సెలవురోజున ఇల్యా అగ్గిలా భగ్గుమంటూ ఇంటికివచ్చాడు. అతని ముఖం చూపులకే భయంకరంగా ఉన్నది. అతని ఒళ్ళంతా కొండ మీదినుంచి క్రిందికి జారినవాని శరీరంలా నొప్పిపుడుతూ ఉంది.

ఆనాటి ఉదయం ఇల్యా ఒక సర్కస్ డేరా వద్ద తన వస్తువులను అమ్ముకోడానికి ఒక పోలీసు దగ్గర అనుమతి తీసుకున్నాడు. తీరా డేరా వాకిట దుకాణం పరిచేసరికి మరో

పోలీసు వచ్చి, "ఇక్కడ నిన్ను దుకాణం ఎవరు పరచ మన్నారు?" అని ఇల్యాను దబాయించాడు. "నేను ఇదివరకే అనుమతి తీసుకున్నాను. అడిగే అధికారం తమకు లేదు" అని ఇల్యా అనగానే ఆ పోలీసు అగ్గిలా భగ్గుమని ఇల్యాను పోలీసు స్టేషనుకు తీసుకుని వెళ్ళి చావమోదాడు. ఇల్యా పోలీసులతో ఇంతకు పూర్వం చిలిపి తగాదాలు పడ్డాడు. కానీ ఇలాటి దుర్ఘటన ఎన్నడూ జరగలేదు. ఇల్యా కళ్ళుమూసు కుని బల్లమీద బోర్లగిలా పడుకున్నాడు. అతని మనస్సునూ, శరీరాన్ని ఏదో పెద్దభారం అణిచివేస్తూ ఉన్నట్లు తోచింది. అతనికి గత్యంతరం కనిపించడం లేదు. ఏవేవో వికట వికల స్వరాలు వినిపిస్తూ ఉన్నాయి. ఇల్యా కాసేపు అలా పడుకుని మెల్లిగా లేచాడు. అతనికి ఎక్కడికైనా వెళ్ళిపోదామని అని పించింది. అప్పటికి బాగా ప్రొద్దుదాటి పోయింది. మాషా నిద్దరోతూ ఉన్నది. యూకొవ్ కూడా తలనొప్పితో పడుకుని ఉన్నాడు. చలిగాలి సూదుల్లా పొడుస్తూ ఉన్నది. చీకటి దట్టంగా ఉన్నది. అతనికి ఈ కల్మషంనుంచి, ఈ కౌటిల్య నుంచి తప్పించుకుని ఎక్కడికైనా దూరంగా వెళ్ళి ఒంటరిగా హాయిగా ప్రశాంతంగా జీవించాలని అనిపించింది.

"ఎవరక్కడ?" ఎవరో పిలిచారు.

"ఎవరది?" మారు పలికాడు ఇల్యా.

"నేను మటెట్టూను."

"ఏమిటి ఇక్కడ కూచున్నావు?"

"ఈరోజు నా తల్లి చనిపోయిన రోజు."

"ఎన్నాళ్ళైంది నీ తల్లిపోయి?"

"పది పదిహేను సంవత్సరాలు."

"ఇప్పుడు నీ వయస్సు ?"

"ఉండవ్వూ, ముప్పై సంవత్సరాలు?"

"ఇలారా!" పిలిచింది మటిల్జా.

ఇల్యా మెల్లిగా మేడ మెట్లెక్కి మటిల్జా గదిలోకి వెళ్ళాడు. మటిల్జా నివసిస్తున్న గది ఎంతో ఇరుకుగా ఉన్నది. శవపేటికలాగా కనిపిస్తున్నది. ఇల్యా ఒకమాటు నలువైపులా కలయచూచి కిటికీవద్ద ఒక స్టూలు వేసుకుని కూచున్నాడు. ఎదురుగా ఒక స్త్రీపటం కనిపిస్తోంది.

"ఎవరిది ఆ పటం ?" అని అడిగాడు ఇల్యా.

"మహాత్మ్మురాలు అన్నాది" అన్నది మటిల్జా.

"నీ పేరు ?"

"నా పేరూ అన్నా నే! నీకు తెలీదూ ?" ఆశ్చర్యంగా అంది.

"ఉహుఁ !"

"అవును, ఆ పేరు ఎవరికీ తెలీదు." ఇలా అని బరువుగా పక్కమీద వాలింది మటిల్జా. ఇల్యా అటువైపే చూస్తున్నాడు. రెండు మూడు నిమిషాలపాటు ఒకరితో ఒకరు మాట్లాడకుండా కూచున్నారు.

"సరేకానీ, ఏం చెయ్యదలుచుకున్నావు ?" అని అడిగింది ఆవిడ.

"ఏమో !" అన్నాడు ఇల్యా.

"సరేకానీ, నాకు నువ్వు ఒక చిన్న సహాయంచేసి పెడుదూ! రెండు గ్లాసులు టీకు పోయించు- నీకు పుణ్యం ఉంటుంది. నా కాలికి జబ్బుచేసి నప్పటినుంచీ నేను ఒక్క పైసా కూడా సంపాదించలేకుండా ఉన్నాను.

"భగవంతునిపై ఆన! రెండు రోజులైంది నేను భోజనం చేసి" అని చెప్పసాగింది మటిల్టా.

మటిల్జా వీధి వేశ్య అనే విషయం ఇల్యాకు యిప్పుడే జ్ఞాపకం వచ్చింది. ఆవిడ ముఖంలోకి చూచాడు. ఎందుచేతనో కానీ అతనికి చెప్పరాని బాధ కలిగింది. "ఉండు వస్తా"నంటూ ఒక్కపరుగున మేడమెట్లు దిగి రొట్టెల దుకాణంవైపు వెళ్లాడు. రొట్టెలు టీకు కొనుక్కొని వెంటనే పైకి వచ్చాడు. అతను తనకు భోజనం టీయు తీసుకు రావడంతో మటిల్టా ముఖం చేటంత అయింది. ఆవురావురుమని ఆ భోజనాన్ని ఆరగించ సాగింది. ఇల్యా ఆమెవంకే చూస్తూ కూచున్నాడు. ఆవిడ తనకంటే వయసులో పెద్దది. ఆవిడను కౌగలించుకుందా మనిపించింది ఇల్యాకు. కానీ అలాంటి పని చేస్తే ఆమె పకాలున నవ్వుతుందేమోనన్న సందేహం కలిగింది. మధ్యమధ్యలో తలుపు చప్పుడయేది. ఎవరైనా వస్తున్నారేమోనని ఇల్యాకు భయం కలిగేది. మటిల్జా భోజనం ముగించి బరువుగావున్న తన శరీర భారాన్ని గోడకు చేరగలవేసి యిలా చెప్పసాగింది.

"నాకు ఎప్పుడూ ఆ మాషా ఆలోచనే అబ్బాయ్! నువ్వు, యాకోవ్ ఆ పిల్లతో స్నేహం చేస్తున్నారు. ఆ పిల్లని కళ్ళు విప్పకముందే దాన్ని చెదరగొట్టేస్తారు. ఇక దానికి యే గతీ కనిపించదు. ఇప్పుడు నేను నడుస్తున్న బాటలోనే

అదీ నడుస్తుంది. చూచావ్, యిది నిజం చెప్పా లంటే మావంటి పిల్లలు నడిచేబాట కాదు. అయినా నడవక తప్పదు-" అని గద్గదస్వరంలో చెప్పసాగింది మటిల్జా- మధ్య మధ్యలో గాలి విసురుగావచ్చి తలుపును తాకి వెడుతోంది. "భగవంతుడా, భగవంతుడా" అని నిట్టూర్చింది మటిల్జా.

"ఇదేమిటి! నీవు వేశ్యవు. భగవంతుడి పేరు ఉచ్చరిస్తావు?" అని ఆశ్చర్యంతో అడిగాడు ఇల్యా.

"మేం పాపాత్ములం తప్ప, భగవంతుడి పేరు మరెవరు ఉచ్చరిస్తారు?" అన్నది మటిల్జా.

"మీరంతా భగవంతుని చాటున మీ పాపాలు దాచుకుంటున్నారు. మిమ్మల్ని చంపినా పాపం లేదు" అన్నాడు ఇల్యా విసురుగా.

మటిల్జాకు కోపం వచ్చింది. విసురుగా లేచి అక్కడి నుంచి వెళ్ళిపోయింది. ఆవిడ వెళ్ళిపోయిన తరువాత ఇల్యా ఎందుకు ఈ మాట అన్నానా అని పశ్చాత్తాప పడసాగాడు. అతనికి స్త్రీలంటే ఒకవిధమైన అసహ్యం కలిగింది. ఆ అసహ్యంతోపాటు వాళ్ళ అంతేమిటో తెలుసుకోవాలనే ఒక పగకూడా అతనిలో మొలకెత్తసాగింది. ఆ తరువాత అతను వేశ్యా గృహాలకు వెళ్ళటం మొదలెట్టాడు. ఒకసారి అతను వీధిలో వస్తూ వుండగా ఒక స్త్రీ అతన్ని "యిలా రావోయ్!" అని చెయ్యి ఊపుతూ పిలిచింది. అతడు మెల్లిగా యింట్లో అడుగుపెట్టాడు. "ఒక్క రూబులు యిచ్చుకోవాలోయ్!" అన్నదా స్త్రీ.

"సరే లోపలికి పద" అన్నాడు ఇల్యా. అంతే! ఆ తరువాత ఇల్యా అప్పుడప్పుడూ వేశ్యాగృహాలకు వెడుతూ వుండేవాడు. ఈ కొత్త అలవాటులో కొంత సుఖం వున్నప్పటికీ చాలా ఖరీదయిన అలవాటుగా కనిపించింది. చాలా వస్తువులు అమ్మేస్తూ, బజార్లో తిరుగుతూ ఎంత కాలానికి ఒక అంతస్తును చేసుకోవడం అనే సందేహంకూడా కలిగింది. కానీ ఇల్యా ఎంతో ఆత్మాభిమానం కలవాడు. తన కొక ప్రత్యేకత, మర్యాద వున్నాయని అతనికి గాఢ విశ్వాసముండేది. అతనప్పుడప్పుడూ వార్తాపత్రికలుకూడా చదివేవాడు. వార్తాపత్రికలలో దోపిడీలనుగురించి, దొంగతనాలనుగురించి చదవడం అంటే అతనికి ఎంతో సరదాగావుండేది. 'సంఘంలో దొంగలకే ఎక్కువ నిజాయితీవున్నట్లు అనిపిస్తోంది' అన్నాడొకసారి యాకొవ్‌తో.

తరువాత కొన్నాళ్ళకు పావెల్ కనిపించాడు. ఒక నాటి సాయంత్రం. మంచు కురుస్తోంది. పావెల్ ఫ్లానెల్ చొక్కా వేసుకుని మెల్లిగా అడుగులువేస్తూ నడుస్తూ వున్నాడు.

"ఎలా వున్నావోయ్!" అని అడిగాడు ఇల్యా.

"ఇంతకన్నా చెడేదేముంది? బాగానే వున్నాను" అన్నాడు పావెల్.

"నీ వెలా వున్నావు?" అన్నాడు పావెల్.

"మామూలే!"

"మమ్మల్ని చూడటానికెప్పుడూ రావేమిటి?" అనడిగాడు పావెల్‌ను.

"మాకు తీరిక వుండొద్దూ!"

"తీరిక చేసుకోవాలి."

"చూశావ్, ఇటీవల నేను కొన్నాళ్ళు ఆస్పత్రిలో వున్నాను. టైఫాయిడ్ జ్వరం వచ్చింది" అన్నాడు పావెల్.

"కొత్త పుస్తకాలేమన్నా చదివావా?"

"కవిత్వం పుస్తకాలు చదివాను-పుష్కిన్ మొదలైన మహాకవుల గ్రంథాలు. కొందరు కవులు వ్రాసిన పుస్తకాలు చదువుతూవుంటే అందమైన అమ్మాయిలు ఆలింగనం చేసుకుని ముద్దుపెట్టుకున్నట్లుగా వుంటుంది."

ఇద్దరూ కలిసి దగ్గర్లోవున్న బీర్ దుకాణంలోకి వెళ్ళి బీర్ పుచ్చుకున్నారు.

"ఇప్పుడెక్కడ పనిచేస్తున్నావు?" అనడిగాడు ఇల్యా.

"మళ్ళీ ప్రెస్‌లో చేరాను"

"ఏదీ, నీవు వ్రాసిన పద్యాలు కొన్ని చదువు!"

పావెల్ చిరునవ్వునవ్వి గొంతు సవరించుకొని కొన్ని పద్యాలు చదివాడు.

"ఇవి నిజంగా నీవు వ్రాసినవేనా?" అన్నాడు ఇల్యా.

పావెల్ నవ్వాడు. ఇరువురూ మళ్ళా బజారులోకి వచ్చారు. మాట్లాడుకుంటూ నడవసాగారు. మంచు కురుస్తోంది. "ఎక్కడికి ప్రయాణం?" అన్నాడు ఇల్యా.

"సితోరికా యింటికి" అన్నాడు పావెల్.

"ఆ అమ్మాయి నీకు తెలుసా యేమిటి?"

"ఓ!"

"అక్కడొక అమ్మాయివుంది. పేరు వీరా. చాలా అందంగా ఉంటుంది. నాకు జ్వరం వచ్చినప్పుడు మందిచ్చిన డాక్టరు ఇంట్లో పనికత్తెగావుండేది. పుస్తకాలుచదువుకోడానికి వాళ్ళయింటికి వెడుతూండేవాణ్ణి. మా యిద్దరిమధ్యప్రణయం యేర్పడింది. ఇల్యా! పిల్లలు ఆటబొమ్మతో ఆడుకొన్నట్లుగా ఆ అమ్మాయితో ఆడుకున్నాను. డాక్టరుగారి భార్యకూడా తెలిసింది ఈ విషయం. కానీ ఆవిడ తగాదాపడింది. ఆ అమ్మాయిని వెళ్ళగొట్టింది. వీరా నా దగ్గరికి వచ్చింది. ఇద్దరం కలిసి కాపురం పెట్టాం. ఉన్నదంతా అమ్ముకు తిన్నాం. వీరా వెళ్ళిపోయింది. రెండు వారాల వరకూ రాలేదు. తరువాత ఒకసారి చక్కగా ముస్తాబై నగలు నాణ్యాలు పెట్టుకుని వచ్చింది. అది యింట్లో అడుగుపెట్టగానే నేను జుట్టు పట్టుకుని చావమోదాను."

"అయితే వీరా వెళ్ళిపోయిందా?" అనడిగాడు ఇల్యా.

"ఉహుఁ వెళ్ళలా-వెడితే నేను ఆత్మహత్య చేసుకునే వాణ్ణి. నేననేక విధాల దాన్ని ప్రాధేయపడ్డాను" అని వీరా కథ చెప్పసాగాడు పావెల్.

"వీరా వేశ్యాగృహంలో చేరాలనుకుందా?" అనడిగాడు ఇల్యా.

"ఎవరికి తెలుస్తాయి, దాని మనస్సులో వున్న విషయాలు? కానీ మాకు పిల్లలు పుడతారు. వాళ్ళ గతేం కావాలి?" అన్నాడు పావెల్.

"నువ్వు దాన్ని ఒదిలెయ్యకూడదూ?" అనడిగాడు ఇల్యా.

"ఛస్తే వదిలేస్తానా!" అన్నాడు పావెల్.

ఇద్దరూ కలిసి నడుస్తూ నగరం చివరకు వచ్చారు. ఒక ఆరంతసుల భవంతి వద్ద ఆగారు. పావెల్ తలుపు తట్టాడు. "ఇది సితోరికా నడుపుతున్న వేశ్యాగృహం. యిక్కడికి వచ్చి వృత్తి చేసుకునే వేశ్యలు నెలకు యాభై రూబుళ్ళు దానికి చెల్లించాలి" అన్నాడు పావెల్.

"నీవు ప్రేమిస్తున్న పిల్ల యెంత పుచ్చుకుంటుంది?" అనడిగాడు ఇల్యా.

"దాని ఖరీదుకూడా యెక్కువే!" అన్నాడు పావెల్.

సన్నగా వున్న ఒక వృద్ధ స్త్రీ వచ్చి తలుపు తెరిచింది. "వచ్చావా అబ్బాయ్! వీరా నీకోసం ఎంతసేపట్నించో ఎదురుచూస్తోంది. ఎవరూ యీ కుర్రాడు?" అనడిగింది.

"ఒక స్నేహితుడులే!" అన్నాడు పావెల్.

మిత్రు లిద్దరూ యువతలకు నడిచారు.

ఒక పెద్ద హాలు. ఒకమూలన విద్యుద్దీప కాంతిలో ఒక అమ్మాయి కనిపిస్తోంది. తెల్లని దుస్తులు ధరించింది. "చాలా ఆలస్యంగా వచ్చావయ్యా!" అంది పావెల్తో. తరువాత అతని బుజాలమీద చేతులుంచి ఆ కొత్త వ్యక్తి ఎవరన్నట్లుగా ఇల్యావంక చూచింది.

"ఒక స్నేహితుడు-పేరు ఇల్యా" అన్నాడు పావెల్.

"కులాసా?" అనడిగింది వీరా.

వీరా వేసుకున్న గౌను బుజాలమీద కొంచెం కిందికి జారింది. సన్నని గౌనులోనుంచి చిన్న వూల గుత్తులవంటి

వక్షోజాలు కనిపిస్తూ వున్నాయి. ఇల్యాకు ఉద్రేకం కలిగింది. పీరా గదిలోకి దారి తీసింది. గడప దగ్గర నుంచుని కిలాకు మని నవ్వింది. పావెల్ కూడా నవ్వాడు. "పీరా! నీవు ఇల్యాగాడిని తలకిందులు చేసేశావు. చూడు, వాడు ఎలా చూస్తున్నాడో నీవంక--తేనెతొట్టిని ఎలుగుబంటి చూచినట్లు."

"నిజంగా తలక్రిందు లయారంటారా మీ మిత్రుడు?" అన్నది పీరా చిరునవ్వు నవ్వుతూ.

పావెల్ నవ్వాడు. ఇల్యావంక తిరిగి "ఒరే అబ్బాయ్! జాగ్రత్త- నా పీరాను నీవు ప్రేమించావంటే గొంతు కోసే స్తాను." అన్నాడు. తన ప్రియురాలు యింత గొప్ప అందగత్తె కదా అని పావెల్ ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. ఒక సన్నని గౌను వేసుకున్న పీరా అప్సరసలా కనిపిస్తోంది. సన్నని గౌనులో నించి ఆమె నగ్న శరీరం ఎండిన పండులా వుంది.

గదిలో ఒక బల్లమీద టీ మసలుతూ వుంది. ముగ్గురూ బల్లదగ్గర కూర్చుని మాట్లాడుకోవడం మొదలెట్టారు.

"పీరా! నీ సాన్నిధ్యంలో వుంటే స్వర్గంలో వున్నట్లే వుంటుంది."

"పావెల్! నువ్వు కవిత్వం మాట్లాడేస్తున్నావు" అన్నది పీరా.

"ఈ ఆనందం యిలా ఎన్నాళ్ళుంటుందో!" అన్నాడు పావెల్.

"గతించినదాన్ని గురించి చింతించకు - ప్రతి క్షణం మనకుఆనందమయమే!" అంది పీరా. ఈలోగాఎవరో తలుపు

తట్టిన చప్పుడయింది. వీరా వెళ్ళి తలుపు తెరిచింది. ఇక్కడికి మరో అమ్మాయి వచ్చింది. "ఈవిడ నా స్నేహితురాలు- ఒలింపిటా" అని ఆ అమ్మాయిని వీరా వారికి పరిచయం చేసింది.

"మీ రంతా యిక్కడ పైలా పచ్చీసుగా వుంటే నేను ఒంటరిగా వుండలేక వచ్చాను" అంది ఒలింపిటా. తనూ ఒక కుర్చీ లాక్కుని కూచుంటూ. "చూచావు టే వీరా! నిన్న ఓ గమ్మత్తు జరిగింది. నేను చర్చికి వెళ్ళాను. అక్కడ ఒక సన్యాసిని చూచాను. యువతి. పసిమొగ్గవంటి ఆ అమ్మాయి సన్యాసం ఎందుకు స్వీకరించిందా అని నాకు ఆశ్చర్యం కలిగింది."

"అలాగటే!" అంది వీరా.

"నేను పావెక్టేవ్ దగ్గర వుండడానికి వెడదామనుకుంటున్నాను. వాడు ముసలాడు. బాగా డబ్బున్నవాడు కూడా- అయిదువేలు బ్యాంకులో వేయమన్నాను. నాకు నెలకో నూటయాభై యిమ్మన్నాను. కాని వాడు ఒప్పుకోవడంలేదు సుమా!"

"ఇప్పుడా గొడవలన్నీ మాట్లాడకు" అన్నది వీరా. తరవాత ఒలింపిటా ఇల్యావంక చూచి "ఎవరబ్బాయి నీవు? యేం చేస్తూ వుంటావు?" అన్నది.

"వ్యాపారం" అన్నాడు ఇల్యా.

"బ్యాంకులో గుమాస్తా వనుకున్నాను."

"అలా కనిపిస్తాను, అంతే-" అన్నాడు ఇల్యా.

తరువాత ఒలింపిటా పీరా వంక తిరిగి "పీరా!" యీ అబ్బాయిని నన్ను దాంగిలించుకోమంటావా?" అన్నది విలాసంగా.

"ఓ! నీ యిష్టం" అన్నది పీరా నవ్వుతూ. ఒలింపిటా ఇల్యాను చెయ్యి పుచ్చుకుని నెమ్మదిగా నడిపించుకుని లోపలకు తీసుకువెళ్ళింది. మంత్రముగ్ధుడిలా ఇల్యా ఆవిడను అనుసరించాడు.

తరువాత ఇల్యా అప్పుడప్పుడూ ఆవిడ దగ్గరికి వెళుతూ వుండేవాడు.

ఆ అమ్మాయి దగ్గరికి వెళ్ళడం మొదలెట్టిం తర్వాత అతనిలో యేదో కొత్త ధైర్యం, ఆత్మవిశ్వాసం యేర్పడినట్లు తోచింది. ఒక చక్కని అమ్మాయి తనంత తానే తనను ప్రేమించడం, ఆమె తన అనురాగాన్ని తనమీద వెదజల్లడం, తన పెదవులమీద ముద్దులు ముద్రించడం, తన్ను కౌగిళ్ళతో నలిపివేయడం ఈ అనుభవాలన్నీ అతన్నొక నూతన వ్యక్తిగా చేశాయి.

"అబ్బాయీ, యిలా రావోయ్!" అంటూ ఒలింపిటా అతన్ని దగ్గరికి తీసుకునేది. అతని జుట్టుతో ఆడుకొనేది. అతని పెదవులు కొరికేది.

"రోజు రోజుకూ నీ మీద మమత్వంఎక్కువవుతోంది. నీ వెంత చక్కటివాడివి. ఎంత ధైర్యశాలివి. నాకు నిన్ను పెళ్ళాడా లనిపిస్తూంది సుమా!"

అని చేతులు చాపి అతన్ని చుట్టూ పెనవేసి నలిపి వేసేది. ఇల్యాకు ఆవిడంటే గౌరవంకూడా యేర్పడింది.

ఒలింపిటా అందగత్తె మాత్రమే కాదు, తెలివిగలది కూడా. విషయాన్ని గురించి ఆవిడ కొక అభిప్రాయం వుండేది.

వీరాకు పావెల్‌కు మధ్యమధ్యన చిన్న చిన్న తగాదాలు వచ్చేవి. అప్పుడు ఇల్యా వారిని సమాధానపెడుతూ వుండేవాడు. వీరా వంటరిగా గదిలో కూర్చుని జుట్టు దువ్వుకుంటూ వున్నప్పుడు చూడాలని ఇల్యా ఎంతో ముచ్చటపడేవాడు. ఇలా మూడు నెలలు గడిచాయి. ఒక రోజు సాయంత్రం ఇల్యా తన పని ముగించుకొని యింటికి రాగానే అతనికో దృశ్యం కనిపించింది.

యాకొవ్, పెర్ఫిష్కా టేబుల్ దగ్గర కూచుని వోడ్కా పుచ్చుకుంటున్నారు.

"భగవంతుడికి అంతా తెలుసు. మా నాన్న ఒట్టి దొంగ" అంటున్నాడు యాకొవ్.

"అవును యాకొవ్! అయినా మనం చేసేదేముంది?" అన్నాడు పెర్ఫిష్కా.

ఇల్యా వీరి సంభాషణ విన్నాడు. అతని కెంతో బాధ కలిగింది. "ఏమిట్రా యాకొవ్! యేం చేస్తున్నావు యిక్కడ కూర్చుని?" అంటూ యాకొవ్ దగ్గరకు వెళ్ళాడు. యాకొవ్ అతనివంక ఉలిక్కిపడి చూచి చిరునవ్వు నవ్వాడు. "మా నాన్నేమోనని భయపడ్డానే!" అన్నాడు. తరువాత "ఇల్యా! మా నాన్న నన్ను చావ మోదాడు. చూచావా, యెంతపని చేశాడో!" అన్నాడు.

"ఏమిటి జరిగిన విశేషం?" అని ప్రశ్నించాడు ఇల్యా.

పెత్కోషాక యిలా చెప్పసాగాడు: "పెద్ద తగాదా జరిగింది. అసలీ తగాదా అంతా మొదలెట్టింది మీ బాబాయి. మీ బాబాయి మహాత్ములను చూడటానికి వెళ్ళాలిఅన్నాడు. యాకొవ్ కూడా వస్తానన్నాడు. నీకూ యీ పాడు బుద్ధులు పుడుతున్నాయిగా వెధవా అని వాళ్ళనాన్న చావమోదాడు. నే నిక ఒక్కక్షణమైనా యిక్కడ బ్రతకలేను ఎక్కడికైనా వెళ్ళిపోతాను అన్నాడు యాకొవ్."

ఇల్యాకు యిదంతా పెద్ద రభసగా కనిపించింది. ఈలోగా 'తెరంతి' అక్కడికి వచ్చాడు. మఠానికివెళ్ళి మహాత్ములను చూడటానికి సన్నాహ మయినాడు తెరంతి. "నేను ఒక వంద రూబుళ్ళు మఠానికి విరాళంయివ్వదలచుకున్నాను" అన్నాడు తెరంతి. "ఒక వంద నీకూ యిస్తాలే!" అన్నాడు ఇల్యాతో. "నా కా దొంగ డబ్బు అక్కర్లేదులే!" అన్నాడు ఇల్యా. "నీ మంచికోసమేరా అబ్బాయి! యీ పని చేశాను. భగవంతుడు నన్ను క్షమిస్తాడు గాక!" అన్నాడు తెరంతి.

"తాతయ్య డబ్బు దొంగిలించమని నేను చెప్పానా?" అన్నాడు ఇల్యా.

"ఇల్యా!నువ్వు మాట్లాడకు-అన్నిటినీ నిర్ణయించటానికి ఈశ్వరుడే వున్నాడు" అన్నాడు తెరంతి.

ఇల్యాకు ఒలింపిటాతో పరిచయం యేర్పడి నప్పటినించీ యిక్కడి వాతావరణం యేమీ గిట్టడంలేదు. ముళ్ళకంప మీద పడుకున్నట్లు బాధ కలుగుతోంది.

ఇల్యా యేమీ తోచక మటిల్డా యేం చేస్తోందో చూదామని ఆమె గది దగ్గరకు వెళ్ళాడు. అక్కడ మాషా బంతిలా చుట్ట చుట్టుకుని చాపమీద పడుకునివుంది.

మటిల్డా ఇల్యాను లోపలికి పిలిచింది. "ఈ యింట్లో అందరూ రాక్షసులయిపోతున్నారు. పిల్లలను చావబాదుతున్నారు" అంది.

మాషాకు యెక్కడైనా పని చూస్తానన్నాడు ఇల్యా. "మాషాకు యెంత వయస్సు?" అని అడిగాడు.

"పదిహేను సంవత్సరా లుంటాయి" అన్నది మటిల్డా.

ఒక గంట తరువాత ఇల్యా ఒలింపియా దగ్గరకు వెళ్ళాడు.

"ఒలింపియా లోపలున్నదా?" అని అడిగాడు.

ఒకరు తలుపు తెరిచారు.

గడపదాటి లోపల అడుగుపెట్టిన ఇల్యా అలాగే స్తబ్ధుడై నిలుచున్నాడు. అక్కడ ఒక వృద్ధుడు కనిపించాడు. అతనిది బట్టతల.

"ఎవరు నీవు?" అన్నాడా వ్యక్తి.

అతనెవరో ఇల్యాకు బోధపడింది.

తనకోసమే ప్రేమనంతా సమర్పిస్తున్నదని తను భావిస్తున్న ఒలింపియా ప్రేమను చూరగొన్న వ్యక్తి యితనే నన్నమాట అనుకున్నాడు.

"నేనా, ఒక వీధి వ్యాపారస్తుడిని లెండి!" అన్నాడు ఇల్యా.

"అంటే ? వివరంగా చెప్పు!" అని అడిగాడు ముసలి వాడు.

"రిబ్బన్లు, దువ్వెన్లు, జడ సవరాలు అమ్ముకునేవాడిని"

"ఏం పనిమీద వచ్చావు ?"

ఒలింపిటా కోసం వచ్చాను."

"ఎందుకు ?"

"ఆవిడ నాకు కొంచెం డబ్బు యివ్వాలి"

వాళ్ళు యిలా మాట్లాడుకుంటూ వుండగా ఒలింపిటా వచ్చి గుమ్మందగ్గర నిలబడింది.

"ఎవరో నీ కోసం వచ్చారు. నీవు డబ్బివ్వాలటగా!" అన్నాడు ముసలివాడు.

"యింతకంటె నీకు మరో సమయం దొరకలేదా రావడానికి ? ఎంత యివ్వాలో చెప్పు యిచ్చేస్తాను" అంటూ ముప్పై రూబుళ్ళు తెచ్చి అతని చేతిలో వుంచింది.

ఇల్యా అక్కడినించి అసహ్యంతో బయటపడ్డాడు.

ఆ మరునాడు ఇల్యా వీధిలో నడుస్తూ వెడుతున్నాడు. అతకి ఒలింపిటా ప్రవర్తనంతా జ్ఞాపకం వచ్చింది. ఒక చిన్న దుకాణం ముందుగా వెళ్ళాడు. ఆ దుకాణం మీద యీ క్రిందిపేరు వ్రాసివుంది.

"వి. జె. పొలెక్టేవ్. వడ్డీ వ్యాపారస్తుడు- బంగారు, వెండి వస్తువులు కొనబడును."

నిన్న ఒలింపిటా యింట్లో చూచిన వ్యక్తి యీ యింట్లోనే వుంటాడేమోనన్న ఊహతట్టింది ఇల్యాకు. లోపలకు

వెళ్ళి ఒకమాటు చూచి రావా లనిపించింది. ఇల్యా చారిత్రిక ప్రసిద్ధ నాణేలను కొన్నిటిని పోగుచేశాడు. వాటిని అప్పు డప్పుడూ అమ్ముతుంటాడు. ఈ సందర్భంలో కూడా అతని జేబులో కొన్ని నాణేలు వుండటం తటస్థించింది. ఇల్యా ఆ సాకుతో లోపలకు వెళ్ళాడు. నిజంగానే లోపలకు వెళ్ళి చూచేసరికి, ఆ ముసలి వ్యక్తే కనిపించాడు.

"నేను జ్ఞాపకం వున్నానా ?" అన్నాడు ఇల్యా.

"లక్షమందిని చూస్తూ వుంటాం- నువ్వెవరో" అన్నాడా వృద్ధుడు. "యింతకూ యేంపనిమీద వచ్చావో చెప్పు"

"నా దగ్గర కొన్ని పాత నాణేలున్నాయి."

"ఏవీ, చూపించు-"

ఇల్యా రొఖ్ఖంపెట్టెలోంచి నాణేలను బైటికి తీశాడు. వడ్డీ వ్యాపారస్తుడు వాటిని పరీక్షించసాగాడు. "యివన్నీ అరిగిపోయిన నాణేల లాగా వున్నాయ్" అన్నాడు. ఇల్యాకు ఎక్కడలేనీ కోపం వచ్చింది.

ఆ ముసలివాడి నెత్తిమీద ఒక గుద్దు గుద్దాడు. పొలెతేవ్ కిందపడి పెద్దపెద్ద కేకలు వేయడం మొదలెట్టాడు. ముసలివాడిమీద తన కసినంతా తీర్చుకుని ఇల్యా దుకాణం దాటి బయటకు వచ్చాడు. మంచు కురుస్తోంది. ఇల్యా మెల్లిగా అడుగులువేస్తూ నడిచివెళ్ళాడు. అడ్డరోడ్డు దగ్గరికి వెళ్ళేటప్పటికి అక్కడొక పోలీసువాడు కనిపించాడు. ఇల్యా ఆ పోలీసు దగ్గరకువెళ్ళి "యిప్పుడు గంటెంత అయింది?" అని అడిగాడు. పోలీసు జేబులోవున్న గడియారం తియ్యబోతూ వుండగా ఇల్యా కెందుకో నవ్వువచ్చింది.

"యేమిటి నవ్వుతున్నావు ?" అన్నాడు.

"మరేంలేదు. మంచు తీవ్రంగా కురుస్తోంది. అందుకని నవ్వొచ్చింది" అన్నాడు ఇల్యా.

అక్కడినించి తిరిగివచ్చి ఇల్యా పొలెటేవ్ దుకాణం పక్కనే కూర్చున్నాడు. బాగా ఆకలివేస్తోంది. పొలెటేవ్‌ను ఎవరో చంపేశారు" అన్న కేక ఆ గుంపులోనించి వినిపించింది. ఇల్యా ఉలిక్కిపడ్డాడు.

"దుర్మార్గులను భగవంతుడు యిలాగే శిక్షిస్తాడు. వారి పాపాలే యిలా పరిపక్వం అవుతాయి" అని కొందరు మాట్లాడుకుంటున్నారు.

ఇల్యా తనలో తాను నవ్వుకున్నాడు. అతనిలో ఒక కొత్త ధైర్యం పుంజుకుంది. ఆ క్షణంలో అతన్ని 'యీ హత్య చేసింది నువ్వేనా ?' అని అడిగినట్లయితే 'నేనే'నని జవాబు చెప్పగలవాడే-

ఇల్యా మెల్లిగా ఆ గుంపులోనుంచి తోసేసుకుని ఒక చర్చి దగ్గరకు వెళ్ళాడు.

అతనికి మానవ జాతంటే తీరని అసహ్యం కలిగింది. పొలెటేవ్ ఆ నగరంలోకల్లా పెద్ద వడ్డీ వ్యాపారస్తుడు, శ్రీమంతుడు కూడా. అతన్ని గురించి యిప్పుడెవ్వరూ పట్టించుకోవడంలేదు. ఇప్పుడందరూ ఆడిపోస్తున్నాడు కూడా.

ఇల్యా అక్కడనుంచి మెల్లిగా లేచి యింటికి వెళ్ళాడు. గదిలోకివెళ్ళి తలుపులు మూసుకుని పడుకున్నాడు. పొలెటేవ్ దుకాణంలో తను దొంగిలించిన డబ్బు బయటకు తీసి

లెక్కించుకోసాగాడు. ఆ డబ్బు యెక్కడ దాచాలో అతనికి తోచలేదు. అటకమీద దాచాలనే వుద్దేశ్యంతో అక్కడినించి లేచాడు. దారిలో యాకొవ్ కనిపించాడు. "తొందరగా వచ్చేసెయ్, టీ పుచ్చుకుందాం!" అన్నాడు.

"ఉండు, ఒక్కక్షణంలో వచ్చేస్తా" నని ఇల్యా అక్కడి నించి వెళ్ళాడు.

అతనికి తల తిరుగుతున్నట్లుంది.

మెల్లిగా అటక మీందికి ఎక్కాడు. ఎవరైనా చూస్తారేమోనని భయంవేసింది. అటకమీద గోడలో రంధ్రంచేసి డబ్బు దాచాడు. నెమ్మదిగా అటక మెట్లు దిగాడు. అతన్ని అనేక సందేహాలు చుట్టుముట్టాయి. అతన్ని ఎందుకు చంపానా అనిపించింది. మెట్లుదిగి వస్తూ వుండగా మాషా కనిపించి "యివాళ చాలా తొందరగా యింటికి వచ్చేశావే!" అంది.

ఇల్యా మాషావైపు చూచాడు.

"ఇల్యా! ఇలారా- చిక్కిపోతున్నావేం? నిన్ను గురించి నీవు చాలా ఆలోచించుకుంటున్నట్లున్నావు" అంది మాషా.

ఇల్యా మాషావంక తదేకంగా చూడసాగాడు. సన్నని పిల్ల. రెబ్బలా వుంది. వంకెల జుట్టు. పొయ్యి రాజవేస్తూ వుంది. అడవి పువ్వులాంటి ఆ పిల్లను చూచినప్పుడు ఎంతో దిగులు అనిపించింది. ఈ వొంటరిపిల్ల యింత పెద్ద భవనంలో వుండడం, పెద్దదానిలాగా తన పనులన్నీ తానే చేసుకోడం, లేశమైనా సుఖంలేని జీవితం గడపడం యివి

చూస్తూంటే ఇల్యా కెంతో జాలి కలిగింది. మెల్లిగా మాషాను దగ్గరకు పిలిచాడు. "మాషా! నేను చెడ్డవాడినని నీ వెప్పుడూ అనుకోలేదా ?" అన్నాడు.

అశ్రుపూర్ణమైన అతని కంఠస్వరం ప్రకంపించసాగింది. మాషా చిరునవ్వు నవ్వి "నీకు దెబ్బలు పడాలయ్యా చాలా! అంతే నీ తప్పు!" అన్నది.

"ఇల్యా! నన్నుకూడా ఆ మఠానికి తీసుకువెళ్ళమని మీ బాబాయితో చెప్పవూ ?' అన్నది. ఇలా అని ఇల్యా చేయి పుచ్చుకుని ముద్దాడబోయింది. "ఒసే మాషా! ఊరుకో-నేను హంతకుణ్ణి" అని కేక వేశాడు ఇల్యా. ఇంతలోనే మళ్ళీ సర్దుకుని "హంతకుడినీ కావచ్చు" అన్నాడు. "పోనిద్దూ! ఇవన్నీ పిచ్చిమాటలు" అన్నది మాషా. యాకోవ్ ఆ క్షణంలో అక్కడికి వచ్చాడు. "ఏమిట్రా గల్లంతు చేస్తున్నారు?" అన్నాడు.

"నేను మఠానికి వెళ్ళిపోతున్నాను" అన్నది మాషా.

"నిజంగా ?" అన్నాడు యాకోవ్.

మాషా అందరికీ టీ అందించ బోయింది. ఇల్యాకు కూడా టీ అందించబోయింది. కానీ ఇల్యాకు టీ పుచ్చుకోవాలనిపించలేదు. అక్కడినించి వెళ్ళి తన గదిలో పడుకున్నాడు. కాసేపటికి తెరంతి వచ్చాడు. అతనికి తీర్థయాత్రలు చేయాలనే వుద్దేశ్యం కలిగినప్పటినించీ అతని కళ్ళల్లో ఒక నూతన కాంతి ద్యోతకమవుతోంది. అతను మెల్లిగా ఇల్యా పక్క దగ్గరకు వచ్చి కూర్చున్నాడు.

"బాబాయ్! నువ్వు నిజంగా తీర్థయాత్రలకు వెడుతున్నావా?" అన్నాడు ఇల్యా.

"త్వరలోనే వెడుతున్నాను" అన్నాడు తెరంతి.

"మాషాను కూడా నీతో తీసుకుని వెళ్ళు. అది వయసు వచ్చిన పిల్ల. ఇక్కడి మనుషులంతా ఎలాటివారో నీకు తెలియని విషయం కాదు. మాషాను ఎక్కడికైనా దూరంగా తీసుకుని వెళ్ళడం మంచిది" ఇల్యా మాట్లాడలేదు. అర్థ నిమీలిత నేత్రాలతో కిటికీ వెలుపలికి చూస్తూ పడుకున్నాడు.

"ఇటీవల ఒక వేదాంతి వచ్చాడు. మేము ఇంతసేపూ పాపాన్ని గురించి, ప్రాయశ్చిత్తాన్ని గురించి మాట్లాడుతూ పడుకున్నాం. పాపం మానవుడి శక్తి సామర్థ్యాలను పరీక్షించే గీటురాయి వంటిది" అన్నాడు తెరంతి.

ఇల్యా ఒకసారి బాబాయి వంక చూచాడు.

"ఆ వేదాంతి దెయ్యంలా కనిపిస్తాడు కదూ?" అన్నాడు హఠాత్తుగా.

"ఏమిటా గడుగ్గాయి మాటలు? అతను చాలా గొప్పవాడు. మహావ్యక్తి" అన్నాడు తెరంతి.

"సరే, ఇంతకూ ఆ వేదాంతి ఏం ఉపన్యాసం దంచాడేమిటి?" అన్నాడు ఇల్యా.

"ఏమీ లేదు. ఏవేవో విషయాలు మాట్లాడాడు" అన్నాడు తెరంతి.

రెండు నిమిషాలపాటు ఇద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు.

తరువాత ఇల్యా హఠాత్తుగా లేచి తెరంతివైపు తిరిగి "ఒక పాపం చేశాననుకో బాబాయ్! పశ్చాత్తపించడం నాకు ఇష్టం లేదనుకో- అప్పుడు ఏమవుతుంది? చూడు అసలు పాపం చెయ్యాలని నేను అనుకోలేదు. అలా పాపం చెయ్యాల్సిన పరిస్థితులు వచ్చాయి. అంతే- భగవంతుని ఇచ్ఛవల్లనే అలా తటస్థించింది. భగవంతుడు సర్వసాక్షి అంటారుకదా-నేను ఆ పని చెయ్యడం భగవంతునికి ఇష్టం లేకపోతే ఆయన అడ్డుపడి ఆపకూడదూ?" అని అన్నాడు.

"ఏమిటో బాబూ నువ్వు చెబుతూ ఉన్నది నాకు ఒక్కమాటకూడా అర్థంకావడంలేదు" అన్నాడు తెరంతి.

ఇల్యా చిరునవ్వు నవ్వాడు.

"నీకు అర్థం కాకపోతే ఇహ మాట్లాడకు. నాకు మనస్సు బాగాలేదు" అన్నాడు ఇల్యా.

తెరంతి నిద్ర వస్తోందని అక్కడినుంచి లేచి వెళ్ళాడు. ఇల్యా ఒంటరిగా కూచుని ఆలోచించసాగాడు. గత కొద్ది గంటలలో జరిగిన అనుభవాలన్నీ అతని మనస్సులో ఒక్క సారి గిరుక్కున తిరుగసాగాయి.

అతని మనస్సంతా ఎవరో దేవినట్లుగా అనిపించింది. నిశ్చలంగా పడుకున్నాడు. ఆకాశంలో మేఘాలు చిరుగాలికి తిరుగాడినట్లు అతని మనస్సులో ఏవేవో భావాలు పరుగులు తీయసాగాయి. ఆలోచించి ఆలోచించి ఆఖరుకు కళ్ళు మూసుకున్నాడు ఇల్యా.

తెల్లవారింది. ఉదయకాంతి చల్లగా గదిలో ప్రవేశించింది. క్రితంరోజు జరిగిన సంఘటనలు అతనికి మెల్లి మెల్లిగా జ్ఞాపకం రాసాగాయి. ఇకముందు జీవితంలో తను ఏ పథాన్ని అనుసరించాలో అతను నిర్ణయించుకున్నాడు. ఒక గంట తరువాత ఇల్యా కాలకృత్యాలు తీర్చుకుని మెల్లిగా నడవసాగాడు. దారిలో చర్చి కనిపించింది. ఇల్యా టోపీ తీసి క్రాస్ చేశాడు. దారిలో తను హత్యచేసిన పొలక్టోవ్ దుకాణం కూడా కనిపించింది. టీ దుకాణంలోకి వెళ్ళాడు. ఫలహారాలు సేవిస్తూ వార్తా పత్రికను చదివాడు. ఆ రోజు వార్తాపత్రికనిండా ఈ హత్యావార్తలే కనిపించాయి. 'హంతకుణ్ణి పట్టుకోడానికి పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారు' అని వ్రాసి వున్నది. కానీ తనంత తాను ఒప్పుకుంటే తప్ప పోలీసులు తనను పట్టుకోలేరన్న విషయం ఇల్యాకు స్పష్టంగా తెలుసు.

ఆ సాయంత్రం ఇల్యాకు ఒలింపిటా వద్దనుంచి కబురు వచ్చింది. రాత్రి తొమ్మిది గంటలకు ఒక ప్రత్యేక సంకేత స్థానంలో తనను కలుసుకోవలసిందిగా కోరుతూ ఒలింపిటా తన పరిచారికచేత కబురు పంపింది.

ఆ కబురు వినగానే ఇల్యా నెత్తురు హఠాత్తుగా గడ్డ కట్టినట్లయిపోయింది. తను ఒలింపిటాను ఆఖరుసారిగా కలుసుకోడానికి వెళ్ళినప్పుడు 'ఇదేనా సమయం!' అని ఒలింపిటా పరుషంగా అన్న మాటలు ఇల్యాకు జ్ఞప్తికి వచ్చాయి.

ఒలింపిటా ఎందుకోసం కబురు పంపించిందో తనకు అర్థం కాలేదు.

ఒకవేళ హంతకుడు తనే ననే అనుమానం ఒలింపిటాకు కలిగిందేమో అనుకున్నాడు ఇల్యా.

రాత్రి తొమ్మిది గంటలకు ఇల్యా ఆ సంకేత స్థలానికి వెళ్లాడు. దూరంనుంచి వస్తూ ఉన్న ఒలింపిటా కనిపించింది. ఇల్యా తనలో తాను కుంచించుకుని పోయాడు.

"ఇల్యా! గట్టిగా మాట్లాడకు- రుమాలుతో ముఖం కప్పుకో- ఎవరైనా చూస్తారు" అన్నది ఒలింపిటా.

ఇద్దరూ కలిసి ఒక స్వతంతంటి ఇంట్లో ప్రవేశించారు. ఒక గదిలోకి వెళ్ళి సోఫా మీద కూచున్నారు.

ఒలింపిటా ఇల్యా కళ్ళలోకి ఆర్ద్రంగా చూస్తూ ఇలా అన్నది :

"అబ్బాయ్! పోలీస్ ఇన్వెస్టిగేటర్ వద్ద నుంచి త్వరలోనే మనకు సమన్లు వస్తాయి" అన్నది.

"మనకు సమన్లెందుకు వస్తాయి?" అని ప్రశ్నించాడు ఇల్యా.

ఇల్యా ఇలా ప్రశ్నించి ఒకసారి ముఖాన్ని రుమాలుతో తుడుచుకున్నాడు.

"అబ్బాయ్! వెర్రిగా మాట్లాడకు. ఈ రోజు ఉదయమే డిటెక్టివ్ మా ఇంటికి వచ్చాడు" అన్నది ఒలింపిటా.

"ఈ డిటెక్టివ్‌లతో, ఈ గొడవలతో నాకు అవసరం లేదు" అన్నాడు ఇల్యా.

"అబ్బాయ్! చెప్పదలుచుకున్న దేదో చెప్పాను. ఇహ నన్ను విసిగించకు. ఇన్వెస్టిగేటర్ నీకు కబురుపంపి

ప్రశ్నిస్తే నీకు ఏమీ తెలీదని చెప్పు. నీవు అతన్ని అసలు ఎరుగనని చెప్పు" అన్నది ఒలింపిటా.

"నే నలా అబద్ధం ఎందుకు చెప్పాలి? నేను ఆ ముసలాణ్ణి చూచాను. నాకు కోపం వచ్చింది. నా దోవకు అతను అడ్డుగా ఉన్నా డనుకున్నాను. నేను అతన్ని చంపలేదూ అంటే......" అని ఏదో చెప్పబోయాడు ఇల్యా.

"అతను నీ దోవకు అడ్డుతగిలాడనే మాట శుద్ధ అబద్ధం!" అన్నది ఒలింపిటా.

"అతను నా దోవకు అడ్డుతగలలేదంటావా?" అని ప్రశ్నించాడు ఇల్యా.

"ఏ క్షణంలో నీవు అతన్ని వదిలివెయ్యమని నన్నడిగినా నేను వదిలివేసేదాన్ని. కానీ నీవు నన్ను అలా ఎన్నడూ అడగలేదు. పైగా నీవు ఆ విషయాన్ని ఎంతో తేలికగా పరిగణించావు. నీవు ఎన్నడూ నన్ను ప్రేమించి ఎరుగవు. అతనికి నేను ఉంపుడు కత్తెగా ఉండడానికి నీవే అంగీకరించావు" అని చెప్పసాగింది ఒలింపిటా.

"ఇహ మరి మాట్లాడకు. అంతకీ నువ్వే కారణం!" అన్నాడు ఇల్యా.

"నీకు ఏ విషయమూ చెప్పకుండా దాచాలనే అభిలాష నాకులేదు. నీవు యువకుడివి. అంతే కాదు. నిన్ను నేను ప్రేమిస్తూ ఉన్నాను. అతనికి ఉంపుడు గత్తెగా ఉన్నాను. అంతే-అందుకు నీవు ఎప్పుడూ కాదనలేదు కూడా!" అన్నది ఒలింపిటా.

ఇల్యా హృదయంలో కోపం జ్వాలలుగా లేగింది. ఒలింపిటా వంక తీక్ష్ణంగా చూచాడు.

"ఏం అలా చూస్తున్నావు? నన్ను చంపుతావా? చంపు! పీడా వదిలిపోతుంది. అందరికీ తెలిసేటట్లు 'అతన్ని ఇల్యాయే చంపాడు' అని అరవనా?" అన్నది ఒలింపిటా.

ఇల్యాకు ఒక్క క్షణం భయం గలిగింది. మెల్లిగా సోఫాలో ఒరిగి పడుకున్నాడు. ఒకసారి కనురెప్పలు మూసి తెరిచి చేదుగా ఒక చిరునవ్వు నవ్వాడు. ఒలింపిటా దేని కోసమో వెదుకుతూ ఉన్నట్లు గది నాలుగు వైపులా కలయ చూస్తూ ఉంది.

"ఒలింపిటా! ఒకమాటు ఇలారా" మెల్లిగా పిలిచాడు ఇల్యా.

ఒలింపిటా మెల్లిగావచ్చి ఇల్యా ప్రక్కనే కూచున్నది.

"ఒలింపిటా! నేనే ముసలాణ్ణి చంపాను. ఈ రహస్యం దేవునికీ, నాకూ తప్ప మరెవరికీ తెలీదు" అన్నాడు.

ఒలింపిటా ఉలిక్కి పడింది. కెవ్వున కేక వేయబోయి ఇంతలోనే కేకను గొంతులోనే అదుముకున్నది.

ఆవిడ పెదవులు వణికాయి. పెద్ద బాధతో ఒక్కసారి దీర్ఘంగా నిశ్వసించి, "అయ్యో! ఎంత పని చేశావు!" అన్నది.

ఇల్యా మెల్లిగా లేచి వెళ్ళి ఆవిడ ప్రక్కనే కూచు న్నాడు.

"ఇల్యా! లేనిపోని మాటలు చెప్పి నా సుఖాన్ని, నా ఆనందాన్ని, నా జీవితాన్ని ఎందుకు పాడుచేస్తావు? అతను హత్య చెయ్యబడినందుకు- నిజంగా నాకు ఎంతో సంతోషంగా ఉన్నది" ఉన్నది ఒలింపిటా.

"అతన్ని హత్యచేసింది నేనే!" అన్నాడు ఇల్యా.

"మళ్ళీ ఆ మాట అనకు- నా దగ్గరికి ఎందరో వస్తూ ఉంటారు. వారిలో ఎవరో ఒకరు అతన్ని ఖూనీచేసి ఉంటారు. వాళ్ళంతా వట్టి రాక్షసులు. కానీ నువ్వు మాత్రం అలాంటి వాడివి కావు. నువ్వు ఎంతో సుకుమారమైన వ్యక్తివి" అన్నది ఒలింపిటా.

ఇల్యా మాటలు అతన్ని చల్లబరిచాయి. అతను తన ముఖం ఆవిడ వక్షస్థలానికి గట్టిగా అదుముకున్నాడు. ఇల్యా తనని ప్రేమిస్తూ ఉన్నది. ఇంతకు పూర్వం ఎన్నడూ ప్రేమించనంతగా తనను ప్రేమిస్తున్నది. ఆవిడ ప్రేమ ఇప్పుడు తనకు అవసరం.

"అబ్బాయ్! నువ్వు నన్ను విసుక్కున్నా, కసురుకున్నా నాకు కోపంరాదు. నా కల్మష జీవితం నాకు జ్ఞాపకం వస్తుంది. అందుచేత నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అన్నది ఒలింపిటా.

బరువైన కన్నీటిబొట్లు ఇల్యా శిరస్సుపై పడ్డాయి. అతనూ ఆవిడతో పాటు విలపించ సాగాడు. కన్నీరు కల్మషాన్నంతా ప్రక్షాళనం చేసింది. ఆవిడ అతని తలెత్తి కన్నీటితో తడిసిన అతని కనులనూ, పెదవులనూ, చెక్కిళ్ళనూ ముద్దాడింది.

"అవును- నాకు తెలుసు, నీవు నన్ను ప్రేమించడం లేదు. నీవు నా శరీరాన్ని, నా అందాన్ని ప్రేమించావు. అంతే, నా జీవిత మంటే నీకు అసహ్యం. నాకు ఆ విషయం తెలుసు. పైగా నేను ఆ ముసలాడికి ఉంపుడు గత్తెగా ఉన్నా నని నీ కెంతో కోపం. నన్ను ఎన్నటికీ క్షమించవు" అని అశ్రుపూరిత కంఠస్వరంతో చెప్పసాగింది ఒలింపిటా.

"ఇహ ఆ ముసలాడి విషయం ఎత్తకు" అన్నాడు ఇల్యా.

ఒక క్షణం నిశ్శబ్దంగా ఊరుకుని మళ్ళీ ఇలా చెప్పడం మొదలెట్టాడు.

"అయినా మన చేతిలో ఏముంది ? ఎలా జరగవలసి ఉంటే అలా జరుగుతుంది. దోషి ఎంతకాలం దాగి ఉంటాడు? భగవంతుడు దోషిని శిక్షించి తీరుతాడు ఒలింపిటా ! పొర బాటుగా అర్థం చేసుకున్నాను. నన్ను క్షమించు!" అన్నాడు ఇల్యా. అతని కంఠస్వరంలో గద్గదిక ఏర్పడింది. పెదవులు వణికాయి. కళ్ళు ఎర్రగా జోతుల్లా అయినాయి. తరువాత హఠాత్తుగా అత నిలా అన్నాడు.

"అంతా నా తప్పే! అంతా నా తప్పే! "అన్నాడు.

"ఒలింపిటా ! నీకు అర్థం కావడం లేదా ? నేనే అతన్ని చంపాను" అన్నాడు మళ్ళీ.

"ఇస్! ఊరుకో- మతిచెడిన మాటలు మాట్లాడకు" అన్నది ఒలింపిటా.

అతన్ని గట్టిగా కౌగలించుకుని అతని కళ్ళల్లోకి తదేకంగా చూడసాగింది.

ఇల్యా ఇలా చెప్పసాగాడు :

"అలా జరగవలసి వచ్చింది, జరిగింది. అంతే- కానీ కారణాలు ఎవరు చెప్పగలరు ? ఒకసారి దుకాణంలోకి వెళ్ళి ఆ ముసలి పీనుగను చూచివద్దా మనుకున్నాను. కానీ చంపా లని అనుకోలేదు. పరిస్థితులు అలా వచ్చాయి. అంతే!"

ఇల్యా ఒకసారి దీర్ఘంగా నిశ్వసించాడు. అతనికి ఒక పెద్ద బరువు దిగిపోయినట్లు తోచింది.

ఒలింపిటా ఇల్యా కథనం విని ప్రకంపించి పోతూ కూచున్నది.

"నువ్వు రొఖ్ఖంపెట్టెలోనుంచి డబ్బు దొంగిలించడం మంచిదై పోయింది. హత్యానేరం దోపిడిగా మారడానికి అవకాశం ఉన్నది" అన్నది ఒలింపిటా.

"నేనే నా అంతటగా వెళ్ళి పోలీసుల దగ్గర నేరం ఒప్పుకో దలచలేదు. భగవంతుడు నన్ను శిక్షిస్తే శిక్షించ వచ్చు. కానీ మానవులకు నన్ను శిక్షించే అధికారం లేదు. మానవులంతా పాపాత్ములే!" అన్నాడు ఇల్యా.

ఒలింపిటాకు ఏమీ బోధపడలేదు. అంతా అగమ్య గోచరంగా ఉన్నది. ఇల్యా లేచి అటూ ఇటూ త్రాగిన స్త్రీ వలె తిరుగాడ సాగింది. "ఇప్పుడు నన్ను ఏం చెయ్యమం టావు ?" అని అడిగింది.

"నీవే ఆలోచించుకో!" అన్నాడు ఇల్యా.

"ఇన్వెస్టిగేటర్‌తో ఉన్న విషయాలను ఉన్నట్టుగా చెబితే?" అని అడిగింది ఒలింపిటా.

"నే నలా చేస్తానా? చెప్పి బైటికి వెళ్ళనా? లేక ఉరికంబం ఎక్కనా? నేను జీవితంలో చెయ్యవలసిన మహత్కార్యాలు ఎన్నో వున్నాయి" అన్నాడు ఇల్యా.

ఇద్దరూ ఒకసారి గాఢంగా ఆలింగనం చేసుకుని ముద్దాడారు. తరువాత ఎవరిదోవన వారు వెళ్ళారు.

ఇల్యా వీధిలోకి వెళ్ళి ఒక టాంగాను పిలిచి ఇంటికి వెళ్ళాడు. దోవ పొడుగునా అతనికి ఇవే ఆలోచనలు. ఒలింపిటాతో తను చేసిన నేరం చెప్పాడు. ఆవిడ తనను కోప్పడలేదు. పైగా ఎంతో సానుభూతిచూపింది. ఒలింపిటాపై అతనికి ఎంతో సదుద్దేశం ఏర్పడింది. పైగా తన హృదయంలోని పెద్ద భారం దిగిపోయిన ట్లనిపించింది.

ఒలింపిటా మృదుమూర్తి జ్ఞాపకం వచ్చి అతను చిరు నవ్వు నవ్వుకున్నాడు. కానీ ఆ మరునాడంతా ఇల్యాకు నిద్ర పట్టలేదు. ఎవరో తనను వెంటాడుతూ ఉన్నట్టు అనిపించింది. తనతో ఎవరూ పూర్వంలా పరిచయంగా మాట్లాడడంలేదు. ఉదయాన్నే పెట్రూకా కనిపించాడు. తెరంతి బాబాయ్ కూడా కనిపించాడు. కానీ ఎవరూ తన పరిచయంగా మాట్లాడలేదు.

అదోలా ముభావంగా ఉన్నారు. యాకొవ్ కనిపించి ఇల్యాను మాషా గదిలోకి తీసుకుని వెళ్ళాడు.

"నిన్న రాత్రి పోలీసులు వచ్చారు. నిన్ను గురించి మా నాన్నను అనేక ప్రశ్నలడిగారు" అన్నాడు.

"ఎలాంటి ప్రశ్నలడిగారు?" అన్నాడు ఇల్యా తాపీగా.

"నువ్వు ఎక్కడుంటావు? ఏం చేస్తుంటావు? తాగుడూ వ్యభిచారం నీకు అలవాట్లున్నాయా? ఒలింపిటా అనే అమ్మాయి నీకు తెలుసా ?" అని అడిగారు.

"ఏమో నాకేం తెలుసు ?" అని ఇల్యా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం ఇల్యాకు ఒలింపిటా నద్దనుంచి మరో కబురు వచ్చింది. "నిన్న మా ఇంటికి పోలీసులు వచ్చారు. నిన్ను గురించి ప్రశ్నించారు. కొన్ని విషయాలు చెప్పాను. ప్రమాదం లేదు" అని వ్రాసి ఒలింపిటా ఒక చీటీ పంపింది.

ఇల్యా ఆ చీటిని చించి నిప్పుల్లో వేశాడు.

వడ్డీ వ్యాపారస్తుని మరణవార్తతో ఊరంతా అట్టుడికినట్టు ఉడికిపోతూ ఉన్నది. జనం రకరకాలుగా కథలు చెప్పుకుంటూ ఉన్నారు. ఇల్యా ఈ కథలన్నీ విన్నాడు. ఒక్కసారి తను, 'ఈ హత్య చేసింది నేనే' అన్నట్లయితే ఈ జనమంతా నివ్వెరపోతారు.

హత్యను గురించి జనం రకరకాలుగా చెప్పుకునే కథలను వింటూంటే ఇల్యాకు ఎంతో ఆశ్చర్యం కలగసాగింది. కొందరు హంతకుని నేర్పును ప్రశంసిస్తున్నారు. మరి కొందరు సొమ్ము పెట్టెలోని డబ్బంతా పట్టుకుని పోవడానికి హంతకునికి సమయం దొరకనందుకని హంతకుణ్ణి జాలి తలుస్తున్నారు. కానీ వీరిలో ఏ ఒక్కరూ హత్య చేయబడిన వడ్డీ వ్యాపారస్తుని గూర్చి ఒక్క మాట కూడా జాలితో మాట్లాడడం లేదు. విచిత్రమైన జనప్రవృత్తిని పరిశీలించినప్పుడు ఇల్యాకు జనంమీద అసహ్యభావం కలిగింది.

ఇల్యా ఇప్పుడు ఆలోచిస్తూ ఉన్నది. పొలెటేవ్‌ను గురించి కాదు. పోలెటేవ్ మృత్యువు కన్నకూడా ముఖ్య మైనది. తను చేసినపాపం—ఈ పాపం ఎలా క్షాళితం కావాలి? ఈ విషయాన్ని గురించే విచారిస్తున్నాడు. ఈ పాప చింతన ఇల్యాలో ఒక భాగంగా మారిపోయింది.

ఏ క్షణానో ఒక క్షణాన తను తన పాపాన్ని అంగీక రించి తీరాలి. మానవుల నుంచి తను తప్పించుకోవచ్చు. కానీ భగవంతుని నుంచి ఎలా తప్పించుకోవడం? భగవం తుడు తనను రక్షించి తీరుతాడు. ఆ శిక్షను స్వీకరించడానికి తను సిద్ధం కాకతప్పదు.

ఇల్యా ఈ నిశ్చయానికి వచ్చాడు. అంచేతనే అతని మనస్సులో ఇప్పుడు ఎలాంటి ఆందోళనాలేదు. మనస్సు ప్రశాంతంగా ఉన్నది. శిక్షను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాడు.

ఈ విధమైన పాపచింతన ప్రారంభం కావడంతోపాటు ఇల్యాలో ఒకవిధమైన అంతర్ముఖత్వం ఏర్పడింది. అత నిప్పుడు జనంతో కలిసి మెలిసి తిరగడంలేదు.

జనానికి దూరంగా ఉంటున్నాడు. తన పనిపాటలు తను చేసుకుంటూ ఉన్నప్పటికి ఎప్పుడూ ఏదో లోకాతీతమైన విషయాన్ని గురించి ఆలోచిస్తూ ఉన్నట్లు కనిపించేవాడు.

హత్య జరిగి ఒకవారం రోజులు గడిచాయి. కానీ ఇంత వరకు పోలీసు ఇన్‌స్పెక్టర్ వద్ద నుంచి తనకు కబురేమీ రాలేదు. ఇక బహుశా కబురు రాదేమో అనుకున్నాడు. ఇల్యా. కానీ ఆ మరునాడే కబురు వచ్చింది.

ఇల్యా ఇంటర్వ్యూకు వెళ్ళటానికి చక్కగా ముస్తాబయ్యాడు. కొత్తసూటు వేసుకున్నాడు. ఒకబండి మాట్లాడుకుని ఆఫీసు వద్దకు వెళ్ళాడు. మెల్లిగా మేడమెట్లెక్కి ఆఫీసు గదిలోకి వెళ్ళాడు. గదిలో ఇన్వెస్టిగేటర్ కూచుని ఉన్నాడు. ఆ యువకుడు కళ్ళద్దాలుధరించాడు. వంకులువంకులుగాఉన్నది జుట్టు. అతను ఒకసారి ఇల్యా వైపు దీర్ఘంగా దృష్టి సారించాడు. ఇల్యా మారు మాట్లాడకుండా అతని వంక చూచాడు.

"హల్లో ! ఎలా ఉన్నావు ? కులాసా ? కూచో!" అన్నాడు ఇన్వెస్టిగేటరు.

ఇల్యా కూచున్నాడు. తరువాత కాసేపు నిశ్శబ్దం. బరువైన నిశ్శబ్దం. ఇన్వెస్టిగేటర్ ఒక పుస్తకం పుచ్చుకుని పేజీలు తిరగవేస్తూ కూచున్నాడు. ఇల్యా గది నాలుగు గోడలూ పరిశీలింప సాగాడు. కుడిప్రక్కగోడ మీద జీసెస్ చిత్రం కనిపించింది. జీసెస్‌ను విచిత్రంగా చిత్రించారు ఆ చిత్రువులో.

జీసెస్ తలవంచుకుని ఒంటరిగా నడుస్తున్నాడు. అతను నడుస్తున్న ప్రదేశం మహా స్మశానం. అతని కాళ్ళ వద్ద మృతకళేబరాలు కనిపిస్తూ ఉన్నవి. దగ్ధ కాష్టాల నుంచి సెగలూ పొగలూ లేస్తున్నవి. ఈ చిత్రంలోని అంతరార్థం ఏమిటని ఇల్యా ఇన్వెస్టిగేటర్‌ను ప్రశ్నించబోయాడు. ఈ లోగా అతను గబుక్కున పుస్తకం మూసేసి, "సరేకాని మిస్టర్ ఇల్యా! నీవు మరేమీ అనుకోకుండా ఉంటే నిన్ను ఒక ప్రశ్న అడగదలుచుకున్నాను. నిన్ను ఎందుకోసం

కబురు పంపానో ఊహించే ఉంటావని అనుకుంటాను ?"
అన్నాడు.

ఇల్యా తనకేమీ తెలీనట్లుగా "ఉఁహుఁ" అన్నాడు.

"తెలీదూ ? ఒలింపిటా నీకేమీ చెప్పలేదూ ?" అని అడిగాడు ఇన్వెస్టిగేటర్.

"ఉఁహుఁ, ఆవిడను నేను కలుసుకుని చాలా రోజులైంది."

"ఎన్నాళ్ళైంది ?"

"వారం పదిరోజులై ఉండొచ్చు."

"అలాగా ? నీవు ఆవిడ ఇంటికి వెళుతూ ఉన్నప్పుడు నీకు పొలెటేవ్ ఎన్నడైనా కనిపించాడా ?"

"అతనా? ఆ హత్య చెయ్యబడిన ముసలాడు కదూ?"

"ఊఁ, అతనే!"

"అతన్ని నేను ఎన్నడూ చూడలేదు."

"ఒలింపిటా అనే వేశ్యను అతను ఉంచుకున్న విషయం నీకు తెలుసా ?"

"ఉఁహుఁ"

"నీకు ఒలింపిటా చాలాకాలంనుంచీ తెలుసా ?"

"ఒక సంవత్సరం నుంచీ తెలుసు."

తరువాత ఒకక్షణం ఇద్దరూ మాట్లాడలేదు. ఒక క్షణం ఆగి "ఆ బొమ్మలో జీసెస్ ఎక్కడికి వెళుతున్నాడు?" అని ప్రశ్నించాడు ఇల్యా.

"జీసెస్ భూలోకం ఎలా ఉన్నదో అని చూదామని వచ్చాడు. యుద్ధాలతో, దోపిళ్ళతో, దొంగతనాలతో నిండి ఉంది భూలోకం" అని ఇన్వెస్టిగేటర్ ఆ చిత్రాన్ని వ్యాఖ్యానించసాగాడు. తరువాత మళ్ళీ నిశ్శబ్దం.

"మరో మాట అడగడం మరిచాను. గురువారంనాడు మధ్యాహ్నం రెండుమూడు గంటల మధ్య నువ్వు ఎక్కడున్నావు?" అని అడిగాడు ఇన్వెస్టిగేటర్.

"టీ దుకాణంలో టీ పుచ్చుకుంటూ ఉన్నాను" అన్నాడు ఇల్యా.

"ఏ టీ దుకాణంలో ?"

"ప్లైవనా టీ దుకాణంలో"

"నీకు సమయం సరిగా ఎలా జ్ఞాపకం ఉన్నది ?"

"టీ దుకాణంలోకి వెళ్ళడానికి ముందు ఒక పోలీసును టైమెంత అని అడిగాను."

"ఆ పోలీసుకూ, నీకూ పరిచయం ఉన్నదా ?"

"ఊఁ !"

"నీకు స్వంత గడియారం లేదా ?"

"ఉఁహుఁ"

"ఇంతకు ముందు ఎన్నడైనా నీవు ఆ పోలీసును టైం అడిగావా ?"

"అప్పుడప్పుడూ అడుగుతూ ఉండేవాణ్ణి"

"నీవు ప్లైవనా టీ దుకాణంలో చాలాసేపు కూచున్నావా ?"

"ఎవరో హత్య జరిగిందని వేసిన కేక వినిపించే వరకూ కూచున్నాను."

"తరువాత ఎక్కడికి వెళ్ళావు ?"

"హత్య చెయ్యబడిన వ్యక్తిని చూడడానికి వెళ్ళాను"

"నీవు టీ దుకాణంలో ఉండగా నిన్ను ఎవరైనా చూచారా ?"

"ఆ పోలీసే చూచాడు. నన్ను తరిమాడు కూడా"

"బావుంది వరస" అన్నాడు ఇన్వెస్టిగేటర్ సంతృప్తితో.

"సరే కానీ, మరోచిన్న ప్రశ్న. నీవు పోలీసును టైం హత్యకు ముందుగా అడిగావా ? తరువాత అడిగావా?" అని అడిగాడు ఇన్వెస్టిగేటర్.

ఇల్యాకు కొంచెం కోపం వచ్చింది. "ఏమో, ఎవరికి జ్ఞాపకం ?" అన్నాడు.

తరువాత ఇన్వెస్టిగేటర్ మరేవో కొన్ని ప్రశ్న లడిగాడు. ఇల్యా జాగ్రత్తతో ఆ ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పాడు.

"ఇక నీవు వెళ్ళవచ్చు" అన్నాడు ఇన్వెస్టిగేటర్.

ఇరువురూ ఒకరివైపు ఒకరు చూచుకున్నారు. ఇల్యా వెంటనే గదిలో నుంచి బైటికి వెళ్ళాడు. చలిగాలి వీస్తోంది. ఇల్యా ఒక అరగంటలో ఒలింపిటా ఇంటికి వెళ్ళాడు.

"పరీక్ష అయిపోయిందా ? అన్నది ఒలింపిటా.

"ఆ, ఇప్పుడే బైట పడ్డాను. వాడు సామాన్యుడు కాడు. అవులిస్తే పేగులు లెక్కబెట్టేరకం" అన్నాడు.

"అందుకనే వాడికి అంత జీతం ఇస్తున్నారు" అన్నది ఒలింపిటా.

"నీ పరీక్ష కూడా ముగిసిందా?" అని అడిగాడు ఇల్యా.

"ఊఁ" అంటూ ఒలింపిటా టీ నీళ్ళు వెచ్చ చెయ్యడం మొదలెట్టింది. ఇల్యా ఏదో ఆలోచిస్తూ సోఫా మీద పడుకున్నాడు.

"అనవసరంగా అదే విషయం ఆలోచిస్తూ కూచోకు. లాభం లేదు" అన్నది ఒలింపిటా.

"నేను ఆ విషయాన్ని ఆలోచించడం లేదు. నేను చేసిన పని ఎంతవరకు సమర్థనీయమా అని ఆలోచిస్తూ ఉన్నాను." అన్నాడు ఇల్యా. ఒలింపిటా టీ పొయ్యి దగ్గర కూచున్నది. ఇల్యా సోఫాలోనుంచి లేచి అటూ ఇటూ తిరగ సాగాడు.

"నేను వాళ్ళకు చెప్పవలసిన విషయాలు ఇంకా చాలా ఉన్నాయి." అన్నాడు ఇల్యా.

"సందేహించకు- వెంటనే వెళ్ళి చెప్పు. నేను అడ్డు వస్తున్నానని అనుకుంటున్నావా? అలా అనుకోకు- నీ ఇష్టం" అన్నది ఒలింపిటా.

ఆవిడ కంఠస్వరం ప్రశాంతంగా ఉన్నది. పెదవులు బాధతో కంపిస్తున్నాయి.

"ఇల్యా! వెళ్ళు- నీ స్వాతంత్ర్యానికి నేను అడ్డురాను" అన్నది ఒలింపిటా.

ఇల్యా మౌనంగా ఆమె మాటలను వింటున్నాడు.

"అంతకీ కారణం నేనే నని అనుకుంటున్నావు కదూ? అలా అనుకోకు. ఆ ముసలాడికి నేను ఉంపుడుకత్తెగా ఉన్నందుకు నన్ను ద్వేషిస్తున్నావు" అన్నది ఒలింపిటా.

"అంతా అబద్ధం! నే నలా భావించడంలేదు. పవిత్రమైన స్త్రీలూ, పరిశుద్ధమైన స్త్రీలూ నాలాటివారిని వరించరనే విషయం నాకు తెలుసు. అలాటి మహద్భాగ్యం నాలాటి వారికి కలగదు.

పవిత్రమైన వస్తువులన్నీ శ్రీమంతుల సొత్తు. మన నంటి అభాగ్యులకు మిగిలేవి ఎంగిలి మెతుకులే!" అన్నాడు ఇల్యా.

ఒలింపిటా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "ఇల్యా! ఇల్యా! ఈ అగాధ నరకకూపంలోకి నా అంతట నేనే దిగాను. ఎందుకనుకున్నావు? డబ్బు! డబ్బుకోసం! ఇప్పుడు మళ్ళీ ఈ నరకకూపంనుంచి బైటపడాలని ప్రయత్నిస్తున్నాను. ఇక ముందు పరిశుభ్రమైన జీవితం గడపాలని అనుకుంటున్నాను. ఈ మార్పు నీవల్లనే నాకు కలిగింది. ఈ మార్పుకు కారణం నీ అందంకాదు, నీ యౌవనం కాదు, నీ శక్తికాదు. నా గుండెల్లో బాకుల్లా పొడుచుకునే మాటలన్నావు. ఆ మాటలే నాలో ఈ మార్పు తెచ్చాయి" అన్నది ఒలింపిటా.

ఒలింపిటా ఇలా అని అతనిపాదాలు స్పృశించి నమస్కరించింది. తరువాత ఒలింపిటా మళ్ళీ ఇలా చెప్పసాగింది:

"ఇల్యా! ఒకవ్యక్తి జీవితంలో ఒకసారి పాపంచేస్తే జీవితాంతం వరకూ ఆ వ్యక్తిని శిక్షించవలసిందేనా? నేను చిన్నపిల్లనుగా ఉన్నప్పుడు మా మామయ్య నన్ను చెరిచే ఉద్దేశంతో నా దగ్గరకు వచ్చాడు. నేను అతన్ని లెంపకాయ వేశాను. తరువాత మా బంధువులంతా కలిసి నాచేత తాగించారు. నన్ను ఈ మురికికూపంలోకి దించారు. అంతకు పూర్వం నేనూ అందరు పిల్లల్లాగానే మర్యాదస్తురాలిని. అప్పుడే వికసించిన పూవులా నలగకుండా ఉండేదాన్ని. కానీ అందరూ కలిసి నన్ను ఈ కూపంలోకి దించారు. ఏడ్చాను, వెక్కి వెక్కి ఏడ్చాను. కానీ ఏం లాభం? ఇహ లాభం లేదు. మెట్టు జారాను. ఇహ నా జీవితం ఇంతే అనుకున్నాను."

ఒలింపిటా ఇలా తన జీవితకథనాన్ని వినిపిస్తూ ఉంటే ఇల్యా కనులవెంట మౌనంగా అశ్రుబిందువులు ప్రవహింప సాగాయి. ఆవిడపట్ల హేయభావానికి మారుగా ఎంతో గౌరవ భావం కలగసాగింది. ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూస్తూ అలాగే సజీవ ప్రతిమల్లాగా ఎంతోసేపు కూచున్నారు.

కొన్నాళ్ళు గడిచాయి. పొలెటేవ్ హత్యకు కారణమని అనుమానించబడిన మరో వ్యక్తికొరకు అన్వేషణ సాగుతున్నది. ప్రతిరోజూ హత్యను గురించి కొత్త కొత్తవార్తలు ఇల్యా చెవులకు చేరుతున్నాయి. ఏ వీధిలో విన్నా హత్యను గురించి చర్చలే- 'హంతకు డెవరో మహా సాహసికుడిలాగా ఉన్నాడు. 'పట్టపగలు హత్య! ఎంత ఘోరం!' అనుకుంటున్నారు అందరూ. ఇల్యామటుకు ఈ గొడవలు పట్టించుకోకుండా దూరంగా ఉంటున్నాడు. లోకంతోను, జీవితంతోనూ

విసుగెత్తి ఎక్కడికో దూరప్రదేశానికి తరలిపోదలుచుకున్న విరాగిలా తయారయ్యాడు.

ఇటీవల యాకొవ్ ప్రవర్తనకూడా చాలా విచిత్రంగా మారింది. అతనికి పరధ్యానం మరింత ఎక్కువైంది. ఎప్పుడూ ఏదో అగాధమైన విషయాన్ని ఆలోచిస్తున్నట్టు అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. చేతిలో ఏదోఒక పుస్తకం పట్టుకుని చదువుతూ ఉంటాడు. ఇల్యా కనుక కనిపించాడూ అంటే వదిలిపెట్టడు. ఏకబిగిని ప్రశ్నలవర్షం కురిపించేస్తాడు.

నిజానికి ఆ ప్రశ్నలకు సమాధానాలుకూడా అతనికే తెలియాలి. యాకొవ్ పరధ్యానం ఇల్యాకు చెప్పరాని చిరాకును కలగజేసింది.

"ఏమిటోయ్ మీ నాన్న నన్ను దుంపతెంపేస్తున్నాడు! ఏమిటీ గొడవ ?" అన్నాడు ఇల్యా.

"అలాగట్రా ? ఆ విషయం నాకు తెలీదే! అయినా ఈ గొడవలన్నీ ఎవడికి కావాలి ?" అన్నాడు యాకొవ్.

తరువాత పరధ్యానంగా వేదాంతిలాగా ఆకాశంవంక చూడడం మొదలెట్టాడు. ఒక్కొక్కసారి ఇల్యాకు యాకొవ్ అంటే జాలివేసేది. అతడు అంధుడేమో అనిపించేది. ఈ లోకంసంగతి కానీ, లోకజీవితం సంగతికానీ అతను ఇసుమంతైనా పట్టించుకోడు. తనను తాను ఒక వ్యర్థుడుగా భావించుకుంటాడు. కొంపలు కూలి మీదపడుతూ ఉన్నా అతనికి చీమకుట్టినట్టుగా ఉండదు. పెట్రూకా వేశ్యగృహాన్ని నడుపుతున్న ఒక స్త్రీని వివాహం చేసుకోడానికి నిశ్చయించాడనే

విషయం ఆ ఇంట్లో అందరికీ తెలుసు. యాకొవ్ కూడా ఈ విషయం విన్నాడు. కానీ వినీ విననట్టుగా ఊరుకున్నాడు.

"ఏరా! మీ నాన్న పెళ్ళాడుతున్నాడట కదా ?" అని ఇల్యా అడిగాడు.

"ఎవరూ ? పెళ్ళా ?" అన్నాడు యాకొవ్ తనకు ఈ విషయమే తెలియనట్టుగా. తరువాత ఒక క్షణం ఆగి. "ఛా! అయినా మా నాన్నకు ఈ వయస్సులో పెళ్ళేమిటీ! అయినా దాంతోనా ! ఛీ, ఛీ !" అన్నాడు.

"వారికి ఒక బిడ్డ కలిగితే ఆ ఆస్తికి వారసుడు వాడే అవుతాడు. అప్పుడు నీకు నష్టం కాదుట్రా ?" అని అన్నాడు. ఇల్యా.

"బిడ్డ కలిగితే మరీ మంచిది. ఈ సారా కొట్టు పనంతా వాడే చూచుకుంటాడు. నా తోవన నేను ఎక్కడికైనా వెళ్ళొచ్చు అన్నాడు యాకొవ్.

యాకొవ్ ప్రవర్తన మాత్రమేకాక అతని మాటలు కూడా ఇల్యాకు ఎంతో విడ్డూరంగాను, విచిత్రంగాను కనిపించసాగాయి.

ఇల్యా మటుకు అప్పుడప్పుడూ ఒలింపిటా ఇంటికి వెడుతూ ఉండేవాడు. అతని మనోవేదన ఆవిడ బాహుబంధాల పంజరంలో తానొక పావురాయిలా ఇమిడి నప్పుడు చల్లారిపోయేది.

మధ్య మధ్యలో ఇల్యా పీరానుకూడా కలుస్తూ ఉండేవాడు. పీరా జీవితంకూడా ఇప్పుడు ఎంతో మారిపోయింది.

అనుక్షణం ఆనందం, సంతోషం! కులాసా నృత్యాలు వినో దాలు కొత్త కొత్త ప్రియులు. దిగులూ చింతా లేదు.నగలూ నాణ్యాలు కూడా కావలసినన్ని. వీరా కన్నెత్తి చూస్తే చాలు,ఎంతటి మహర్షి కూడా శీర్షాసనం వెయ్యాల్సిందే- అలా పండగలాగా సుడి గుండంలాగా సాగుతోంది వీరా జీవితం.

"వీరా! జాగర్త! పాతాళంలో పడిపోతున్నావు!" అన్నాడు ఇల్యా.

"పాతాళంలో పడిపోనీ! యమలోకంలో పడిపోనీ! నాకేం లెక్క! పడేదేదో పైలా పచ్చీసుగా కులాసాగా అందంగా హాయిగా తీయగా పడిపోతాను. చాలదూ ?" అన్నది వీరా.

"మరి పావెల్ విషయం ?"

"అత నిహ నన్ను అంటిపెట్టుకుని ఉండి లాభంలేదు. అందువల్ల బాధ తనకే!"

"మరి నీవు పావెల్‌ను ప్రేమించడం లేదా ?"

"పావెల్‌ను ప్రేమించక పోవడం సాధ్యమా ?"

"మరి పావెల్‌ను వదిలేస్తానంటావేం ?"

"ప్రేమ ప్రేమ అని గుదిబండ మెడకు చుట్టుకోనా ?"

"జాగర్త వీరా! నీ జీవితం ఆఖరుకు విషాదాంతంగా మారవచ్చు."

"మరి నేనేం చెయ్యను? ఈ పురుషులందరికోసమూ నేను సృష్టించబడ్డాను. ఎవరిమాట కాదనను ?"

"పొరబాటు పడుతున్నావు. ఇలాంటి రండా చోర్లందరితో..."

"నేనే రండను!" అని కిలాకిలమని నవ్వింది వీరా.

ఇల్యా మరి జవాబు చెప్పలేకపోయాడు. బరువెక్కిన హృదయంతో ఇంటికి తిరిగి వెళ్ళాడు. ఇల్యాకు అప్పుడప్పుడూ పానెల్ కనిపించేవాడు. కానీ తాను ఎప్పుడూ ఏదో తొందరలో ఉన్నట్టుగా ఉండేవాడు. ఇలా కొన్నాళ్ళు గడిచాయి. ఒకరోజున ఇల్యా ఇంటికి తిరిగి వచ్చాడు. గదిలో ప్రవేశించగానే తెరంతి అతని వెనకాలేవచ్చి తలుపు మూశాడు. ఇల్యా వెనక్కు తిరిగి చిరునవ్వు నవ్వాడు.

"ఒకేయ్ అబ్బాయ్! నిన్ను గురించి రకరకాలుగా చెప్పుకుంటూ ఉన్నారురా! ఆ ముసలాడి హత్యలో నీకూ చెయ్యి ఉన్నదట. నీవు దొంగ నోట్లు వేస్తున్నావట- ఇంకా ఇలాగే ఏవేవో చెప్పుకుంటూ ఉన్నారు" అన్నాడు తెరంతి.

"అన్నిటికీ కారణం అసూయ!"అని మాత్రం అన్నాడు ఇల్యా.

"పెట్రూకా కూడా గొడవ చేస్తున్నాడు. చెడు పేరు గలవారు ఈ ఇంట్లో ఉండడానికి వీలు లేదంటున్నాడు. నువ్వు..." అన్నాడు తెరంతి.

"ఏడిశాడు. వాడు నన్ను గురించి నోరెత్తాడంటే చంపేస్తాను" అన్నాడు ఇల్యా.

తెరంతి ఉలిక్కిపడ్డాడు.

"అబ్బాయ్ ! ఏదో పెద్దవాణ్ణి. చెబుతున్నాను విను- నువ్వు ఈ పట్నంలో ఉండడం మంచిది కాదు. ప్రమాదం.

మన ఊరు వెళ్ళు. అక్కడ నీ జీవితం సాఫీగా సాగిపోతుంది. ఒకచిన్న కిరాణాకొట్టు పెట్టుకో- డబ్బు పంపుతూ ఉంటాను. మంచి కులంగల పిల్లను చూచి పెళ్ళి చేసుకుని హాయిగా సంసారం నడుపుకో- దిగుడు దోవలో బండిలాగా ఎలాంటి అడ్డంకులు లేకుండా జీవితం సాగుతుంది" అని ఉపదేశింప సాగాడు తెరంతి.

"నేను ఆ దోవలోకి దిగదలచుకోలేదు. దోనకు ఎదురుగా వెళ్ళ దలిచాను" అన్నాడు ఇల్యా.

ఇల్యా ధోరణి అతనికి ఎంతమాత్రం అర్థంకాలేదు. మౌనంగా ఊరుకున్నాడు.

ఇల్యాకు తన గతమంతా ఒక్కసారి మనస్సులో మెరుపులా మెరిసింది. గది నలువంకలా కలయచూచాడు. తలుపు చప్పుడైంది. ఇరువురూ ఉలికిపడ్డారు. యాకొవ్ లోపలికి ప్రవేశించాడు.

"ఇల్యా ! త్వరగా రావాలి. మనం మాషా నద్దకు వెళ్ళాలి" అన్నాడు యాకొవ్.

"ఏమిటి విశేషం ?" అని ప్రశ్నించాడు ఇల్యా.

"మాషా ఈమధ్య సాయం సమయాల్లో ఇంట్లో ఉండడంలేదు. మటిట్సాతో కలిసి ఎక్కడికో వెడుతూ ఉంది" అన్నాడు యాకొవ్.

"ఏమిట్రా నీ గొడవ? చుక్కపడిందా ?" అని ప్రశ్నించాడు ఇల్యా.

"తాగడం మానేశాను" అన్నాడు యాకొవ్.

ఇద్దరూ కలిసి మాషా గదిలోకి వెళ్ళారు. ఇల్యా ఒక కుర్చీమీద కూర్చున్నాడు. యాకొవ్ ఒక పుస్తకం తెరిచాడు. "చదువుతాను, విను! ఈ గ్రంథం పేరు 'మనిషి పుట్టుక'" అన్నాడు.

ఇల్యా బద్ధకంగా వినసాగాడు.

యాకొవ్ రెండు మూడు పేజీలు చదివిన తరువాత, "ఏమిటో ఈ గొడవంతా! విదేశ మేధావులు ఏవేవో విషయాలు వ్రాస్తారు!" అన్నాడు ఇల్యా.

"అసలీ పుట్టుపూర్వోత్తరా లేమిటో నీకు తెలుసా?" అని అడిగాడు యాకొవ్.

"అంటే నీ ఉద్దేశం?" అన్నాడు ఇల్యా.

"మనిషికి ఆత్మ ఉన్నదంటావా? లేదంటావా?"

"ఉంటే?"

"ఆ ఆత్మ ఎలా ఏర్పడిందో, ఏమవుతుందో తెలుసుకొనడం మనిషి ధర్మం. ఆత్మ అనశ్వరమని కొందరంటారు. ఈ మాటలోని అంతరార్థ మేమిటో గ్రహించాలి. అసలు నీవు ఎలా పుట్టావు? ఆత్మ నీలో ఎప్పుడు ఎలా ప్రవేశించింది? అనే విషయాలను గ్రహించాలి" అన్నాడు యాకొవ్.

"యాకొవ్! నీవు వేదాంతి వైపోతున్నావురా!" అన్నాడు ఇల్యా.

తరువాత ఇల్యా ఇలా చెప్పసాగాడు.

"ఈ వేదాంతాలన్నీ అలా ఉంచు– నా మటుకు నాకు ఈ ప్రపంచమంతా మాయగా కనిపిస్తోంది. ఎటుకన్నా

మోసం, మాయ, దగా తప్ప మరేమీ కనిపించదు. అంతా చక్కగా ముస్తాబవుతారు. తీయగా మాట్లాడుతారు. చిరునవ్వులు వెదజల్లుతారు. కానీ నిజం ఆలోచిస్తే అంతా పచ్చి మోసం. మా బాబాయ్ కానీ, మీనాన్న కానీ, ఎవరుకానీ అంతా దొంగలేం అత్మనంచకులే !"

"నిజమేరా ఇల్యా నువ్వు చెప్పినదంతా! నీవూ, నేనూ అసలు ఈ వాతావరణంలో జీవించవలసినవాళ్ళం కాదు. నీవు ఇతరులను విమర్శించడంద్వారానైనా నానీ మనోయాతనను చల్లార్చుకుంటావు. నాకు అదీ చేతకాదు. నాకూ ఇక్కడినుంచి ఎక్కడికైనా వెళ్ళిపోదామని అనిపిస్తోంది" అన్నాడు యాకొవ్.

"ఎక్కడికి వెడతావురా ?" అని అడిగాడు ఇల్యా.

యాకొవ్ సమాధానం చెప్పలేదు. ఇద్దరూ మౌనంగా కూచున్నారు. తరువాత పెర్ఫిష్కా వచ్చాడు. తాగి ఉన్నాడు. తూగుతూ అడుగులు వేసుకుంటూ మెల్లిగా గదిలో ప్రవేశించాడు. మజిటా కూడా అతని వెనకాలే వచ్చింది.

"ఏరా అబ్బాయిల్లారా! ఏం చేస్తున్నారు? కులాసా?" అని గొణగసాగాడు పెర్ఫిష్కా. తరువాత గిటార్‌పై వెర్రిగా పాట పాడుతూ ఆడసాగాడు. మటిటా గదిలోనే నేలమీద చతికిలబడి కూచుంది.

"మాషా ఏదీ ? ఎక్కడుంది ? ప్రశ్నించాడు ఇల్యా.

మటిటా కూడా తాగి ఉంది. ఇల్యా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు,

ఇల్యా మళ్ళీ ప్రశ్నించాడు. పెర్ఫిష్కా దగ్గరకు వెళ్ళి అతని భుజాలు పట్టుకుని ఊపుతూ "మాషా ఏది? చెప్పు! చెప్పు?" అని గట్టిగా ప్రశ్నించాడు ఇల్యా.

"మాషా! మాషా! ఏమైంది...? ఏమో! వెళ్ళి పోయింది! అమ్ముడైంది!" అని ఏదో ఆలాపన చేశాడు పెర్ఫిష్కా.

ఆ మరునాటి ఉదయానికికాని మాషా విషయం వాడికి తెలీలేదు. మాషా నిజంగానే అమ్ముడుపోయింది.

మాషాని ఒక యాభై ఏళ్ళ వృద్ధునికిచ్చి వివాహం చేశారు. ఆ వృద్ధునికి మొదటి భార్య చనిపోయిందట.

పెర్ఫిష్కా పొయ్యిదగ్గర కూచుని తన కూతురికి, తన కుమారునికి పెళ్ళి జరిగిన కథను ఇలా చెప్పసాగాడు.

"వృద్ధుడు...భార్య చనిపోయింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు.

ఇల్లూ వాకిలీ కనిపెట్టి ఉండడానికి ఎవరైనా కావాలి. వండిపడేసే దిక్కు ఉండాలి. అతను మటిట్సాను పిలిపించి మాట్లాడాడు. మటిట్సా నాతో చెప్పింది.

నేను మాషాను పిలిచి చెప్పాను. చిన్నదయితేనేం? అర్థంచేసుకుంది. అంతే- మూడుముళ్ళూ పడ్డాయి. ఆడ పుటక పుట్టిన తరువాత ఎక్కడో ఒకచోట తలదాచుకోక తప్పుతుందా? అంతే మరి! గత్యంతరం లేదు ... మాషా ఒక ఇంటిదైంది. మా మామూలు మాకు దక్కింది. అదీ అప్పుడే ఖర్చుపెట్టి తాగేశాం."

ఇల్యా మౌనంగా వింటూ కూచున్నాడు. మాషా ఇంత నిబ్బరం నిండూ ఉన్న పిల్ల అని ఇంతకుపూర్వం తను ఎన్నడూ ఊహించలేదు. కానీ ఈ కథ విన్నంతసేపూ ఇల్యా గుండెల్లో బాధ సుళ్ళు సుళ్ళుగా తిరిగింది.

"ఇహ నువ్వు ఏం చేస్తావు?" అని ప్రశ్నించాడు.

పెర్ఫిష్కా నిరామయంగా ఆకాశంవైపు చూచాడు. "ఏంచేస్తాను? ఏంచేస్తాను? తాగుతాను. అంతకన్న మనం చేసేదీ, చెయ్యగలిగిందీనుటుకు ఏమున్నది?" అన్నాడు.

"తాగుడు మానెయ్యలేవా?" అని అడిగాడు ఇల్యా.

"తాగుడా? మానెయ్యడమా?" అని చిరునవ్వు నవ్వి, "మనకు తల్లీ తోడూ అదే!" అన్నాడు పెర్ఫిష్కా.

మాషా వివాహం ఇల్యాకు ఎంత దుఃఖం కలగచేసిందో, అంత సంతోషం కూడా కలగచేసింది. మాషా వృద్ధుణ్ణి వివాహం చేసుకోవలసి వచ్చినందుకు ఇల్యాకు దుఃఖం కలిగింది. ఎలాగయినా ఈ కల్మష వాతావరణం నుంచి మాషా తప్పించుకున్నందుకు సంతోషం కలిగింది.

ఇల్యా అలాగే ఆలోచిస్తూ కూచున్నాడు. బరువైన మేఘాలు ఆకాశంలో తేలుతూ ప్రయాణం చేస్తున్నాయి. ఇల్యాకు గతమంతా ఒక్కసారిగా మనోసీమలో మెరుపులా మెరిసింది. 'ఇక వెళ్ళాలి, నేరం అంగీకరించాలి. తప్పదు' అనుకున్నాడు. ఇల్యా.

ఆ సాయంత్రమే ఇల్యా ఇల్లు ఖాళీచెయ్యవలసిన అవసరం ఏర్పడింది. పగలంతా వీధులు తిరిగి సామాన్లు అమ్మ

కుని ఇల్యా ఇంటికి తిరిగివచ్చాడు. ఇంటికి వచ్చేసరికి తెరంతి బాబాయి తనకోసం కనిపెట్టుకుని ఉండడం గమనించాడు ఇల్యా.

"ఇల్యా! ఇహ నీవు ఇల్లు విడిచి వెళ్ళక తప్పదు" అన్నాడు తెరంతి.

"ఏం ? ఏం జరిగింది ?" అని ప్రశ్నించాడు ఇల్యా.

ఈ సాయంత్రం పెద్ద రభస జరిగింది. యాకొవ్ పెత్రూకా తగాదాపడ్డారు. తండ్రి కదా అనికూడా గమనించకుండా యాకొవ్ పెత్రూకాను నానాతిట్లూ తిట్టాడు. మొహాన్నే పట్టుకుని, 'నువ్వు దొంగవు, కుచ్ఛితుడివి' అన్నాడు. పెత్రూకా ఆ మాటలతో భగ్గున మండిపడి యాకొవ్‌ను చావ చితకకొట్టాడు. యాకొవ్ ఒక మూలనపడి మూలుగుతూ ఏడుస్తున్నాడు. తరువాత పెత్రూకా నా దగ్గరికి వచ్చి 'ఈ గొడవలన్నీ మీ అబ్బాయి ఇల్యా వల్లనే వస్తున్నవి. వాడు ఇహ ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండడానికి వీల్లేదు' అని నన్ను బెదిరించాడు" అని జరిగిన రభసంతా చెప్పసాగాడు తెరంతి.

ఇల్యా అంతా చల్లగా విన్నాడు. ఉగ్రుడయ్యాడు. "ఈ పెటిపట్టుకో, ఇప్పుడే వస్తాను" అంటూ పెత్రూకా దుకాణం వద్దకు తోసుకుని వెళ్ళాడు. పెత్రూకా దుకాణం వద్ద కూచుని ఉన్నాడు. ఇల్యాను చూడగానే. "వచ్చావట్రా అబ్బాయ్! నీ కోసమే ఎదురు చూస్తున్నాను" అన్నాడు.

ఇల్యా ఆ మాటలు వినిపించుకోలేదు. సరాసరి లోపలికి వెళ్ళాడు. గదిలో చిన్న లాంతరు మినుకు మినుకుమంటూ

వెలుగుతున్నది. ఆ మసక కాంతిలో యాకొవ్ ఎక్కడున్నాడో మొదట్లో ఇల్యాకు కనిపించలేదు.

"యాకొవ్ !" అని పిలిచాడు ఇల్యా.

"ఎవరు ?" సన్నగా మూలిగాడు యాకొవ్.

"నేను, ఇల్యాని !"

"వచ్చావురా నాయనా ! ఒక గుక్కెడు మంచినీళ్ళు పొయ్యి" అన్నాడు యాకొవ్.

ఇల్యా యాకొవ్ పడుకుని ఉన్న మంచం దగ్గరకు వెళ్ళాడు. యాకొవ్ ముఖం నిండా నెత్తురు చారలు కట్టింది. పెదవులు చీలాయి. ఉబ్బి పొయ్యాయి.

"త్వరగా నీళ్ళు తెండి! రాక్షసుడు చేతులారా కుర్రాణ్ణి చంపాడు!" అని కేక వేశాడు ఇల్యా.

జనం గుంపులుగా లోపలికి తోసుకుని రాబోయారు. కానీ పెట్రూకా వారిని అడ్డగించి ముందుగా తను గదిలోకి వచ్చాడు.

"వెంటనే ఆస్పత్రిలో చేర్చాలి. బండి పిలు!" అన్నాడు ఇల్యా.

పెట్రూకా ఒకసారి తన కొడుకువైపు చూచాడు. "ఆస్పత్రి అంటే భయం. కేసు వస్తుందేమో!" అన్నాడు పెట్రూకా.

"రాక్షసుడా ! మాట్లాడకు. ఆస్పత్రిలో చేర్చితీరాలి. లేకపోతే ఇప్పుడు జనాన్నంతా పోగుచేసి గల్లంతు చేస్తాను" అన్నాడు ఇల్యా.

పెట్రూకా ఇహ మరి మాట్లాడలేదు. బండికోసం కబురు పంపాడు.

ఆ మరుసటిరోజునే ఇల్యా మకాం మార్చాడు. ఊరికి దూరంగా ఒక మేడమీద ఒక చిన్నగది అద్దెకు తీసుకున్నాడు. సన్నగా రెబ్బలాగా ఉన్న ఒక అమ్మాయి వచ్చి, అతనికి గది చూపింది. "చూడండి, చిన్నగది. ముచ్చటగా లేదూ? అయిదు రూబుళ్ళే అద్దె. చౌక కదూ!" అన్నది అమ్మాయి.

"నువ్వు ఇక్కడ పనిచేసే పిల్లవా?" అని అడిగాడు ఇల్యా.

"ఊఁహూఁ, ఈ ఇంటి యజమానిరాలిని నేనే! మా వారు..." అంటూ ఏదో చెప్పబోయింది ఆ అమ్మాయి.

"నీకు పెళ్ళైందా?" అన్నాడు ఇల్యా ఆశ్చర్యంతో.

ఆ అమ్మాయి అతనివంక కళ్ళు ఇంతలింతలు చేసుకుని చూచింది. "భలేవాడివయ్యా మొత్తంమీద! ఇందాక పనిగత్తెవా అని అడిగావు. ఇప్పుడు పెళ్ళైందా అని అడుగుతున్నావు" అన్నది.

"నీకు పెళ్ళైందని ఎలా అనుకోను? చూస్తే వేలెడంత లేవు" అన్నాడు ఇల్యా.

"నాకు ఇవాళ పెళ్ళైందా? మూడు సంవత్సరాలైంది. మా ఆయన పోలీసు పనిలో ఉన్నాడు" అన్నది ఆ అమ్మాయి.

ఇనువునూ పక్కన నవ్వారు.

"నీవు ఎంతో మంచి కుర్రవాడిలా కనిపిస్తున్నావు. మేము పోట్లాడే మనుష్యులం కాదు. నువ్వు ఈ గదిలో ప్రవేశించాలి" అన్నది ఆ అమ్మాయి ఎంతో ఆదరంతో.

"ఒక గంటలో సామాన్లు తీసుకుని వస్తాను" అన్నాడు ఇల్యా.

ఇల్యాకు మకాం మార్చడం ఎంతో హాయిగా కనిపించింది. పైగా తను ఇప్పుడు పోలీసు ఇంట్లోనే ప్రవేశించడం మరీ వింతగా కనిపించింది.

ఇల్యాకు ఒకసారి ఆస్పత్రికివెళ్ళి యాకొవ్‌ను చూచి రావాలని అనిపించింది. బండి మాట్లాడుకుని ఆస్పత్రికి వెళ్ళాడు. నర్సులను పిలిచి యాకొవ్ విషయం కనుక్కున్నాడు. యాకొవ్‌కు జబ్బు కొంచెం నిమ్మళించిందని, అప్పుడే స్నానంచేసి పడుకో బెట్టినందువల్ల యాకొవ్ నిద్రిస్తున్నాడని చెప్పారు నర్సులు. ఇల్యాకు ఏంచెయ్యాలో తోచలేదు. ఆస్పత్రి వరండాలో అటూ ఇటూ పచార్లు చెయ్యసాగాడు. కొందరు రోగులు గాలికోసం వెలుపలికి వచ్చారు. వారిని చూస్తూ పచార్లు చెయ్యసాగాడు ఇల్యా. హఠాత్తుగా ఎవరో అతని చెయ్యిపట్టుకున్నారు. ఇల్యా వెనక్కు తిరిగిచూచాడు. పావెల్ కనిపించాడు.

"అరె! నువ్వా ఇక్కడే ఉన్నావేమిట్రా?" అన్నాడు ఇల్యా.

"ఇంకా ఎవరున్నారేమిటి?" అన్నాడు పావెల్.

"మన యాకొవ్‌గాడు కూడా ఇక్కడే వున్నాడు" అని జరిగిన కథంతా చెప్పాడు ఇల్యా.

"ఎంత మారిపోయావురా పావెల్?" అన్నాడు ఇల్యా.

"మారక తప్పుతుందట్రా!" అన్నాడు పావెల్.

"ఇంతకీ జబ్బేమిటి ?" అని అడిగాడు ఇల్యా.

"నువ్వే చెప్పుకో చూదాం!" అన్నాడు పావెల్.

"ఏరా ధర్మభిక్షం అనుకుంటాను !" అన్నాడు ఇల్యా వ్యంగ్యంగా.

పావెల్ నవ్వాడు.

"నాకూ ఏనాటికో ఒకనాటికి ఈ గతి తప్పదు" అన్నాడు ఇల్యా. ఎంతో కాలానికి కలుసుకున్న ఇద్దరు మిత్రులూ అక్కడే నుంచుని ఎంతోసేపు ఆ విషయాలూ, ఈ విషయాలూ మాట్లాడుకుంటూ గడిపారు. దూరంనుంచి ఆస్పత్రిలో రోగులమూల్గులు మధ్యమధ్యలో వినిపిస్తున్నాయి.

"ఇంకా నువ్వు ఒలింపిటాతోనే ఉన్నావా ?" అని అడిగాడు పావెల్.

"ఊఁ" అన్నాడు ఇల్యా ఉదాసీనంగా.

♦ ♦ ♦

ఇల్యా కొత్త ఇంట్లో గృహప్రవేశం చేశాడు. అప్పటి నుంచీ అతనికి ఒకే ఒక న్యాయవృత్తి.

ఆ ఇంటి యజమానులైన దంపతులతో పిచ్చాపాటీ మాట్లాడుతూ హాయిగా కాలక్షేపం చెయ్యసాగాడు. ఇంటి యజమానురాలి పేరు తాత్యానా వాసెలెనా. ఆ అమ్మాయి ఎంతో చురుకైన పిల్ల. ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ ఏవో కబుర్లు చెబుతూనే ఉంటుంది.

ఇల్యా ఇంట్లో చేరిన ఒకట్రెండు రోజుల్లోనే తమ దాంపత్య జీవితగాథనంతా పురాణంలా ఇల్యాకు వినిపించింది.

"చూశారండి! మేము అంత ఉన్నవాళ్ళం కాక పోవచ్చు. కానీ నేనూ, మావారూ ఇద్దరం చదువుకున్నవాళ్ళమే కానీ, ఎప్పటికో ఒకప్పటికి మాకు అదృష్టం కలిసిరాక పోతుందా అన్న ఆశమటుకు మాకు లేకపోలేదు. చూశారూ! పైగా మేము ఇద్దరమే- పిల్లా జెల్లా లేరు. కొంతలో కొంత నయంకదండీ! ఇంటి పనంతా నేనే చేస్తాను. పనిదాన్ని పెట్టుకోలేదు. అదో దండగ ఎందుకూ? చూశారూ, పనివాళ్ళంటే ఎంత దండగనుకున్నారు? మనల్ని దోచేస్తారు. అంతేకాదు, నెలకు సరిపడ సామానులన్నీ ఒకేసారి కొంటాము. అందువల్ల ఎంతో కలిసివస్తుంది సుమండీ! ఇలా కాలక్షేపం చేస్తున్నాం-

"రేపో మాపో మీరూ ఒక ఇంటివారవుతారు! అప్పుడు ఇలాగే సంసారం చక్కదిద్దుకుని రావాలి. అందుకని చెప్పాను ఈ గొడవంతా!" అంటూ ఉపదేశించేది ఆ అమ్మాయి.

ఇల్యా చిరునవ్వు నవ్వుతూ ఆ అమ్మాయి మాటలన్నీ వినేవాడు. ఆ సంసారాన్ని చూస్తే ఇల్యాకు ఎంతో ముచ్చటవేసేది. ఆ అమ్మాయి భర్త పేరు కిరిన్.

కిరిన్ పగలంతా పనికి వెళ్ళేవాడు. సాయంకాలం ఇంటికి రాగానే భార్య చక్కగా తయారుచేసి ఉంచి అందించిన టీ పుచ్చుకుని గిటార్‌పై పాడేవాడు. భార్యాభర్తలు చాలాసేపు సరససల్లాపాలతో కాలక్షేపం చేసేవారు.

పేకాడుకునేవారు. ఆ అమ్మాయి భర్త చాలా విచిత్రమైన వ్యక్తి. ఇల్యాను చిత్ర విచిత్రమైన ప్రశ్నలడిగే

వాడు. ఒకసారి "అబ్బాయ్! నువ్వు ఎన్నడైనా కోకిలను చూశావుటోయ్?" అని అడిగాడు.

"ఓ, చూచాను" అన్నాడు ఇల్యా.

"వాటిని పట్టుకున్నావా?" అని అడిగాడు.

"ఉఁహుఁ" అన్నాడు ఇల్యా.

"నేను కోకిలను పట్టుకున్నాను. పంజరంలో వుంచాను. నా చిలిపిచేష్టలు చూచి మా ఆఫీసరుకు కూడా కోపం వచ్చేది"

ఇలా ఇద్దరూ ఎంతోసేపు ముచ్చట్లు చెప్పుకునేవారు. అతను ఇల్యాను టీకి ఆహ్వానించేవాడు.

'ఇవాళ సాయంత్రం మా ఇంటికి టీకి రావాలి. తప్పకుండా రావాలి. మరిచేవు' అనేవాడు.

ఇల్యాకు ఈ దంపతుల జీవితం ఎంతో హాయిగా తీయగా కనిపించింది. ఒడుదుడుకులు లేవు. మిట్టపల్లాలు లేవు. సన్నని రాగంలాగా పంటకాలవలాగా సాగిపోయే జీవితం అది.

దంపతులు చిలకా గోరింకల్లా ఉన్నారు. పంజరం లాంటి చిన్ని ఇంట్లో ముచ్చటైన సంసార యాత్ర సాగిస్తున్నారు.

'మానవుడి జీవితం ఇలా ఉండాలి!' అనిపించింది ఇల్యాకు.

అతనికీ సంసార జీవితం మీాద ఆసక్తి కలిగింది. తనూ ఒకనాటికి ఒక ఇంటివాడవుతాడు. ముద్దైన ఒక అమ్మాయిని పెళ్ళాడతాడు.

'ఒక చిన్న ఇల్లు. అందం, ఆనందం తన జీవితంలో వెల్లివిరుస్తాయి' అని ఊహించసాగాడు ఇల్యా. ప్రక్కగదిలో నుంచి ఆ దంపతుల సంభాషణ వినిపిస్తూ ఉంది. ఇల్లాలు బజారు లెక్క అప్పచెబుతూ ఉన్నది.

తను ఎలా బేరం ఆడిందో రూపాయిచేసే వస్తువును అణాకే తను ఎలా కొన్నదో భర్తకు నచ్చచెబుతున్నది.

"అవునే, నువ్వు రత్నమంటే రత్నానివి! ఏదీ ఒక్క ముద్దివ్వు!" అన్నాడు భర్త.

భర్తకూడా తన గొప్పలు భార్యకు వినిపిస్తున్నాడు. 'తనంటే పై ఆఫీసరు పడిచస్తాడట. తనతో చెప్పందే ఒక్క పని కూడా చెయ్యడట- తనకు ఈ ఈ ఏడాది ప్రమోషన్ తప్పదట'అని అంటున్నాడు భర్త.

ఇలా ఇల్యా జీవితం ఈ కొత్త వాతావరణంలో హాయిగా గడిచిపోతున్నప్పటికీ మధ్య మధ్యలో ఎంచేతనో కానీ అతనికి ఏదో చెప్పరాని దిగులు కలిగేది.

అలాటి సమయాల్లో అతను తప్పనిసరిగా ఒలింపిటా ఇంటికి వెళ్ళేవాడు. కానీ ఎక్కువకాలం ఒలింపిటా ఇంట్లో ఉండగలిగేవాడు కాదు. ఒలింపిటాకు, ఇల్యాకు ఇటీవల కొన్నాళ్ళనుంచీ పొరపులు మొదలెట్టాయి. చిన్న చిన్న పోట్లాటలు ప్రారంభమయ్యాయి.

ఎప్పుడు ఒంటరిగా ఇంటికి వెళ్ళినా ఇల్యా పోట్లాడ కుండా ఇంటికి తిరిగి రావడంలేదు.

ఒకసారి ఇల్యా ఒంటరిగా ఇంటికి వరుసనే నాలుగు రోజులు వెళ్ళలేదు. ఆ రోజు సాయంత్రం ఒలింపిటా దగ్గరి నుంచి ఇల్యాకు ఒక ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో ఇలా ఉన్నది:

"ప్రియమైన ఇల్యా! సెలవు- నేను దూరంగా వెళ్ళి పోతున్నాను. నా కోసం వెదక్కు. వెదికి లాభంలేదు. నేను ఈ నగరం వదిలి ఎక్కడికో వెడుతున్నాను. నాకుజీవితంమీాద రోత కలిగింది. నా మనస్సునూ, వయస్సునూ ఈ పట్నం ఆహుతి తీసుకున్నది.

నేను ఈ కల్మషానికి దూరంగా వెడుతున్నాను. మన మధ్య పోట్లాలమాట అలా ఉంచి- నిజం చెప్పాలంటే, నా మనస్సును నీకు అర్పితం చేశాను. నీతో గడిపిన మధుర క్షణాలు జీవితాంతంవరకూ నాకు జ్ఞాపకం ఉంటాయి. మరో మాట- ఉన్న విషయం నీకు చెప్పక తప్పదు. నాతోపాటు మరో వ్యక్తికూడా వస్తున్నాడు. అతని పేరు అనానిన్. అతను నీకు తెలిసే ఉంటుందని అనుకుంటాను. అతడు ఒక వర్తకుడు. అతనిది చేపల వర్తకం. అతనువట్టి వెర్రివాడు. పాపం! ఎంతో అమాయకుడు - నన్ను పెళ్ళాడతానంటు న్నాడు. మరి ఇక సెలవు!

— ఒలింపిటా"

ఇల్యా ఉత్తరం చదవడం ముగించాడు. అతని కళ్ళ వెంట అశ్రువులు ధారలుగా రాలాయి. ఒలింపిటాతో గడిపిన మధుర క్షణాలన్నీ అతనికి జ్ఞాపకం వచ్చాయి. లేఖను మళ్ళీ మళ్ళీ చదువుకున్నాడు. ఒలింపిటా అతని ముందు సాక్షాత్కరించిన ట్లనిపించింది. అవతలి గదిలోనుంచి ఇంటి యాజమాని పాట వినిపిస్తోంది.

ఇల్యా ఒలింపిటానుగురించే ఆలోచిస్తూ కూచున్నాడు. సాయంకాలం కావస్తూంది. దూరంనుంచి చర్చి గంటలు వినిపించి అతని ధ్యాన సమాధిని భగ్నంచేశాయి.

ఇల్యా మెల్లిగా లేచి చర్చి వైపుకు నడవసాగాడు. చర్చిలో అతను ప్రవేశించేసరికి ప్రార్థనలు జరుగుతూ ఉన్నాయి. ఇల్యా ఒక మూలకు వెళ్ళి నిల్చున్నాడు.

ఒక వృద్ధ స్త్రీ అక్కడికి వచ్చి, "అబ్బాయ్! నీవు నిల్చోవలసిన స్థలం ఇది కాదు" అన్నది. చర్చిలోకూడా తనవంటివారికి అర్హతస్థానం ఉండదేమో అనుకున్నాడు ఇల్యా.

పాలెకేవ్ హత్య జరిగిన తరువాత ఇల్యా చర్చికి వెళ్ళడం ఇదే మొదటిసారి. చర్చిలో అడుగు పెట్టగానే అతనికి హత్య విషయం జ్ఞాపకం వచ్చింది. ఇల్యా ఆపాద మస్తకం కంపించిపోయాడు.

"భగవంతుడా! నన్ను క్షమించు"! అని ప్రార్థించ సాగాడు.

హఠాత్తుగా అతనికి మరో విషయం జ్ఞాపకం వచ్చింది. ఇంటి యజమానురాలు తన గదిలో ప్రవేశించి తను డబ్బు

దాచిన స్థలం కనుక్కుంటుందేమోనన్న అనుమానం కలిగింది.

ఇల్యా వెంటనే చర్చినుంచి బైటికి వచ్చి బండి మాట్లాడుకుని ఇంటికి వెళ్లాడు. ఇంటికి వెళ్ళి వెళ్ళగానే సరాసరి గదిలోకి వెళ్ళాడు. అతను వచ్చిన విసురుకు ఇంటావిడ ఆశ్చర్యపడింది.

ఇల్యా గదిలో ప్రవేశించి ఒకసారి గదినంతా కలయ చూచాడు. డబ్బు యథాస్థానంలోనే ఉన్నది. ఇల్యా జాగ్రత్తగా డబ్బు తీసుకుని పాంటు జేబులో పెట్టుకున్నాడు. ఇంటావిడ వచ్చి గది వాకిట నిల్చుని, "ఒంట్లో బాగాలేదా?" అని ప్రశ్నించింది.

"చర్చికి వెళ్ళాను. ఎంచేతనో తల తిరిగింది" అన్నాడు ఇల్యా.

"కాసేపు విశ్రాంతి తీసుకోండి!" అన్నది ఇంటావిడ.

ఇల్యా మెల్లిగా పక్కమీద పడుకున్నాడు. ఇంటావిడే దగ్గరే ఉన్న కుర్చీలో కూచుని కబుర్లు చెప్పసాగింది.

"మీకు చాలా కష్టం కలిగిస్తున్నా ననుకుంటాను" అన్నాడు ఇల్యా.

"పరవాలేదు" అన్నది ఆ అమ్మాయి.

తరువాత ఒక క్షణం నిశ్శబ్దం. ఆ అమ్మాయి అతన్ని చూచి చిరునవ్వు నవ్వింది.

"ఏమిటి నవ్వుతున్నారు?" అన్నాడు ఇల్యా.

"ఒక విషయం చెప్పనా?" అన్నది ఆ అమ్మాయి.

"ఊఁ."

"అసలు నీకు జబ్బూలేదు. గిబ్బూ లేదు. నీ కో ఉత్తరం వచ్చింది. అదీ అన్నింటికీ కారణం."

"నిజం చెప్పారు."

"నేను, నీకంటె చిన్నదాన్ని. అయినా నీ కో విషయం చెబుతాను విను - ఆ ఉత్తరం వెంటనే చింపి తగలెట్టు.

ఆ అమ్మాయి ఎవరో కానీ నిన్ను వదిలేసిందీ అంటే మంచిపని చేసిందనే నా ఉద్దేశం. నీ వింకా కుర్రాడివి. పెళ్ళికి నిజంగా ఈడు కాదు నీది. అసలు జీవితంలో స్థిరత్వం చిక్కనిదే పెళ్ళి చేసుకోడం భావ్యం కాదు."

ఇల్యా తలవంచుకుని చిరునవ్వు నవ్వుతూ మెల్లిగా ఆవిడ మాటలను వినసాగాడు.

ఆవిడ మళ్ళీ ఇలా చెప్పడం మొదలెట్టింది.

"అలా సిగ్గుపడకు. చింతపడకు. కష్టాలూ, సుఖాలూ మామూలే- వస్తుంటాయి, పోతుంటాయి. ప్రేమ ఒక జబ్బు లాంటిది. ఒకసారి వచ్చి నయమయ్యే జబ్బు కాదు. మధ్య మధ్యలో మనల్ని ఆ జబ్బు బాధపెడుతూ ఉంటుంది. నేను మా ఆయన్ను పెళ్ళాడక ముందు మూడుసార్లు ప్రేమ జబ్బులోపడ్డాను. కొనఊపిరితో మిగిలానంటే నమ్ము- కానీ స్థిరత్వం చిక్కింది. ఆ తరువాత పెళ్లాడాను. మా ఆయన్ని నేను ప్రేమించి పెళ్ళాడానని అనుకోకు. పెళ్ళాడి ప్రేమించాను. తెలిసిందా?"

ఇల్యా ఆవిడ మాటలను శ్రద్ధగా విన్నాడు. 'ఆవిడ ఎంత మంచిది! ఎంత చక్కనిది! తెలివిగల భార్య అంటే ఇలా ఉండాలి' అనుకున్నాడు ఇల్యా.

రోజులు గడిచినకొద్దీ ఆ దంపతులతో ఇల్యాకు పరిచయం అధికం కాసాగింది. ఇల్యాకు సహజంగా పోలీసులంటే అసహ్యం. కానీ కిరిన్ అందరి పోలీసులవంటివాడు కాడు. కిరిన్ హృదయం ఎంతో మెత్తనిది. తాత్యానా కూడా ఇప్పుడు ఇల్యాతో ఎంతో చనువుగా ఉంటున్నది. తమ్ముణ్ణి చూచుకున్నట్టుగా చూచుకుంటోంది. చిన్న చిన్న పనులకు ఇల్యాను బజారుకు నెళ్ళిరమ్మంటోంది కూడా.

ఇల్యాకూడా ఆవిడ చెప్పిన పనులన్నీ ఎంతో సంతోషంతో చేస్తున్నాడు. ఒక విధంగా తానూ ఆ కుటుంబంలో భాగమైపోయాడు అప్పుడప్పుడు వారి ఇంటికి అతిథులు వచ్చి పోయేవారు. ఒకోసారి ఛీఫ్ కమీషనర్ ఆఫ్ పోలీస్ కూడా వారి ఇంటికి వచ్చేవాడు.

♦ ♦ ♦

ఒకరోజున ఇల్యా వారితో పేకాడుతూ కూచున్నాడు. పేకాట మధ్యలో ఆగి, "వడ్డీ వ్యాపారస్తుణ్ణి హత్యచేసిన వ్యక్తి పట్టుబడ్డాడా?" అని అడిగాడు ఇల్యా.

"పొలెక్టేవ్ కదూ?" అన్నాడు కిరిన్.

"ఊఁ" అన్నాడు ఇల్యా.

"ఉండవోయ్! ఆ గొడవలు ఎవరిక్కావాలి? ఏ ముక్క దిగాలి అని నేను ఆలోచిస్తూంటే!" అన్నాడు కిరిన్.

"పట్టపగలు నడివీధిలో హత్య చెయ్యడానికి ఎంతో ధైర్యం అవసరం" అన్నాడు ఇల్యా.

"ధైర్యంకాదు అవసరమైనది. అదృష్టం అవసరం!" అన్నది తాత్యానా.

"హత్యచెయ్యడం అదృష్టమంటావా ?" అన్నాడు కిరెన్.

"హత్య చెయ్యడంలో అదృష్టంలేదు. హత్యచేసి పట్టు బడకుండా తప్పించుకోవడంలో ఉన్నది అదృష్టం" అన్నది తాత్యానా.

తాత్యానా హత్యను గురించి చెప్పిన విచిత్రమైన తీర్పుతో ఆనాటి హత్యాచర్చ ముగిసింది.

రోజులు దొర్లిపోతున్నాయి. ఇల్యా జీవితంలో పెద్ద మార్పేమీ లేదు. బరువుగా బాధగా భారంగా జీవితం సాగిపోతున్నది.

ఇల్యా తోచినప్పుడల్లా వాళ్ళింటికి వెళ్ళేవాడు. ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెబుతూ కాలక్షేపం చేసేవాడు. వారి వద్ద ఏవైనా పుస్తకాలు తీసుకుని చదివేవాడు. ఎప్పుడైనా ఆస్పత్రికి వెళ్ళి పావెల్‌తో పిచ్చాపాటీ మాట్లాడే వాడు.

"ఒరేయ్ అబ్బాయ్ ! ప్రపంచంలో న్యాయమనేది నానాటికీ నశించిపోతోందిరా ! చూడు – మొన్న మటుకు మొన్న ఒక పోలీసు రోడ్డువెంట నడుస్తున్న పేదజనాన్ని 'పందుల్లారా !' అని తిట్టాడు. అంటూ సంభాషణ మొదలెట్టాడు ఇల్యా.

"అవునా అబ్బాయ్! కానీ మన చేతిలో ఏముంది?" అన్నాడు పావెల్.

యాకొవ్ ఇంకా ఆస్పత్రిలోనే ఉన్నాడు. అతని జబ్బు క్షయకిందికి దించింది. యాకొవ్ మంచం ప్రక్కనే మరో రోగి ఉన్నాడు. అతనికి ఒక కాలు తీసేశారు. ఆ రోగితో యాకొవ్‌కు పరిచయం ఏర్పడింది.

యాకొవ్ అతనికి బైబిల్ గ్రంథంలోని కొన్ని పేజీలు వినిపిస్తూ ఉండేవాడు. ఒకసారి ఇల్యా యాకొవ్‌ను చూడడానికి వెళ్ళాడు. ఇల్యా కనిపించగానే, "అబ్బాయ్! మాషా కనిపించండట్రా?" అని అడిగాడు యాకొవ్.

"ఊఁహూఁ" అన్నాడు ఇల్యా.

"అయ్యో దేవుడా! మాషా అప్సరస - భూతానికి బలైపోయింది" అన్నాడు యాకొవ్. యాకొవ్ తన స్నేహితుణ్ణి ఇల్యాకు పరిచయం చేశాడు. "అబ్బాయ్! నే నింకా కొన్నాళ్ళపాటు యీ ఆస్పత్రిలోనే ఉండ దలుచుకున్నాను. ఈయనకూ నాకూ పరిచయం కలిగింది. హాయిగా బైబిల్ చదువుకుంటూ కాలక్షేపం చేస్తున్నాము. బైబిల్ ఎంత చక్కని గ్రంథం! అడుగడుగునా అందాలుచిందే గ్రంథం బైబిల్. చూడు, అందులో వ్రాయబడిన ఈ మాటలు ఎంత గొప్పగా ఉన్నాయో– 'సత్యాన్వేషణలో మానవుడు చేసే సాహసకార్యాలు ఎన్నటికీ పాపాలు కానే కావు" అని చెప్ప సాగాడు యాకొవ్.

ఇల్యా చివరిమాటలు వినగానే ఉలిక్కిపడ్డాడు.

తరువాత యాకొవ్ ప్రక్కనే ఉన్న రోగి ఇల్యాకు చెప్పసాగాడు :

"అబ్బాయ్! సత్యాన్వేషణ ఎంతో క్లిష్టమైనది. ఎడురీతలాంటిది. అది ఇట్టే దాపుకు వచ్చినట్లుగా ఉంటుంది. కానీ అంతలోనే దూరమైపోతుంది. చూడు బాబూ! నా కాలు వాచింది. తెగినదికాదు. నా గుండెకు కూడా ఈ జబ్బు పట్టుకున్నది. ఇహ నేను ఎంతో కాలం బ్రతకను. కానీ నాకు జీవితంమీద మక్కువ తీరలేదు. నాకు మరణించాలనే కోరిక లేదు. ఎందుచేత నంటావా? నేనెన్నడూ జీవితాన్ని అనుభవించలేదు. జీవితంలోని సారస్యాన్ని గ్రోలలేదు. నాకు జీవితం ఎప్పుడూ దూరంగానే ఉంటూ వచ్చింది. జీవితంలో నేను అనుభవించినదల్లా పరాభవాలూ, పరాజయాలే!

చిన్నతనంలో నేనూ యాకొవ్‌లాగా నా తండ్రి రాక్షస పదఘట్టనలలో నలిగిపోయాను. నేనూ తల్లి లేనివాణ్ణి. నన్ను కని నా తల్లి కన్నుమూసింది.

తరువాత బానిసగా పెరిగాను. పెరిగి పెద్దవాణ్ణయ్యాను. వివాహం చేసుకున్నాను. కానీ నా వివాహ జీవితం కూడా ఇలాగే భ్రష్టమయింది, నా భార్య నన్ను ప్రేమించలేదు. బలవంతంగా ఆ పిల్లను నాకు కట్టబెట్టారు. పెళ్ళయిన మూడోనాడే అది ఉరిపోసుకుని చనిపోయింది. మా బావమరిది ఒకడున్నాడు. వాడు నా డబ్బంతా కాజేశాడు.

మా ఆవిడ ఆత్మహత్యకు నేనే కారణమన్నారు. అంతా నన్ను ఆడిపోశారు.

తరువాత తొమ్మిది సంవత్సరాలు బ్రతికాను. కానీ అది ఒక బ్రతుకా ? బ్రతికానంటే బ్రతికాను, అంతే. ఏదో ఆనందం జీవితంలో తొంగి చూస్తుందనుకున్నాను కానీ చివరకు మిగిలిన నేస్తం ఈ మరణశయ్య ఒక్కటే. ఎందుకు పుట్టినట్టు ? ఎందుకు బ్రతికినట్టు ?" వృద్ధరోగి తన జీవిత కథ నాన్ని ముగించాడు.

ఇల్యా హృదయంలో భయం భూతంలా మేల్కొన్నది. సహస్రముఖాలుగా విజృంభించింది. ఈ ప్రపంచం, ఈ బ్రతుకు, ఈ మానవజాతి, ఈ సంఘం- సమస్తం అతనికి అగమ్యగోచరంగా, బాటలేని ఒక మహారణ్యంలా కనిపించ సాగింది.

ఇల్యా అక్కడ ఒక్కక్షణం కూడా ఉండకలేక పోయాడు. అక్కడి నుంచిలేచి ఇంటిదోవ పట్టాడు. రోగి మెల్లిగా అన్న ఆఖరుమాటలు అతనికి వినిపించాయి.

"బాబూ! ఎంతయినా మనిషికి జీవితంమీద తీపి నశించదు. మరణించిన సింహంకంటె జీవించి ఉన్న శునకం నయమంటారు" అన్నాడు.

ఇల్యా బరువెక్కిన గుండెతో ఇంటికి నడవసాగాడు. అతని చెవుల్లో రోగి మాటలే మారుమ్రోగుతున్నాయి.

ఇల్యా తనలో తను ఇలా ఆలోచించుకో సాగాడు.

'న్యాయం న్యాయం అంటారు - ఈ న్యాయానికి అర్థం ఏమిటి ? భగవంతుడు న్యాయం చేస్తాడంటారు. ఇది ఎంతవరకు నిజం ? తప్పులోహాన్ని భక్షించినట్లుగానే కాలం

ఈ న్యాయ స్వరూపాన్ని భక్షించిం దేమో!' అను కున్నాడు ఇల్యా.

రెండు విరుద్ధ శక్తులు అతనిలో పోరాడుకో సాగాయి. సమన్వయం దొరకని సందేహాలతో, అనుమానాలతో సత మత మవుతూ తలవంచుకుని ఇంటికి వెళ్ళాడు.

ఇల్యా ఇల్లు చేరాడు. కానీ అతనికి శాంతి కనిపించ లేదు. ఇంటావిడ వచ్చి అతన్ని పలకరించింది.

"ఏమిటయ్యా! ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటావు? నీలాంటి తెలివిగల వ్యక్తి ఏ పని చెయ్యలేడూ అంట!" అన్నది.

ఇల్యా చిరునవ్వు నవ్వాడు.

"ఇంతకూ నీకు నీ వ్యాపారం వల్ల ఏ మాత్రం గిడు తోంది?" అని అడిగిం దావిడ.

ఇల్యా ఆవిడకు తన వ్యాపారం గురించిన వివరాలన్నీ చెప్పాడు.

ఒకనాటి సాయంత్రం ఇల్యా వరాండాలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. అతనికి ఒలింపిటా జ్ఞాపకం వచ్చింది. ఒలింపిటాను గురించి ఆలోచిస్తూ పచార్లు చేస్తూ ఉన్నాడు ఇల్యా.

ఇంటావిడ ఏదో పని తొందరలో ఉన్నట్టుగా వచ్చి అతన్ని టీకి పిలిచింది. మారు మాట్లాడకుండా ఇల్యా ఆవిడను అనుసరించాడు. గదిలో ఆ డ భర్త కిరిన్ కూడా ఉన్నాడు. ముగ్గురూ టీ టేబిల్ వద్ద కూచున్నారు. టీ సేవించారు. తాత్యానా ఇలా సంభాషణ మొదలెట్టింది.

"ఇల్యా! నేనూ, నా భర్తా నీతో ఒక ముఖ్యమైన విషయాన్ని మాట్లాడదలిచాము" అన్నది ఆవిడ.

"ఆఁ ఆఁ! అవును, నేనూ నా భార్య నీతో ముఖ్యమైన విషయాన్ని మాట్లాడదలిచాము" అన్నాడు కిరిన్.

"చూశావ్! మేము కొంత డబ్బు కూడబెట్టాము" అన్నది భార్య.

"అవును, నేనూ ఇదీ కలిసి కొంత డబ్బు కూడబెట్టాము" అంటూ అందుకున్నాడు భర్త.

"ఒక్క వెయ్యి రూబుళ్ళు కూడబెట్టి ఉంటాము - బాంకులో నూటికి నాలుగు రూబుళ్ళు వడ్డీ వస్తుంది" అన్నది మెల్లిగా.

"ఆ వడ్డీ సరిపోతుందా?" అన్నాడు భర్త.

"ఉండండీ! నన్ను చెప్పనీయరండీ!" అంటూ ఇలా చెప్పడం మొదలెట్టింది భార్య:

"ఇల్యా! నీవు ఒకసారి నాతో వ్యాపారం వల్ల చాలా లాభం వస్తోందని చెప్పావు. జ్ఞాపకం ఉన్నదా? మా డబ్బు నీకు అప్పుగా ఇవ్వదలిచాము. ఆ డబ్బుతో నువ్వు వ్యాపారం మొదలెట్టు. నీ హస్తవాసి మంచిది. తప్పకుండా కలిసి వస్తుంది. లాభాలు చెరిసగం పంచుకుందాం. నీ జీవితంకూడా హాయిగా సాగిపోతుంది."

ఇల్యా ఈ మాటలు విని నివ్వెరపోయాడు. అతనికి ఏం సమాధానం చెప్పాలో తోచలేదు.

ఒకక్షణం గదిమూలన వెలుగుతున్న కొవ్వొత్తులవంక చూచాడు.

ఆవిడ మళ్ళీ ఇలా చెప్ప సాగింది. "అబ్బాయ్! తొందరలేదు. నెమ్మదిగా ఆలోచించుకో- మన బాధ్యత మనం సక్రమంగా నిర్వర్తిస్తేచాలు. పైన ఈశ్వరుడే ఉన్నాడు."

"నేనూ ఒక్క వెయ్యి రూబుళ్ళు పెట్టుబడి పెడతాను. మా బాబాయి నాకు వెయ్యి రూబుళ్ళు ఇస్తానని వాగ్దానం చేశాడు" అన్నాడు ఇల్యా.

"ఇహ ఇంకేమిటే! మనం కొండెక్కినట్టే- త్వరగా ఆ షాంపేన్ సీసా అందించు. పార్టీ చేసేద్దాం" అన్నాడు ఆవిడ భర్త.

ఇల్యా షాంపేన్ సీసా కొనుక్కుని రావడం కోసం బైటికి వెళ్ళాడు.

అదృష్ట దేవత ఎంత విచిత్రమైంది. తనను నానా యాతనలూ పెట్టింది. అధః పాతాళానికి దించింది. ఇప్పుడు మళ్ళీ చిరునవ్వు చిందిస్తూ ఉన్నది. ఎంతలో మార్పు! అని అనుకో సాగాడు ఇల్యా. అతనికి ఇప్పుడు భావి జీవితం అగమ్యగోచరంగా కనిపించడం లేదు. పథం స్పష్టంగానూ, సుగమయంగాను కనిపిస్తూ ఉంది.

అతను ఇకముందు తన జీవితాన్ని పూర్తిగా మార్చు కుంటాడు. భూతమందిరంనంటి గత జీవితాన్నుంచి విముక్తి పొందుతాడు. అందమైన, ఆనందమైన నూతన జీవితాన్ని ప్రారంభిస్తాడు.

ఇల్యా జీవితం యింతవరకూ దారంతెగని గాలిపటంలా ఎగిరింది. అతని బ్రతుకంతా ఎడారి బ్రతుకైంది. ఎక్కడా

నీడ కనిపించలేదు. ఇల్యాకు జీవితంలో తొలిసారిగా అండ చిక్కినట్లనిపించింది. ఇల్యా షాంపేన్ సీసా కొనుక్కొని తిరిగి వచ్చాడు.

ముగ్గురూ పార్కులో కూచున్నారు. ఇల్యా సీసా తెరి చాడు. ఇలా చెప్పడం మొదలుపెట్టాడు—

"ఏమనుకున్నారో! అసలు రకం షాంపేన్ పట్టు కొచ్చాను. హాయిగా తాగండి. ఇంతవరకూ బ్రతికాను. బ్రతికానంటే బ్రతికానా? అదీ ఒక బ్రతుకేనా? అంతకన్న చావు నయం, దారంలేని గాలిపటంలా ఎగిరాను. ఏ కొమ్మ మీదంటే ఆ కొమ్మమీద వాలాను. ఎక్కడా పట్టుచిక్క లేదు. ఇన్నాళ్ళకు ఒక బాటనేది కనిపించింది. ఒక అండ చిక్కింది. మానవప్రపంచంలో ప్రేమా, స్వచ్ఛతా ఉన్నదనే విశ్వాసం తొలిసారిగా కలిగింది."

ఒకపక్షి తను పాడే పాటకు తానే పొంగిపోతూవుంటే పిల్లి ఆ పక్షివంక ఎలా చూస్తుందో తాత్యానా ఇల్యావంక అలా చూచింది. ఆవిడ కళ్ళల్లో తళుక్కున ఒకకాంతి మెరిసింది.

♦ ♦ ♦

తరువాత కొన్నాళ్ళపాటు ఇల్యా, తాత్యానా తమ కొత్త పథకాన్ని గురించి చర్చలు సాగించారు. ఆవిడ అతనికి ఎన్నో వ్యాపార రహస్యాలు చెప్పింది. వ్యాపారాన్ని గురించి ఆవిడ పరిజ్ఞానాన్ని విని ఇల్యా ఆశ్చర్యపోయాడు.

ఇల్యాకు భావిజీవితం ఆనందదాయకంగా, ఆశాపూరి తంగా కనిపించసాగింది. ఇల్యా ఒకరోజున ఆస్పత్రికి వెళ్ళాడు.

పావెల్ కనిపించాడు. పావెల్‌కూడా కులాసాగా, హుషారుగా ఉన్నాడు. "నేను ఈ రోజున డిస్‌ఛార్జి అయ్యాను. ఇంటికి వెళుతున్నానోయ్! మీరా ఎప్పుడెప్పుడు కనిపిస్తుందా అని ఉన్నది" అన్నాడు. పావెల్ ఇల్యా తరువాత యాకొవ్‌ను చూడడానికి వెళ్ళాడు. యాకొవ్ మంచంమీద పడుకుని చూరునంక చూస్తున్నాడు. యాకొవ్ కళ్ళల్లో కాంతి తరిగి పోయింది. ఎంతో చిక్కిపోయాడు. బలహీనంగా ఉన్నాడు.

"నీకు మాషా కనిపించిందా?' అని ప్రశ్నించాడు యాకొవ్.

"ఉఁహుఁ" అన్నాడు ఇల్యా.

"ఇల్యా! మాషా క్షేమసమాచారాలు కనుక్కో—మాషా మనకు నేస్తం. వట్టి పిచ్చిపిల్ల! ఎక్కడున్నదో ఏం చేస్తున్నదో!" అన్నాడు యాకొవ్. యాకొవ్ కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. ఇల్యాకుకూడా జాలి కలిగింది. "మాషా విషయం తప్పకుండా కనుక్కుంటాను" అన్నాడు ఇల్యా.

యాకొవ్‌కు యిచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడంకోసం ఇల్యా తను పూర్వం నివసిస్తూ వచ్చిన గృహంవైపుకు నడక సాగించాడు. అతను పరధ్యానంగా నడుస్తూ పెట్రూకా సారాకొట్టుకూడా దాటిపోయాడు. తీరా ఎంతదూరం వచ్చానా అని తిరిగిచూస్తే పొలాలగట్టున నిల్చుని ఉన్నాడు. సూర్యాస్తమయం అవుతున్నది. సంధ్యాకాంతి పచ్చని పచ్చికపై పరుచుకున్నది. ఇల్యా నిశ్చలంగా అనంతమైన ఆకాశాంచలం వైపుకు నడవసాగాడు. అడుగడుగునా ఒకకొత్త కల అతని మనస్సులో మొలకెత్తసాగింది. స్వప్నతరంగాలు

అతని మనస్సులో అల్లకల్లోలంగా చెలరేగసాగాయి. ఇల్యా ఊహించుకోసాగాడు –

'అతనొక పెద్ద శ్రీమంతుడవుతాడు. నేడలూ, మిద్దెలూ, పేనకులూ, పరివారం, హంగామా అంతా ఉంటుంటి. డబ్బుతో పాటు అధికారం కూడా – తన మాటకు ఎదురుండదు. అనుకున్న పని అయితీరాల్సిందే-తనకు అపకారం చేసిన పెట్రూకాను శిక్షిస్తాడు. పెట్రూకా పశ్చాత్తాపంతో తనకాళ్లు పట్టుకుంటాడు. 'దయతలచండి బాబయా!' అని తనను కాళ్ళా వేళ్ళాపడి ప్రార్థిస్తాడు. అప్పుడు ఇల్యా ఇలా అంటాడు –

'నిన్ను దయతలచాలా? రాక్షసుడా! నువ్వు నీ జన్మలో ఎన్నడైనా ఎవరినైనా దయదలిచావా? నీకు దయా గుణం అంటే ఏమిటో తెలుసునా? కన్నకొడుకును కటిక వాడికన్నా హీనంగా దండించావు. నా బాబాయిని ధ్వంసం చేశావు. నన్ను బంతిలా తన్నావు. నీ ఇంట్లో బ్రతికిన ప్రతి వ్యక్తి జీవితంలోను నిప్పులు పోశావు. నిన్నూ, నీ ఇంటినీ ధ్వంసం చేస్తాను.'

సంధ్యాకాంతి మెల్లి మెల్లిగా అదృశ్యమై చీకటి తెరలుగా వ్యాపించసాగింది.

దూరంగా అడవికొసన ఎత్తుగా కొండలు, కొండలోయలో సర్పంలా నది. ప్రకృతి భయానకంగా ఉన్నది. ఇల్యా నడుస్తూ పాడుతూ వెడుతూ ఉన్నాడు. అతని మనస్సులో అతని విరోధుల పుట్ట పెరుగుతూఉన్నది. విరోధుల నందరినీ అతను విధ్వంసం చేస్తున్నాడు. హఠాత్తుగా ఏదో

దుర్వాసన అతనిముక్కులకు సోకింది. ఇల్యా పాట ఆపేశాడు. ఎరమీాతాతతో ఎన్నో పర్యాయాలు తాను షికారుకు వచ్చే పచ్చికప్రదేశం కనిపించింది. అతను వీధుల్లో పాత బట్టల పేలికలు ఏరుకున్న రోజులు జ్ఞాపకం వచ్చాయి. ఇల్యా ఎరమీాతాతను సమాధిచేసిన స్థలానికి వెళ్లాడు. కానీ ఆ సమాధి కనిపించలేదు. దుబ్బుల్లో పూడిపోయి ఉంటుంది. ఇల్యా ఒకమాటు నిశ్వసించాడు.

ఇల్యా ఒక పొదదగ్గర కూచున్నాడు. అతని మనో పథంలో ఆలోచనా మేఘాలు ప్రయాణం చెయ్యసాగాయి. 'ఒక విధంగా నా జీవితం మంచిదే- నేను చేసినపాపం ఒకటే- ఆ వడ్డీ వ్యాపారస్తుణ్ణి హత్యచేశా -ఆ హత్యచేసి ఉండకపోతే నా జీవితం మరెంత బావుండేదో!' అన్నది ఒక గొంతు.

'హత్యచేస్తే చేశావు. అయిపోయింది కదా! ఇహ దాన్ని గురించి ఎందుకు తాపత్రయ పడతావు?' అన్నది మరో గొంతుక.

ఏదో చప్పుడైంది. ఇల్యా ఉలిక్కిపడ్డాడు. ఒక కుక్క పిల్ల మొరుగుతూ అతని ముందుగా వెళ్ళింది. ఇల్యాభయంతో కుంచించుకున్నాడు. చీకటి హఠాత్తుగా ముద్దకట్టి కుక్క రూపం ధరించినట్లుగా అతనికి తోచింది. అతను మెల్లిగా నడవసాగాడు. కాళ్ళు పడిపోతున్నాయి. గాలి చల్లగా వీస్తోంది. ఇల్యా వాగుఒడ్డుకు వచ్చి కూచున్నాడు. దూరంగా పడవల్లో దీపాలు కనిపిస్తున్నాయి. ఇల్యాకు ఏదో చెప్పరాని దిగులు కలిగింది. ఒక క్షణంక్రితం జీవితం ఎంతో మధురంగా కనిపించింది. కానీ ఇంతలోనే జీవితం విషభుక్తంగా కనిపి

స్తోంది. ఏమిటీ విచిత్రం! ఇల్యా ఎంత ఆలోచించినా ఈరహస్యం అతనికి బోధపడలేదు. ఇల్యా ఆకాశంవంక చూచాడు. తారలు మినుకు మినుకు మంటున్నాయి. చంద్రబింబం ఎరుపెక్కిన కన్నులా కనిపిస్తోంది. ఇల్యా ఆలోచిస్తూ అక్కడే కూచున్నాడు. ఎంత తర్కించుకున్నా ఆలోచన తెగడం లేదు. క్రమక్రమంగా ఒక విధమైన శూన్యత్వం అతని మనస్సును ఆవరించింది.

ఇల్యా ఇల్లు చేరేసరికి ఎంతో ఆలస్యమైంది. ఈ సమయంలో గంటమోగిస్తే బావుంటుందా బావుండదా అని తటపటాయిస్తూ కాసేపు వాకిట్లో నుంచున్నాడు.

చివరకు ధైర్యంచేసి బెల్ నొక్కాడు. తాత్యానా నచ్చి తలుపు తెరచింది. తలుపు తెరచీ తెరవడంతోటే, "త్వరగా లోపలికి రా!" అన్నది.

"ఇంత ఆలస్యంగా వచ్చావేం?" అన్నది.

ఇల్యా లోపలికి వెళ్ళాడు. ఇంట్లో తాత్యానా ఒక్కతి మాత్రమే ఉన్నది. నగ్నంగా ఉన్నది. ఇల్యా లోపలకు అడుగుపెట్టగానే అతన్ని గట్టిగా కౌగిలించుకున్నది. ఇల్యాకు ఏం చేయాలో తెలిలేదు.

తాత్యానా కిలాకుమని నవ్వింది.

ఇల్యా ఆవిడను గట్టిగా అదుముకున్నాడు. ఆవిడ లతలా పెనవేసుకున్నది. అతన్ని గట్టిగా ముద్దాడ సాగింది. చివరకు ఆవిడను చేతులపై ఎత్తుకుని ఇల్యా లోపలికి తీసుకుని వెళ్ళాడు.

మరునాటి ఉదయం.

ఇల్యా నిద్రలేచాడు. అతని మనస్సు ఆందోళనా పూరితంగా ఉన్నది. రాత్రి జరిగిన పనికి అతనిలో పశ్చాత్తాపం కలగసాగింది. ఇహ తాను కిరిన్ ముఖం ఎలా చూడగలడు? అనేక పరస్పర విరుద్ధమైన భావాలు అతనిలో ఘర్షించ సాగాయి. తను ఎంతగా యత్నిస్తున్నా అతని జీవితం ఒక్కొక్క మెట్టే అడుక్కు దిగజారు తున్నట్లు అనిపించింది.

ప్రతిరోజూ తన భర్త డ్యూటీకి వెళ్ళగానే తాత్యానా ఇల్యా గదిలోకి పరుగెత్తుకుని వచ్చి, "అబ్బాయ్! ఒక్క ముద్దు! త్వరగా-" అనేది.

"ఇదేమిటి? ఇప్పుడేగా నీ భర్త నిన్ను ముద్దాడి డ్యూటీకి వెళ్ళాడు?" అనేవాడు ఇల్యా.

"అబ్బో! అబ్బాయిగారికి అసూయ మొదలెట్టిందే!" అనేది తాత్యానా.

ఇల్యా తాత్యాను గట్టిగా ముద్దాడేవాడు. ఇరువురూ పడక సుఖాన్ని తనివితీరా అనుభవించేవారు.

తరువాత ఇల్యా చిరునవ్వు నవ్వుతూ ఇలా అనేవాడు:

"నువ్వు చాలా సాహసికు రాలివి సుమా! మగని కళ్ళుకప్పి ఎంత అసాధ్యమైన పని చేస్తున్నావు!"

తాత్యానా కళ్ళు మిలమిలా మెరిసేవి. ఇల్యా అన్న మాటకు తాత్యానా ఇలా చెప్పేది:

"ఇందులో అసాధ్యమూ లేదు. సాహసమూ లేదు. ఆడది అస్తమానం భర్తనే అంటిపెట్టుకుని ఉంటుందా? మధ్య మధ్యలో మార్పు అవసరం."

ఇల్యా టీ సేవిస్తూ ఈ మాటలు వింటూ కూచున్నాడు. అతనికి ఒలింపిటా జ్ఞాపకం వచ్చింది. ఈ అమ్మాయి కంటె ఒలింపిటాయే నుంచిదని అనిపించింది ఇల్యాకు.

తాత్యానా మళ్ళీ ఇలా చెప్పసాగింది. "అబ్బాయ్! ఆడదాని అదృష్టం అందం. అందం లాటరీ టికెట్టు వంటిది. అందంతో చెయ్యలేని పనంటూ లేదు. ఈ ప్రపంచాన్నంతా కొనాలన్నా అందంతో కొనెయ్యవచ్చు. నిజం చెప్పనా? నా భర్తంటే నాకు అసహ్యం- నా మనస్సునూ, వయస్సునూ నీకే సమర్పిస్తాను."

ఆ సాయంత్రం ఇల్యా ఇంటికి తిరిగి వచ్చేసరికి కిరిన్ కనిపించాడు. అతడు చాలా కులాసాగా హుషారుగా ఉన్నాడు.

"చూశావుటోయ్! ఇవాళ మా ఆవిడ ఎంచక్కా వంట చేసిందో- త్వరగా రా! నువ్వుకూడా ఓ నలుసు రుచి చూద్దువు గాని" అన్నాడు.

ఇల్యా ఆ రోజున కిరిన్‌తో కలిసి అక్కడే భోజనం చేశాడు.

రోజులు గడుస్తున్నాయి. ఇల్యా తాత్యానాల ప్రణయ కలాపం రహస్యంగా సాగిపోతూ ఉంది. కానీ ఇల్యాకు తాత్యానా పట్ల నానాటికీ ఏవగింపు కలగసాగింది. పూర్వం ఉంటూ వచ్చిన గౌరవం పూర్తిగా నశించింది. భర్త డ్యూటీకి వెళ్ళగానే తాత్యానా ఇల్యా గదిలోకి వచ్చి కూచునేది. కథలూ, కబుర్లూ చెబుతూ కాలక్షేపం చేసేది. ఆవిడ చెప్పే కథల్లోని కథనాయిక అంతా రంభలూ, ఊర్వశులూ - అది

ఒక కామస్వర్గం. కామం ఒకటే లోకజీవిత వస్తులానికి కేంద్రం.

'నువ్వు చెప్పేవన్నీ వట్టి కల్లిబొల్లి కబుర్లు. అన్నీ పచ్చి అబద్ధం!' అనేవాడు ఇల్యా.

ఆవిడ కిలాకుమని నవ్వేది.

'ఉదాహరణలు చెప్పనా?' అంటూ ఆవిడ ఇలా మొదలెట్టేది. 'ఈ ఊరి గవర్నర్‌కూ, ఛాన్సెలర్ భార్యకూ రహస్య సంబంధం ఉన్నది. ఇటీవల మరో గమ్మత్తు జరిగింది. ఛాన్సెలర్ ఒక గుమాస్తా భార్యను లేవదీసుకుని పోయాడు. ఇలాంటి సంఘటనలు లక్షలు.'

ఆవిడ చెప్పేమాటలు వింటూ ఉన్నప్పుడు ఇల్యాకు ఈ ప్రపంచమూ ఈ సంఘమూ ఒక మురికి గుట్టలాగా కనిపించసాగింది.

ఒకసారి తాత్యానా ఇల్యాను 'నీ ప్రథమ ప్రణయానుభవాన్ని గురించి చెప్పవూ?' అని అడిగింది.

'ఇలాంటి ప్రశ్నలు అడగొచ్చా?' అన్నాడు ఇల్యా.

తాత్యానా నవ్వింది. 'చెప్పవూ! చెప్పవూ?' అంటూ బలవంత పెట్టింది. ఇల్యా మాట్లాడక మౌనంగా ఊరుకున్నాడు.

ఇల్యా ఇలా బెట్టుగా ఉన్న సమయాలలో ఆవిడ అతనిపై ఒక బ్రహ్మాస్త్రం ప్రయోగించేది. తనంత తానే కల్పించుకుని అతని కామ ప్రవృత్తి ప్రేరేపింపచేసి అతన్ని సుముఖుణ్ణి చేసుకునేది.

ఒక రోజున మటిటా ఇల్యాను చూచి వెడదామని వచ్చింది.

ఇల్యా మటిట్జాను చూచి ఆశ్చర్యపోయాడు.

మటిట్జా ఎంతో మారిపోయింది. ముడతలు పడిన ముఖం, చిరిగిన గౌను, తలకు చేరుమాలు చుట్టుకున్నది. అడుగుతీసి అడుగు వేస్తే పడిపోయేలా ఉన్నది.

ఇల్యాను చూడగానే, "అబ్బాయ్! ఇక ఎన్నాళ్ళో బ్రతకను. రోజులు దగ్గరికి వచ్చాయి" అన్నది.

"ఇప్పుడు జీవయాత్ర ఎలా సాగిస్తున్నావు?" అని ప్రశ్నించాడు ఇల్యా.

"చర్చివాకిట్లో గుడ్డపరుచుకుని అడుక్కుంటున్నాను" అన్నది.

"కొంచెం టీ పుచ్చుకో!" అని ఇల్యా టీ తీసుకుని వచ్చి ఇచ్చాడు.

"మాషా ఎలా ఉంది?" అడిగాడు ఇల్యా.

"మాషా సంగతేం చెప్పను నాయనా? ఆ వృద్ధుడు మాషాను నానా యాతనలు పెడుతున్నాడు. ఒకటి రెండు సార్లు అతనితో పడలేక తప్పించుకుని పోయింది. కానీ పోలీసులు మళ్ళీ పట్టుకుని వచ్చారు."

ఇల్యాకు మాషాతో తను గడిపిన రోజులన్నీ జ్ఞాపకం వచ్చాయి.

"ఇక వస్తాను నాయనా!" అంటూ మాషా కాళ్ళీడ్చు కుంటూ వెళ్ళి పోయింది.

తాత్యానా వెంటనే పరుగుతీస్తూ వచ్చి ఇల్యా మెడ చుట్టూ చేతులు పెనవేసి "నీ తొలి ప్రియురాలు ఈవిడే కదూ?" అని కిలాకుమని నవ్వింది.

"తాత్యానా! పరిహాసాలకు ఇది సమయంకాదు. నా చిన్ననాటి నేస్తం మాషా పడుతున్న కష్టాలు నాకు చెప్ప డానికి వచ్చిం దీవిడ" అని మాషా కథను ముక్తసరిగా చెప్పాడు.

తరువాత తాత్యానా ఇలా చెప్పసాగింది. "అబ్బాయ్! జీవితంలో జరిగే మంచి చెడ్డలకు మనం చెయ్యగలిగిందేమీ లేదు. ఎలాగయినా సుఖాన్ని అనుభవించడనే మనం చెయ్యగలిగిన పని. నాలుగు రోజులు ఆగితే ఆ వృద్ధ భర్త మరణించడూ? అప్పుడు మాషా విధవరాలవుతుంది. ఆ సంతా మాషాది. నువ్వు మాషాను పెళ్ళాడు. హాయిగా జీవితాన్ని అనుభవించు!"

'ఏమిటీ వితండధోరణి!' అని ఆశ్చర్యపోయాడు ఇల్యా.

♦ ♦ ♦

ఆఖరుకు ఎలాగయితేనేం- ఇన్నాళ్ళూ ఇల్యా కన్నకల నిజమైంది.

ఇల్యా ఫ్యాన్సీ దుకాణం పెట్టాడు. తెల్లారగానే కొట్టు తెరిచేవాడు. సాయంత్రంవరకూ కొట్లోనే ఉండేవాడు. వ్యాపారం ముమ్మరంగా సాగుతూ ఉన్నది. రకరకాలుగా ముస్తాబు చేసుకున్న అందగత్తెలు జడపిన్నులకోసం, సవరాల కోసం, రిబ్బన్లకోసం ఫ్యాన్సీ దుకాణానికి వస్తారు. ఒక్క

క్షణంకూడా తెరిచి ఉండదు. ఇల్యా ఈ వ్యాపారంలో పడి క్రమ క్రమంగా గతాన్ని విస్మరించసాగాడు.

గార్విన్ అనే ఒక పన్నెండేళ్ళ కుర్రాణ్ణి తన కింద అసిస్టెంటుగా నియమించాడు ఇల్యా.

గార్విన్‌ను చూచినప్పుడల్లా ఇల్యాకు తన బాల్యం జ్ఞాపకానికి వచ్చేది.

'ఒకేయ్ అబ్బాయ్! తీరిక సమయాల్లో ఏదైనా పుస్తకం చదువుకుంటూ కూచో- చదువుకుంటే పైకి వస్తావు' అనేవాడు ఇల్యా.

ఇల్యా ప్రతిరోజూ ఉదయం ఏడుగంటలకు దుకాణాన్ని తెరిచేవాడు. రాత్రి తొమ్మిది గంటలకు కాని దుకాణం మూసేవాడు కాదు.

గార్విన్ తీరికైన సమయాలలో ఇల్యా ప్రక్కనే కూచుని వచ్చిపోయే బాటసారులను చూస్తూ, లేక ఏదైనా పుస్తకం చదువుతూ కాలక్షేపం చేసేవాడు. ఎప్పుడైనా ఇల్యా, గార్విన్ ఇలా సంభాషించుకునేవారు :

"మీ నాన్న ఏంచేస్తూ ఉంటాడు గార్విన్?"

"మా నాన్న పోస్ట్ బంట్రోతండీ!"

"మీ కుటుంబం పెద్దదా?"

"చాలా పెద్దదండీ! పిల్లా జెల్లా బొచ్చెడంతమంది ఉన్నారు."

"ఏం చేస్తున్నార్రా పిల్లలంతా?"

"ఏదో కూలీ నాలీ చేస్తున్నారండీ!"

తరువాత గార్విన్ తన భవిష్యత్తును గురించి ఇల్యాకు ఇలా చెప్పసాగాడు. "నేను పెద్దవాణ్ణయ్యాక సైన్యంలో చేరుతాను. అప్పుడు యుద్ధం వస్తుంది. యుద్ధంలో నా వీరత్వాన్ని ప్రదర్శిస్తాను. అందరికన్నా ముందునడిచి శత్రువులను ఎదుర్కొంటాను. నన్ను మెచ్చి చక్రవర్తి బహూకరిస్తాడు. మా తాతయ్య జనరల్ గూర్కో ఇలాగే చేశాడు. ఆయన్ను కూడా చక్రవర్తి ఇలాగే బహూకరించాడు"

కుర్రాడు ఇలా తన భవితవ్యాన్ని ఊహించుకోనడం విని ఇల్యా చిరునవ్వు నవ్వాడు.

ఇల్యా ప్రతి సాయంత్రం దుకాణం మూసిన తరువాత దుకాణం వెనకాలే తను అద్దెకు పుచ్చుకున్న గది లోకి వెళ్ళి విశ్రాంతి పుచ్చుకుంటాడు. అతని గదిలో రెండు కుర్చీలు, టేబిల్, ఒక పడకమంచం తప్ప మరేం సామాన్లు లేవు. గది చాలా చిన్నది.

ఇల్యా గది గోడకు ఒక పటాన్ని వ్రేలాడదీశాడు. జననంనుంచి మరణంవరకు మానవ జీవితంలోని వివిధ ఘట్టాలు చిత్రించబడిన చిత్రం అది. ఇల్యా టేబిల్‌వద్ద కూచుని ఆ చిత్రంలోని వివిధ ఘట్టాలను పరిశీలిస్తూ గంటల తరబడి కాలం గడిపేవాడు.

అతన్ని అప్పుడప్పుడూ 'మానవు డెందుకు మరణిస్తాడు ?' అన్న ప్రశ్న ఎదుర్కొనేది.

ఎంత ఆలోచించినా అతనికి ఈ ప్రశ్నకు సమాధానం దొరికేది కాదు. కానీ ఆ విషయాన్ని గురించి అతను ఎక్కువగా ఆలోచించేవాడు కాదు.

నిజం చెప్పాలంటే ఇల్యా ఇప్పుడు ఏ విషయాన్ని గురించికూడా ఎక్కువగా ఆలోచించడంలేదు. అతని మనస్సును ఒకవిధమైన స్తబ్ధత ఆవహించింది. వడ్డీ వ్యాపారస్తుని హత్యా సంఘటన కూడా ఇప్పుడు అతని మనస్సును కలవరపరచడం లేదు. గగనంలో చిరుమబ్బులు అలా అలా వచ్చి తేలిగ్గా తేలిపోయినట్లుగా అనేక గత స్మృతులు అతని మనస్సులో ఇట్టే అవతరించి అంతలోనే అంతరించిపోతున్నాయి.

ప్రొద్దుగూకింది. ఇల్యా దీపం ఆర్పి పడుకున్నాడు. అతనికి చీకటి ఒక మహాసముద్రంలాగా కనిపించింది. ఆ సముద్రంలో అసలు ఒక అనంతమైన శూన్యంలోకి పోతున్నట్లుగా తోచింది.

మధ్య మధ్యలో పావెల్ వచ్చి ఇల్యాను చూచి వెళ్లేవాడు. అతను ఎప్పుడు వచ్చినా వీరాను గురించి మాట్లాడేవాడు.

కానీ ఇల్యా ఇప్పుడు ఏ విషయాన్నీ అంతగా పట్టించుకొనడం లేదు. ఎప్పుడూ పరధ్యానంగా ఒక విధమైన ధ్యాన సమాధిలో ఉన్నట్టు కనిపిస్తున్నాడు.

పెర్ఫిష్కా కూడా వచ్చి ఇల్యాను చూచి వెడుతున్నాడు. అతని కిప్పుడు మతి స్తిమితం తప్పిపోయింది. అతనూ అతని గిటారూ ఎక్కడికైనా తయారు. కానీ అతను కథలూ, కబుర్లూ చెప్పడం మటుకు మానుకోలేదు. నలుగురూ ఎక్కడ పోగయితే అక్కడికి వస్తాడతను. కథలల్లి చెబుతాడు. వాళ్ళు నాలుగు పైసలు విసిరేస్తే వాటిని ఏరుకుని కుక్షినింపుకుంటాడు. ఇలా సాగిపోతోంది అతని జీవనం.

"మాషా సమాచారం ఏమైనా తెలుస్తూ ఉన్నదా?" అని అడిగాడు ఇల్యా పెర్ఫిష్కాను.

"ఆ పిల్ల దాని సంగతి అడక్కు బాబూ! గుండెల్లో దుఃఖం దేవుకుని వస్తుంది. ఎక్కడుందో ఏమైందో కూడా భగవంతుని కెరుక!" - అన్నాడు పెర్ఫిష్కా.

ఒకరోజున ఇల్యా టీ తాగుతూ తనకూ, తాత్యానాకు ఉన్న సంబంధ బాంధవ్యాలను గురించి విచారించసాగాడు. తాత్యానా తనకు సహాయం చేసిన మాట వాస్తవమే. కానీ తాత్యానా కంటె తను వ్యాపారంలో హెచ్చు పెట్టుబడిని పెట్టాడు. అయినప్పటికీ తనకు స్వాతంత్ర్యంలేదు. తాత్యానాకు తనొక ఏజెంటులాగా ఉన్నాడు. ఈ భావం అతని మనస్సుకు స్ఫురించేసరికి ఇల్యాకు నిప్పుల్లో ఉంచి వేయించినంత బాధ కలిగింది. ఒకసారి తను తాత్యానాతో కావాలని ఇలా పోట్లాట వేసుకున్నాడు.

'నీవు సిగ్గూ ఎగ్గూ ఎరగని దానివి తాత్యానా!' - అన్నాడు ఇల్యా.

ఆవిడ నవ్వి ఊరుకుంది.

'అబ్బాయ్! ప్రపంచంలో మనం నడుచుకోవలసిన విధానం ఇది కాదు. ప్రపంచంలో మనం ఇమిడిపోవాలి. లోకంలోని మంచిచెడ్డలను మనం లెక్కిస్తూ కూచుంటే వచ్చే లాభంలేదు." అని నీతి బోధ చేసింది.

తాత్యానాకు ఇల్యాకు మధ్య ఏదో తెలియని ద్వేషం ఏర్పడసాగింది. ఈ సమయంలో ఇల్యా జీవితంలో మరో స్త్రీ

ప్రవేశించింది. ఈ అమ్మాయి గార్విన్ అక్కయ్య, అప్పు డప్పుడూ తన తమ్ముణ్ణి చూచిపోవడానికి దుకాణానికి వస్తూ ఉండేది. ఈవిడ సన్నగా పొడుగ్గా లతలాఉన్న ఈ అమ్మాయి ఇల్యాను ఆకర్షించింది.

ఈ అమ్మాయి ప్రవర్తన చాలా చిత్రమైనది. అమ్మాయి తల వంచుకుని దుకాణంలో అడుగుపెట్టేది. ఇల్యా ఒక కుర్చీని చూపి కూచోమనేవాడు. రెండుమూడు నిమిషాలు మౌనంగా కూచునేది.

తరువాత తమ్ముణ్ణి పిలిచి "మరి వెళ్ళివస్తానురా అబ్బాయ్ ! అల్లరి చిల్లర పనులు చెయ్యకుండా జాగ్రత్తగా ఉండు" అని చెప్పి ఇంటికి వెళ్ళేది. ఈ విచిత్రమైన ప్రవృత్తి వల్లనే ఇల్యాకు ఆ అమ్మాయిపట్ల ఆకర్షణ కలిగింది. ఒక రోజున ఆ అమ్మాయి ఒక పుస్తకాన్ని తీసుకుని వచ్చింది.

"ఆ పుస్తకాన్ని ఒకసారి నేను చూడవచ్చా ?" అన్నాడు ఇల్యా మర్యాదగా.

ఆ అమ్మాయి పుస్తకాన్ని ఇల్యాకు అందిస్తూ ఇలా చెప్పసాగింది :

ఈ పుస్తకం పేరు డాన్‌క్విక్సోట్. గొప్ప నవల. ఈ నవల్లోని కథానాయకుడు అన్యాయాన్ని అక్రమాన్ని ఎదుర్కొనడానికి తన జీవితాన్నంతనీ త్యాగం చేశాడు. కానీ చదువుతూ ఉంటే ఎంతో హాస్యరస ప్రధానంగా ఉంటుం దీ నవల.

రోజులు దొర్లిపోతున్నాయి. ఇల్యా వ్యాపారం నత్తగుల్లనడకలా సాగుతూ ఉంది. మధ్య మధ్యలో అతనికి

దుకాణం కట్టేసి ఎక్కడికైనా వెళ్ళాలనిపించేది. తాత్యా
చాతో కూడా అతని స్నేహం క్రమక్రమంగా అంతరించింది.

తాత్యా మటుకు ఈ విషయాన్ని అంతగా పట్టించుకో
లేదు. నవ్వి ఊరుకున్నది. ఇల్యాకు రానురాను జీవితం దుర్భ
రంగా కనుపించసాగింది. మానవులన్నా మానవ జీవితమన్నా
ఒక విధమైన రోత కలిగింది. మానవులంతా ఒకరి నొకరు
హింసించుకుంటున్నారు. అసూయతో ద్వేషంతో సతమత
మైపోతూ ఉన్నారు. అన్యాయం అక్రమం తప్ప మరి దేన్నీ
గౌరవించడంలేదు.

ఇల్యా తను చేసిన నేరాన్ని గురించి ఆలోచించ
సాగాడు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో అతనికి అగమ్య
గోచరంగా కనిపించింది.

ఒకరోజున ఇల్యా దుకాణాన్ని మూసివేస్తున్న సమ
యంలో ఒక స్త్రీ వ్యక్తి వచ్చి వాకిట్లో నిల్చుంది. ఇల్యా
మొదట ఆ వ్యక్తినిగుర్తించలేకపోయాడు. తరువాత కొంచెం
పరికించి చూచి మాషాను గుర్తుపట్టాడు.

"నన్ను గుర్తించలేకపోయావు కదూ ?" అన్నది
మాషా చిరునవ్వు నవ్వుతూ.

"ఎలా గుర్తించడం? ఎలామారిపోతావో తెలుసా?"
అన్నాడు ఇల్యా. మాషా ఇప్పుడు గుర్తుపట్టడానికే వీల్లేదు.
చిక్కి శల్యమైపోయింది.

"అన్నిటికీ కారణం అతనే. నా ఊపిరి పోసుకుంటు
న్నాడు" అన్నది మాషా.

ఇల్యా కళ్ళు చెమరించాయి' "అతని చిరాకూ అతని కోపం అంతా ఇంతా అని చెప్పడానికి వీల్లేదు. నా ఒళ్ళు హూనం హూనం చేస్తున్నాడు." అన్నది మాషా.

కాసేపు విశ్రాంతి తీసుకో" అంటూ ఇల్యా సోఫా చూపాడు. మాషా వెళ్ళి సోఫాలో పడుకున్నది.

♦ ♦ ♦

పావెల్ ఇల్యాను చూచివెడదామని వచ్చాడు.

"ఒరెయ్ అబ్బాయ్! దాన్ని పట్టుకున్నార్రా" -అన్నాడు పావెల్.

"అరేయ్ అబ్బాయ్! దాన్ని పట్టుకున్నార్రా" అన్నాడు పావెల్.

ఇల్యా ఆశ్చర్యపోయాడు.

"ఎవరిని?" అని ప్రశ్నించాడు.

"వీరాను పోలీసులు పట్టుకున్నారు. ఎవరో వ్యాపారస్థునివద్ద డబ్బు దొంగిలించిందట" అన్నాడు పావెల్.

ఈ మాటలు వింటూ మాషా నిద్రలేచి చూచింది.

పావెల్ కూడా మొదట్లో మాషాను గుర్తించలేక పోయాడు. ఇల్యా ఫలానా అని గుర్తుచేసిన తరువాత, "నువ్వా మాషా!" అన్నాడు. తరువాత పావెల్ మళ్ళీ వీరా కథను చెప్పసాగాడు. వీరా పోలీస్ వాణ్ణి కొట్టనుకూడా కొట్టిందన్నాడు పావెల్.

"నాకు తెలుసు ఈ కథ ఇలా ముగుస్తుందని" అన్నాడు ఇల్యా.

పావెల్, మాషాల చరిత్రలు ఇల్యాకు చెప్పరాని కోపాన్ని కలిగించాయి. కాని ఈ దురదృష్టానికంతకూ ఆహుతైనవారు తనకు ప్రియమిత్రులు. వారిపై తన కోపాన్ని ఎలా వెలిబుచ్చాలో ఇల్యాకు అర్థంకాలేదు.

ఈలోగా ఎవరో తలుపు తట్టిన శబ్దమైంది. ఆ వచ్చింది గార్విన్ అక్కయ్య. ఆవిడ లోనికి రాగానే ఇల్యా నమస్కరించాడు. కానీ ఆమె ప్రతి నమస్కారం చెయ్యలేదు.

"ఒకెయ్ అబ్బాయ్ ఒకసారి ఇలా రా. నీతో రెండు నిమిషాలు మాట్లాడాలి." తమ్ముణ్ణి పిలిచింది.

తను నమస్కరించినా గార్విన్ అక్క నమస్కరించక పోవడం ఇల్యాకు ఎంతో బాధ కలిగించింది.

కొంచెం నన్ను కూడా గమనించండి అమ్మాయి గారూ! నేను నమస్కరించినప్పుడు ప్రతి నమస్కారం చేస్తే వచ్చిన దోషం లేదు." అన్నాడు ఇల్యా. ఆ అమ్మాయి అందుకు మరేం జవాబు చెప్పలేదు. ఒకసారి కళ్ళెత్తి ఇల్యా వంక చూచింది. "నన్ను పొరపాటుగా అర్థం చేసుకోకండి" అని మాత్రం ఊరుకున్నది.

తరువాత ఇల్యా: "మేము చదువుకున్నవారం కాము. నీవు చదువుకున్న పిల్లవి. నీవు మా పట్ల ఆదరాను రాగాలు చూపాలి" అని మాషాను ఆ అమ్మాయికి పరిచయం చేశాడు. మాషా కథను ముక్తసరిగా ఆ అమ్మాయికి చెప్పాడు.

ఆ అమ్మాయి మాషా కథనంతనీ విన్నది, ఆ అమ్మాయి హృదయం ద్రవించి పోయింది. "మీరు ఈ అమ్మాయిని వెంటనే డాక్టరుకు చూపించాలి" అని తమ్ముణ్ణి

పిలిచి, "ఒకేయ్ అబ్బాయ్! బండిపిలు. నేనే తీసుకునివెళ్ళి నా స్నేహితుడు ఒక డాక్టర్‌కి చూపుతాను" అన్నది.

"అమ్మాయీ! ఏడవకు! నిన్ను డాక్టర్ దగ్గరికి తీసుకుని వెడతాను. ఒక్క నిముషంలో తిరిగి వచ్చేద్దాం" అన్నది.

తమ్ముడు బండిని పిలుచుకుని రావడానికి వెళ్ళాడు.

తరువాత ఆ అమ్మాయి మాషా దగ్గరికి వెళ్ళింది.

"అమ్మాయ్! మాషా! ఏడవకు నీకు వచ్చిన భయం లేదు" అని మాషాను ఓదార్చింది.

మాషా తన వీపు చూపింది. భర్త కొట్టిన గాయాలు నెత్తుటి మరకలు కనిపిస్తున్నాయి.

ఈలోగా గార్విన్ బండిని పిలుచుకుని వచ్చాడు. మాషాను ఆ అమ్మాయి డాక్టర్ వద్దకు తీసుకువెళ్ళింది.

♦ ♦ ♦

ఈ సంఘటన జరిగిన తరువాత ఇల్యాకు గార్విన్ అక్కయ్యకు స్నేహ పరిచయాలు అధికమైనాయి. గార్విన్ అక్కపేరు సోనియా. సోనియా రోజుమార్చి రోజయినా ఇల్యా దుకాణానికి వస్తూ ఉండేది. ఇల్యాతో పిచ్చాపాటీ మాట్లాడేది.

ఒకరోజున సోనియా, ఇల్యాను "నీకు ఇలా అస్తమానం దుకాణంలో కూచుని వస్తువులు అమ్ముతూ ఉండడమంటే ఇష్టమేనా ?" అని అడిగింది.

"ఇష్టమైనా కాకపోయినా మరి గత్యంతరం ఏమున్నది ?" అన్నాడు ఇల్యా.

"నీకు కష్టపడి పనిచేసే అలవాటు లేదనుకుంటాను" అన్నది సోనియా.

"ఇది కష్టపడి పని చెయ్యడం కాదా?" అన్నాడు ఇల్యా.

సోనియా చిరునవ్వు నవ్వింది.

"దుకాణంలో వస్తువులు అమ్మడం కష్టపడి పని చెయ్యడ మంటావా?" అన్నది.

అంతటితో ఆనాటి చర్చ ఆగిపోయింది.

ఇల్యాకు తీర్థయాత్రలకు వెళ్ళిన తెరంతి బాబాయ్ వద్దనుంచి ఉత్తరం వచ్చింది.

ఇల్యా ఆ ఉత్తరం చదవడం ముగించగానే గార్విన్ అక్క సోనియా వచ్చి ఎదురుగా నిల్చుని ఉండడం ఇల్యా చూచాడు. సోనియా ఎంతో అలసిపోయినట్లుగా కనిపిస్తున్నది. రాగానే, "కొంచెం మంచినీళ్లిస్తారా?" అని అడిగింది సోనియా.

ఇల్యా 'ఒక్క నిమిషం' అంటూ మంచినీళ్ళు తీసుకుని రావడానికి లోనికి వెళ్ళబోయాడు.

"ఉండండి నేనే తీసుకుంటాను" అంటూ సోనియా లోనికి వెళ్ళింది.

ఇల్యా లోనికి వెళ్ళిచూసేసరికి సోనియా "జీవిత ఘట్టాలు" చిత్రాన్ని అవలోకిస్తూ నిల్చుని ఉన్నది.

"ఏమిటీ వెర్రి చిత్రం" అన్నది సోనియా.

సోనియా అలా అనడం ఇల్యాకు కొంచెం బాధ కలిగింది.

తరువాత కొన్నాళ్ళకు సోనియా మళ్ళీ ఇల్యా దుకాణానికి వచ్చింది. తమ్ముడు గార్విన్‌కు కొత్తబట్టలు కుట్టించి తెచ్చి ఇచ్చింది. ఇల్యా సోనియా పిచ్చాపాటీ మాట్లాడుతూ వున్నారు.

"ఒకప్పుడు నువ్వు వ్యాపారం మంచిది కాదని అన్నావు. జ్ఞాపకం ఉన్నదా ?" అన్నాడు ఇల్యా.

"అవును" అన్నది సోనియా.

"కారణం ?"

"వ్యాపారస్థులు ఇతరుల కష్టాన్ని దోచుకుని జీవిస్తారు"

తరువాత సోనియా ఇలా చెప్పసాగింది. "నీవు రిబ్బన్లు ఒక ధరకు కొంటున్నావు. అంతకన్న ఎక్కువ ధరకు అమ్ముతున్నావు. ఈ ధరలకు మధ్యగల తేడా నీకు లాభం. ఈ లాభమే కష్టించినవారి సొమ్ము వ్యాపారమంటే చట్టసమ్మతమైన దొంగ తనం."

వ్యాపారం దొంగతనం ఒకటేనని సోనియా వ్యాఖ్యానించే సరికి ఇల్యాకు చెప్పరానంత కోపం కలిగింది.

"నీవు చాలా పొరబడుతున్నావు" అన్నాడు ఇల్యా.

సోనియా ప్రవర్తన ఇల్యాకు ఎంతో విచిత్రంగా కనిపిస్తూ ఉన్నది. ఆవిడ ఎంతో తెలివిగలదని అంటాడు పావెల్. కానీ తన దృష్టికి సోనియా గర్విలా కనిపిస్తోంది.

♦ ♦ ♦

రోజులు సాగిపోతున్నాయి. ప్రతి క్షణం ఒక నూతనానుభవం ఇల్యా జీవితంలో ప్రవేశించింది. ఇల్యాను కలవరపరుస్తూ ఉంది. ఒకనాటి ఉదయం ఇల్యా నిద్రపక్క నుంచి లేచాడు. కళ్ళు తెరిచీ తెరవడంతోటే ఎదురుగా తెరంతి బాబాయ్ కనిపించాడు.

తెరంతి తీర్థయాత్రలు ముగించుకుని వచ్చాడు.

"ఏరా అబ్బాయ్! ఎలా ఉన్నావు? భగవంతుడి దయవల్ల తీర్థయాత్రలు ముగించుకున్నాను. మళ్ళీ ఇల్లు చేరుకున్నాను" అన్నాడు తెరంతి.

"ఇప్పుడు నీకు మనశ్శాంతి చిక్కిందా?" అని ప్రశ్నించాడు ఇల్యా.

"ఇప్పుడు మనస్సుకెంతో హాయిగా ఉందిరా అబ్బాయ్" అన్నాడు తెరంతి.

తెరంతి దూరదేశాలు తిరిగి తీర్థయాత్రలు సేవించుకున్నందున ఎంతో అలసిపోయి ఉన్నాడు. అంచాత ఒక వారంరోజులపాటు ఎక్కడికీ కదలకుండా విశ్రాంతి తీసుకున్నాడు. తరువాత వెళ్ళి పెర్ఫిష్కాను పెట్రూశాను చూచి వచ్చాడు.

♦ ♦ ♦

ఇల్యా ఒక రోజున ఆదివారంనాటి దినపత్రికను చదువుతూ ఉండగా పావెల్ వ్రాసిన ఒక పద్యం కంటపడింది. "గతం, వర్తమానం" అన్న శీర్షికతో పావెల్ ఒక పద్యం వ్రాశాడు. ఆ పత్రికలోనే పీరా దొంగతనానికి కోర్టులో విచారింపబడగలదనే వార్తనుకూడా ఇల్యా చూచాడు.

దొంగతనాలతో దోపిళ్ళతో హత్యలతో ప్రపంచం క్షోభించిపోతూ ఉన్నది. మానవుల పేరాశ ఇల్యాకు ఎంతో అసహ్యాకరంగా తోచింది.

వర్షాలు ప్రారంభించాయి. రోజు విడిచి రోజు ముసురులు. పీరాను కోర్టులో విచారించే రోజు వచ్చింది. ఇల్యా కూడా కోర్టుకు వెళ్ళాడు. కోర్టు వాకిట్లో చాలామంది చేరి గుసగుసలాడుకుంటున్నారు.

ఇల్యా ఆ జనసమూహంనుంచి సందుచేసుకుని లోనికి వెళ్ళాడు. విశాలమైన హాలు. హాలుకు ఒకమూలన కోర్టు గుమాస్తా కూచుని ఉన్నాడు. "జడ్జీలు వస్తున్నారు" అని ప్రకటించాడు కోర్టు గుమాస్తా.

ఇల్యా కోర్టులో ప్రవేశిస్తూ ఉండగా పావెల్ కనిపించాడు. ఇల్యా పావెల్‌ను, "ఏరా, నీ పావురాయిపిట్టని చూచి వెడదామని వచ్చావా?" అని అడిగాడు.

"దాని సంగతి నా ముందు ఎత్తకు" అన్నాడు పావెల్.

పీరాను విచారణకొరకు కోర్టులోనికి తీసుకుని వచ్చారు. పీరా నిశ్చేతనమైన ప్రతిమలాగా కోర్టు సముఖంతో నిల్చున్నది.

విచారణ ప్రారంభించింది.

"ఏమమ్మాయ్ నీవు వేశ్యావృత్తి చేశావుకదూ?" ప్రశ్నించాడు జడ్జీ.

"చిత్తం" అన్నది పీరా

"పరిస్థితుల ఒత్తిడివల్ల నీవు ఈ వృత్తిలో ప్రవేశిం చావా ?" ప్రశ్నించాడు జడ్జీ.

"లేదు."

"మరి కారణం ?"

"ధనం సంపాదించాలనుకున్నాను. నాకు ఇంతకన్న గత్యంతరం కనిపించలేదు."

"నీవు దొంగతనం చేసిన మాటనిజమేనా ?"

"చిత్తం"

ఇల్యా అక్కడ ఒక్కక్షణంకూడా ఉండలేక పోయాడు. వీరా నాశనానికి కారణం పావెల్. ఇల్యా లేచి చరచరా వెలుపలికి వెళ్ళాడు. ఒక బండి కట్టించుకుని కిరిక్ గృహానికి వెళ్ళాడు.

"నమస్కారటోయ్ అబ్బాయ్ ! మీ స్నేహితురాలికి బహుమతులు ఏమీ తీసుకుని రాలేదా ?" అంటూ ఆహ్వా నించాడు కిరిక్.

"ఇంతకాలం ఎక్కడున్నావ్? కనుపించడమే మానే శావు" అన్నది తాత్యానా.

కిరిక్ ఇల్యాను లోనికి తీసుకుని వెళ్ళాడు. లోపల అతిథులు చాలా మంది కూచుని విందు ఆరగిస్తూ ఉన్నారు.

"ఈ రోజు కోర్టుకు వెళ్ళాను. నాకు పరిచయం ఉన్న ఒక స్త్రీని విచారణ చేశారు. ఆ అమ్మాయి వేశ్య..." అన్నాడు ఇల్యా.

అతిథులంతా అతని మాటలను వినసాగారు. "ఈ అమ్మాయి దొంగతనం చేసింది. అంచాత అరెస్టు చెయ్యబడింది." అన్నాడు ఇల్యా.

"తాత్యానా, ఇల్యా ఒక మంచి కథ చెబుతూ ఉన్నాడు. వింటున్నావా" అన్నాడు కిరిన్.

"ఇలాటి గమ్మత్తు కథలు చాలా విన్నాను." అని లోపలి నుంచి జవాబు చెప్పింది తాత్యానా.

ఆ అతిథులనూ ఆ విందునూ ఆ వాతావరణాన్ని చూచినప్పుడు ఇల్యాకు ఎందుచేతనో ఏదో అన్యాక్రమైన కోపం కలిగింది.

"మహాశయులారా! మరో మాట చెబుతున్నాను వినండి. ఈ అమ్మాయిని విచారణ చేసిన పెద్దలలో ఈ అమ్మాయిని వాడుకున్న వారుకూడా ఉన్నారు. ఈ విషయం నాకు తెలుసు" అన్నాడు ఇల్యా.

"జూరీ పెద్దలనే ఆక్షేపిస్తున్నావా?" అన్నాడొక అతిథి.

ఇల్యా భగ్గుమని మండిపడ్డాడు.

"పంచులు ఆరగించే పెద్దలూ దొంగలే" అన్నాడు.

"కిరిన్ - ఇది మాకు అవమానకరంగా ఉన్నది" అన్నారు కొందరు అతిథులు.

కిరిన్ కూచున్న చోటి నుంచి లేచి సరాసరి ఇల్యా వద్దకు వెళ్ళాడు "ఇల్యా! ఇలా మాట్లాడటం నీకు మర్యాదగా లేదు" అన్నాడు.

ఇల్యా తాత్యానాను సమీపించాడు. "అమ్మాయ్ ఈ గ్లాసు ద్రాక్ష రసం పుచ్చుకో" అని ద్రాక్షరసాన్ని అందించాడు. తరువాత కిరిన్ వైపు తిరిగి, "కిరిన్. నీవూ ఈ ద్రాక్షరసం పుచ్చుకో. అలా చూస్తూ నుంచుంటావేం ? అసలు విషయాన్ని నీతో కుండ బ్రద్దలుకొట్టినట్లు చెబుతున్నాను, మరేం అనుకోకు. నీ భార్య నాకు ఉంపుడుగత్తె. ఆవిడ ఒంటి మీద పుట్టుమచ్చలు ఎక్కడెక్కడ ఉన్నవో చెప్పనా!" అని పకాలున పగలబడి నవ్వసాగాడు ఇల్యా.

"పిచ్చి ! - ఇతనికి పిచ్చి !" అని అరిచారు అతిథులు. మరికొందరు అతిథులు పరిహాస సూచకంగా కిరిన్ వైపు చూచారు.

"ఉండండి. నేను పోలీసులను పిలుచుకుని వస్తాను" అంటూ ఒక అతిథి అక్కడినుంచి వెళ్ళాడు.

తరువాత ఇల్యా అతిథులందరివైపూ తిరిగి ఇలా చెప్పసాగాడు :

"తాత్యానా నిజాన్ని ఏదో బైటపెట్టాను. కానీ ప్రపంచమంతా ఇలాగే ఉన్నది. ఎటుచూచినా దగా! తాత్యానా ! విను ! నీతో కలిసి నేను నడుపుతున్న దుకాణానికి పెట్టుబడి భాగం ఎక్కడిదో తెలుసా ? నేనొక వడ్డీ వ్యాపారస్థుణ్ణి హత్య చేశాను. అతనిదీ ఈ డబ్బు"

అతిథులంతా స్తబ్ధులయ్యారు. కిరిన్ లోనికివెళ్ళి రివాల్వర్ తెచ్చాడు.

ఇల్యా తలవంచుకుని కుర్చీలో కూచున్నాడు. అతనిలో ఏదో శూన్యం ఆవరించినట్లుగా తోచింది. ఈలోగా పోలీసులు వచ్చారు. కిరిల్ వారికి ఇల్యాను చూపుతూ "ఇతనే పావెల్‌ను చంపిన వ్యక్తి" అన్నాడు.

పోలీస్ ఆఫీసర్ ఇల్యా వంక చూచాడు. "అబ్బాయ్! నీ అంతరాత్మ నిన్ను క్షోభపెట్టిందా? అంచేతనే నిజం చెప్పావా?" అని ప్రశ్నించాడు.

"నాకు అంతరాత్మ లేదు" అన్నాడు ఇల్యా.

"సరే నాతో రా" అన్నాడు ఆఫీసరు

"పదండి" అన్నాడు ఇల్యా.

"నీవు తప్పించుకు పోవడానికి యత్నించకూడదు" అన్నాడు ఆఫీసర్.

"సరే" అన్నాడు ఇల్యా.

"ఈశ్వరునిపై ప్రమాణం చెయ్యి"

"నాకు ఈశ్వరునిలో నమ్మకం లేదు."

♦ ♦ ♦

పోలీసులు ముందు నడుస్తున్నారు. ఇల్యా వెనుకే నడుస్తున్నాడు.

అతనికి కోర్టు, కోర్టు విచారణ అన్నీ జ్ఞాపకం వచ్చాయి. ఇల్యా తన శక్తినంతా కూడగట్టుకుని ఒక్క పరుగు తీశాడు.

"పట్టుకోండి" పోలీస్ ఆఫీసర్ కేక వేశాడు.

ముందు ఇల్యా వెనుక పోలీసు.

ఇల్యా పరుగు తీస్తున్నాడు. ప్రపంచమంతా రంగుల రాట్నంలా గిర్రున తిరుగుతూ ఉంది. ముందు గోడ అడ్డుతగిలింది. పోలీసుల బూట్లచప్పుడు.

"పట్టుకోండి" అని అరుపులు కేకలు వినిపించాయి. అడుగుల చప్పుడు.

"చనిపోయినట్టుగా ఉన్నాడు" అన్నాడొక పోలీసు.

మరొక పోలీసు అగ్గిపుల్ల వెలిగించి చూచాడు. అతని పాదాలవద్ద తలచితికిన నాగసర్పంలా గిలగిలలాడుతూ పడిఉన్న ఇల్యా కనిపించాడు.

"గోడకు తల గొట్టుకొని చనిపోయాడు" అన్నాడు పోలీసు.

"పాపం! ఏమైతేనేం? అతని ఆత్మ శాంతిస్తుందిగా" అంటూ సానుభూతి చూపాడు పోలీస్ ఆఫీసర్.

Blank Page